# కథామంజరి

## పది కథల సమాహారం

## జన్మదిన సంచిక

జూలై 2022

# కథామంజరి

## పది కథల సమాహారం



**కథా మార్గదర్శి**


జయంతి ప్రకాశ శర్మ
సంపాదకుడు

అవసరాల వెంకటరావు
ప్రచురణ కర్త



**జూలై 2022**

సంపుటి : 3 ♦ సంచిక : 7

ఈ నెల కథామంజరి సంచికకి

పోషకులైన కథాభిమానులు

**శ్రీ గంగాధరభట్ల వేంకటేశ్వర ప్రసాద్,**

**శ్రీమతి మండలీక కామేశ్వరమ్మ**

దంపతులకు

మా హృదయపూర్వక

**కృతజ్ఞతలు**



# మా జట్టు

సంపాదకుడు

**జయంతి ప్రకాశ శర్మ**

ప్రచురణ కర్త

**అవసరాల వెంకటరావు**

సంపాదక సహకారం

**ఎం.ఏ. పద్మనాభరావు**
**కృపాకర్ పోతుల**

ప్రచురణా సహకారం

**ఎం.ఎల్. కాంతారావు**

సాంకేతిక సహకారం

**Harbinger Publishing**

బొమ్మలు

**కొయిలాడ రామ్మోహనరావు**
**కొచ్చెర్ల వి.ఆర్.**
**సూరంపూడి చలపతిరావు**



# కథామంజరి శ్రావ్యసంచిక

## ఈ నెల శ్రావ్యసంచికకి
## 'గళ' సహకారం అందించిన కళాకారులు

- శ్రీ పప్పు భోగారావు గారు
- శ్రీ వెంపటి కామేశ్వరరావు గారు
- శ్రీ భువనపల్లి రంగనాథం గారు
- శ్రీమతి కరవది సరస్వతి గారు
- శ్రీ బి.ఎస్. మూర్తి గారు
- శ్రీ అవసరాల రాఘవరావు గారు

శ్రావ్యసంచిక కోసం ఇక్కడ నొక్కండి

శ్రావ్యసంచిక సబ్ స్క్రైబ్ చేయడానికి ఇక్కడ నొక్కండి

# అభినందనలు ఆశీర్వచనాలు



కథామంజరి అంతర్జాల పత్రిక రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంలో నావి నాలుగు మాటలు:

గడిచిన మూడునాలుగు సంవత్సరాలు మొత్తం ప్రపంచం అంతటికీ గడ్డు రోజులైతే, తెలుగు సాహిత్యానికి మరింత గడ్డు దినాలుగా పరిణమించాయి! కారణం.. గొప్పగొప్ప సంస్థల నుండి వెలువడే మాసపత్రికల, వారపత్రికల ప్రచురణ నిలిచిపోవడమే! ఈ పరిణామం వల్ల తెలుగు పాఠకులకు, తెలుగు రచయితలకు గొప్ప వెలితి ఏర్పడిందనటంలో ఎటువంటి సందేహం లేదు.

అదిగో, అటువంటి సమయంలో ఎటువంటి ఫలాపేక్ష లేకుండా కేవలం మంచి కొత్త కథలను తెలుగువారికి అందించాలనీ, అలాగే గడచిన కాలంలో రచనలు సాగించిన గొప్ప గొప్ప రచయితల జీవితాలను, వారి కథలను పాఠకులకు పరిచయం చేయాలనీ.. ఈ మంచి ఉద్దేశ్యాలతో రెండు సంవత్సరాల క్రితం ప్రారంభించబడి దిగ్విజయంగా తెలుగు పాఠకులకు సమయానికి అందించబడుతున్న ఏకైక ఉచిత తెలుగు అంతర్జాల కథా సమాహారం కథామంజరి.

మీ మెయిల్ చిరునామా పంపితే చాలు! నెల మొదటి తారీఖున రసగుళిక లాంటి అద్భుతమైన పది కథలు మీ మీ ముంగిట్లో వచ్చి వాలతాయి, అది కూడా ఉచితంగా!

ఇంకా ఒక ప్రముఖ సీనియర్ రచయిత జీవిత వివరాలు, వారి కథ లేదా వారు మెచ్చిన కథ కూడా పత్రికలో చోటుచేసుకుంటున్నాయి. అంతే కాకుండా ప్రాయోజితుల సహకారంతో కథల పోటీలు ఏర్పాటు చేసి, ధన రూపంలో బహుమతులను కూడా పంచి ఇచ్చే సత్కార్యమూ జరుగుతోంది.

ఇది నిజమైన సాహిత్య సేవ అని నేను నమ్ముతున్నాను.

కథా మంజరి సంపాదక వర్గానికి, వారికి సహకారం అందిస్తున్న ఇతర సభ్యులు అందరికీ నా నమోవాకాలు. మనః పూర్వక అభినందనలు.

**ద్విభాష్యం రాజేశ్వరరావు**




మాన్య మిత్రులు 'కథామంజరి' జట్టు.. అందరికీ అభినందనలు.

తప్పటడుగులు పడకుండా 'కథామంజరి' రెండేళ్ళు నడవటం.. మీ చిత్తశుద్ధికీ, నిబద్ధతకూ, శ్రమకూ దర్పణం. మూడో ఏడు పురోగమనానికి స్వాగతం, శుభాకాంక్షలు! ఐదు ప్రత్యేక సంచికలూ, ప్రత్యేకతని నిరూపించుకున్నాయి. కథల పోటీలు విలక్షణంగా, విహారి నిరాపేక్షా దర్శనంగా సాగేయి. చేయి తిరిగిన కథకులూ, ఔత్సాహికులూ పత్రికతో తోడు నడుస్తున్నారు. ...ం నిదర్శనం. 'టీం స్పిరిట్' మీ పరిణత మనస్కతకు ఋజువు! సాగించండి చైతన్య యాత్ర. హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు!

కథ, కథామంజరి కలకాలం నిలుస్తాయి. పఠితల ఆదరాన్ని గెలుస్తాయి! శుభం!!


**విహారి**



'కథామంజరి' మాస పత్రిక బాల్యావస్థలో శిశుదశలో రెండేళ్ళు గడచి, బుడి బుడి నడకల స్థాయికి చేరింది. పట్టుదలతో కొందరు మిత్రుల సంకల్పబలం దన్నుగా కేవలం కథలకే ప్రాధాన్యతనిచ్చిన వీరిని అభినందిస్తున్నాను. ఒక్కొక్క నెల ఒక్కొక్క ప్రముఖ కథా రచయితను పరిచయం చేయడమనే సత్సాంప్రదాయం కొనసాగించాలి. తెలుగు పత్రికల సాహిత్య సాంస్కృతిక సేవ – అనే అంశంపై నేను కేంద్ర సాంస్కృతిక శాఖ వారి స్కాలర్షిప్ కింద పరిశోధన 2015–17 చేసి గ్రంథం ప్రచురించాను. ఆ సందర్భంలో 1860 నుండి వచ్చిన తెలుగు పత్రికల పుట్టు పూర్వోత్తరాలను అవలోకనం చేశాను. సాహిత్యపత్రికలు రెండు, మూడేళ్ల పరిమిత కాలంలో మూతబడటం విచారకరం. కథలకు ఆ పత్రికలు ప్రాధాన్యం ఇచ్చాయి.

24 సంచికలు పూర్తి చేసుకుని రజతోత్సవ సంచికకు మస్తాబవుతున్న కథామంజరి సంస్థాపక సభ్యులకు దిగ్విజయోస్తు– కథ ఒక సజీవ నదీ స్రవంతి. దీనికి భగీరథ ప్రయత్నం చేస్తున్న జయంతి ప్రకాశశర్మ కృషి వెనుక ఎందరో సహాయ సహకారాలున్నాయి. కథలు ఎంపిక చేయడం, వాటిని ఎడిట్ చేసి సంచికగా రూపొందించడం ఒక బృహత్ ప్రణాళిక. వీలైతే కథల పోటీ నిర్వహించే ఆలోచన చేయండి. ఉచిత సలహాలకు ఆంధ్రులు ప్రసిద్ధులు గదా! జయోస్తు!

**డా. రేవూరు అనంత పద్మనాభరావు**
విశ్రాంత అదనపు డైరెక్టర్ జనరల్, దూరదర్శన్, ఢిల్లీ



కథామంజరి అంతర్జాల మాసపత్రిక అప్పుడే రెండు వసంతాలు చూసి, బుడి బుడి అడుగులు దాటి, మూడో వత్సరం వైపు వడివడిగా అడుగులు వేస్తోందంటే కొంత ఆశ్చర్యంగానూ, ఎంతో సంతోషంగానూ ఉంది.

ఎంత వెండి పళ్ళానికైనా గోడ చేరువ ఉండాలి అన్నట్టు, ఎంత మంచి కథ రాసినా, అది వెలుగు చూసి, పదుగురు పాఠకులని చేరాలంటే, ఒక పత్రిక అవసరం తప్పనిసరి.

కరోనా ప్రభావం లేదా సాకుతో, అనేక పత్రికలు మూతబడుతున్న తరుణంలో రచయితలకు చేయూతనే కాకుండా, పారితోషికం కూడా ఇస్తూ, పాఠకులనుంచి చందా కూడా ఆశించకుండా, ఉచితంగా పత్రిక అందించి, ఇటు రచయితలనీ, అటు పాఠకులనీ కూడా ఆదుకునే సాహసానికి ఒడగట్టారు కథామంజరి బృందం.

ధైర్యే సాహసే లక్ష్మీ అన్నారు పెద్దలు. లక్ష్మీదేవి వీరికి, ఆయనకి అడుగడుగునా తోడు నిలిచి, కథామంజరి బృంద సభ్యులని ఆర్థికంగా ఎలా ఉన్నా, యశోరూపంలో ఘనంగా వరించింది.

కథామంజరి నాణ్యమైన కథలను అందించటానికి చేస్తున్న కృషి, పెడుతున్న పోటీలు ప్రశంసనీయంగా ఉంటున్నాయి. పత్రికా ప్రపంచంలో మొదటిసారిగా శ్రవణ సంచికను కూడా ప్రవేశపెట్టిన ఘనత కథామంజరిదే.

కథామంజరిని తెచ్చే ప్రయత్నంలో ఆదినుండీ లబ్ధ ప్రతిష్ఠులైన రచయితల అండ పొందగలగటం శర్మగారి నిస్వార్థ కృషికి తార్కాణమే.

కథామంజరి ఇంతకింత ఎదుగుదలతో దశ వార్షికోత్సవం జరుపుకోవాలని ఆకాంక్షిస్తున్నాను.

**పి.వి.ఆర్. శివకుమార్**



శుభాకాంక్షలు. తెలుగు కథానిక పాశ్చాత్య సాహిత్య ప్రభావంతో పుట్టినా, అది పూర్తిగా తెలుగుదనం నింపుకొని విరాజిల్లుతున్నది. 140 ఏళ్ళకు మించిన చరిత్ర గల తెలుగు కథానిక అత్యంత పరిణత దశకు చేరింది. వస్తు వైవిధ్యం, శిల్ప పరిణతి తెలుగు కథ సొంతం. ప్రపంచ తెలుగు కథా సాహిత్య చరిత్రలో తెలుగు కథానిక తనదైన స్థానం పదిలపరుచుకుంది. ఇందుకు కథా రచయితల కృషి, తెలుగు పత్రికల ఆదరణ, పాఠకుల అభిరుచి కారణాలు. "కథానిలయం" వంటివి కథల సంరక్షణకు పూనుకోవాలసిన స్థితిని తెలుగు కథానిక చేరుకుంది. తెలుగు కథా విమర్శకుల, పరిశోధకుల కృషిని కూడా ఈ సందర్భంలో గుర్తు చేసుకోవాలి. కథా రచనను నిరంతరం ప్రోత్సహించడానికి అనేక సంస్థలు కృషి చేశాయి, చేస్తున్నాయి. గోపీచంద్, రావిశాస్త్రి, మధురాంతకం రాజారం వంటి కథా రచయితల పేర్లమీద పురస్కారాలు స్థాపించడం కథకులకు గొప్ప ప్రోత్సాహం. వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్ సంపాదకత్వంలో ప్రతి ఏడాదీ కథా సంకలనాలు రావడం కథకులకు మరింత గుర్తింపు తెస్తున్నది. శాంతి నారాయణ, కొలకలూరి ఇనాక్, బి ఎస్ రాములు వంటి వాళ్ళ పురస్కారాల ద్వారా కథకులను గౌరవిస్తున్నది. ప్రపంచీకరణ ప్రవేశం తరువాత తెలుగు కథకు మరింత వెసులుబాటు వచ్చింది. ఈ పత్రికలు తెలుగు కథానికకు అవసరమైనంత స్థలం కేటాయించడం సంపూర్ణ కథల పుట్టుకకు అవకాశం కలిగింది.

'కథామంజరి' తెలుగు కతాభివృద్ధికి చేస్తున్న దోహదం అనల్పం కాదు. ప్రామాణికమైన కథలకు కథామంజరి విలువనిస్తున్నది. కథామంజరి వ్యాపార ధోరణికి తావు ఇవ్వడం లేదు. కథల ఎన్నికలో నైతికతకు, ప్రజాస్వామ్యానికి, పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నది. 'కథామంజరి' ఒక సంచికకు కథలను ఎన్నిక చేసే బాధ్యతను శర్మగారు నాకు అప్పగించినప్పుడే ఆయన సంస్కారం నన్ను ముగ్ధుడ్ని చేసింది. కథా రచయితలకు తనేదో గుర్తింపు తెస్తున్నానన్న ఇగో వారిలో కనిపించకపోవడం నాకు ముచ్చటగొల్పింది. నా నిర్ణయాన్ని గౌరవంతో ఆయన స్వీకరించడం నాకు చాలా ఆనందకరమైంది. తెలుగు కథానికల ప్రామాణీకతను పరిరక్షించే 'కథామంజరి' మూడవ ఏడాదిలోకి ప్రవేశిస్తున్న సందర్భంగా, నా హృదయపూర్వకమైన శుభాకాంక్షలు అందజేస్తున్నాను.

**రాచపాళెం చంద్రశేఖర రెడ్డి**



కథామంజరికి వెబ్ పత్రికలలో ఒక విశిష్టమైన స్థానం ఉంది. వీరి ముఖ్యమైన ప్రత్యేకత ఏమంటే ప్రతినెలా ఒక సుప్రసిద్ధ రచయితను అతిధిగా ఆహ్వానించి, ఆ రచయితను కథామంజరి పాఠకులకు పరిచయం చేస్తారు. సీనియర్ రచయితలను నేటితరం పాఠకులకు పరిచయం చేయటం ద్వారా వారిలో ఆరాధనా భావాన్ని, గౌరవాన్ని పెంపొందించడం జరుగుతుంది.

అలాగే ఆయా రచయితలు వ్రాసిన కథాలలో పేరొందిన రచనను ఆ నెల పత్రికలో ప్రచురిస్తారు. అంతేకాక ఆ రచయిత సాహితీ ప్రస్థానాన్ని వారి మాటలలోనే చెప్పిస్తారు. ఆ నెలలో ప్రచురితమయ్యే కథలను కూడా వారి చేతనే ఎంపిక చేయిస్తారు. ఇలా సుప్రసిద్ద రచయితలను పాఠకులకు సమగ్రంగా పరిచయం చేస్తూ, పత్రిక నిర్వహణలో పాల్గొనేటట్లు చేసే పత్రిక ఇదొక్కటే!

ఇలాటి మరి కొన్ని కొత్త అంశాలను జోడించి, కథామంజరి ముమ్ముందు దిన దిన ప్రవర్ధమానమౌతుందని ఆశిస్తూ..

**పరిమళ సోమేశ్వర్**



ముచ్చటగా మూడోఏట అడుగిడుతున్న బుడిబుడి నడకల బుజ్జి పాపాయి కథామంజరికి శుభాకాంక్షలు. సువాసనాభరిత కథా కుసుమమాలికలతో, గత రెండేళ్లుగా అందంగా అలంకరించి నడిపిస్తున్న సంపాదకవర్గానికి అభినందనలు! తెలుగులో కథా రచయితలు ఎక్కువ.

గత రెండేళ్లుగా, క్రమంగా తగ్గిన పత్రికల సంఖ్య, పుస్తకప్రచురణ ఎదుర్కొంటున్న అనుకూల వాతావరణలేమి వగైరాలు వల్ల, శిశిరఋతువుకు వెళ్లక, కథా ప్రక్రియను చిగురులతో, ఆకులతో నిలబెట్టింది కథామంజరి వంటి వెబ్ పత్రికలే. అందువల్ల వీటికి ఒక చారిత్రిక ప్రాముఖ్యముంది. ఇప్పుడు మనం ఒక పరిణామపు వాకిట్లో ఉన్నాం. అంతర్జాలమే అధ్యాపకుడిగా, రిఫెరెన్స్ పుస్తకంగా, పత్రికగా, సర్వస్వంగా క్రమంగా మారుతున్న ఈ తరుణంలో, సాహిత్యం కూడా సులభంగా లభ్యమయేలా ఉంచితెనే మంచిదేమో! మిత్రుడు జయంతి శర్మకి, ఇతరులకూ అభినందనలు.. శుభాకాంక్షలు!

**ఎల్.ఆర్.స్వామి**
కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు గ్రహీత



కథామంజరి బృందానికి అభినందనలు! మీ కృషి, మీ శ్రద్ధా, మీ ప్రయత్నం, సమయపాలన ప్రశంసనీయం!!

రాయడానికి బొత్తిగా తయారుగా లేని నాలాంటి వాళ్ళని కూడా తయారుచేసే మీ ఈ ప్రయత్నం కూడా నిజంగా మెచ్చుకోవలసినదే. అదే లేకపోతే ఈ రెండు ముక్కలు కూడా రాసేవాడినా? అనుమానమే.

ఇంత అద్భుతమైన మీ సంకల్పానికీ, కృషికీ దక్కుతున్న ఫలితాలు మాత్రం ఆసక్తికరంగా లేవు. కథలకోసం ప్రత్యేకంగా మీరు తీసుకువస్తున్న 'కథామంజరి' లో.. కథల స్థాయి మాత్రం చెప్పుకోదగిన స్థాయిలో లేదు. అది ఏ మాత్రం మీ లోపం కాదు. కారణాలు పరిశీలించవలసిన అవసరం ఉంది. ఏం చేయాలో కూడా ఆలోచించాలి.

మీ పత్రికలో 'రాంబో' పేరుతో వస్తున్న మినీ విమర్శనాత్మక విశ్లేషణలు బావుంటున్నాయి. ప్రతీసారీ కనీసం ఒక కథని ఇంకొంచెం వివరంగా విశ్లేషిస్తే బాగుంటుందేమో.

గతంలో జీవించలేము, జీవించరాదు. కానీ గతంలోంచి గమనిస్తూ, గ్రహిస్తూ వర్తమానాన్ని వీక్షించడానికి వీలుగా మీరు ప్రచురిస్తున్న ప్రముఖ కథకుల కథల ప్రత్యేక విశ్లేషణలు బావుంటున్నాయి.

మళ్ళీ కొత్త కథకుల కథలకి సరికొత్త సాహితీ వైద్యం చేయగలరా వసుంధర గారు? ఆలోచించండి.

సంవత్సరానికి ఒకసారైనా (కథా) సాహిత్య సింహావలోకనం విహారిగారిలాంటి ఉత్తమ విమర్శకుల చేత చేయించే సాధ్యా సాధ్యాలను పరిశీలించండి.

ఇతర భారతీయ భాషల నుండి గాని, ఆంగ్లం నుండి గాని అనువాద కథ నెలకోకటి చొప్పున వేయడం వీలవుతుందా? మిస్టరీ, క్రైమ్, డిటెక్టివ్ కథలు పాతవైనా, కొత్తవైనా అడపా దడపా చేర్చగలరు?!

**మెడికో శ్యామ్**



శర్మగారు మీ కథామంజరి వెబ్ మ్యాగజైన్ దిగ్విజయంగా రెండు సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంలో జన్మదిన సంచిక తేవాలనుకోడం ముదావహం. అందుకు ముందుగా మీకు మీ పత్రికకి శుభాభినందనలు .


పత్రిక నడపడం అంటే మాటలు కాదు అనే విషయం నాకు తెలుసు! ఎంతమందిని కూడగట్టాలో, ప్రతీది స్వయంగా పర్యవేక్షించడం, వేళకి పత్రిక విడుదలయ్యేట్టు చూడడం.. మాటలు కాదు. అందులో "ఈ" మాగజైన్లు వచ్చాక కంప్యూటర్ అనుభవం ఉండి తీరాలి. అచ్చులో అయితే కథలు, నవలలు, మిగతా మాటర్ సెలెక్ట్ చేసి ఇచ్చేస్తే, ఎడిటర్ బాధ్యత అయిపోతుంది. ముద్రణ, ప్రూఫ్ రీడింగ్, అన్నిటికి స్టాఫ్ వుండి పత్రిక విడుదలకి ఎవరి పనులకి వారు బాధ్యులుంటారు. ఇది అలాకాదు, అన్ని స్వయంగా చూసుకోవాల్సి ఉంటుంది.. బాధ్యత తీసికున్నాక! పత్రికలూ అచ్చులో రావడం ఆగిపోయిన వేళ, రాయదల్చిన, కుతూహలంతో రాసే యోంగ్ రైటర్స్, వెబ్ పత్రికల మీద ఆధారపడక తప్పదంలేదని కథామంజరిని చూస్తే అర్ధం అవుతుంది. పేరున్న రచయిలతో పాటు ఎందరో కొత్తవారు కనిపిస్తున్నందుకు వారికో వేదిక దొరకడం సంతోషం.

నాలాటి పాతతరం వారు ఏ కొద్దిమందో తప్ప, మిగతా అందరు వెబ్ మ్యాగజిన్ వైపు ఇపుడిపుడే మళ్లుతున్న వేళ.. మీ కథామంజరి రోజురోజుకి మరింత ఎదిగి పేరు తెచ్చుకోవాలని ఆశిస్తున్నా .

రచయిత పేరుకి కాక, రచనలకి ప్రాధాన్యమిచ్చి రచన ఎంచుకోవాలని, అలా అయితే మెరిట్ వున్న కొత్త రచయితలు పుట్టుకొస్తారు.. భావితరాల్లో సాహిత్యాన్ని నిలబెట్టేందుకు!


కొత్తతరం రచయితలని తయారుచేయాల్సిన బాధ్యత మీలాటి సంపాదకులదే! మరోసారి కథామంజరికి శుభాభినందనలు.

**దూర్వాసుల కామేశ్వరి**



నమస్కారం! సమాజహితాన్ని కోరేది సాహిత్యమైతే, అందులో అత్యంత ప్రభావశీలమైన ప్రక్రియ కథ. ఆ కథల్ని పాఠకులకు అందించడానికి నేటి తరానికి అనువైన అంతర్జాలాన్ని వేదికగా ఎన్నుకున్న కథామంజరి తెలుగు పత్రికారంగంలో ఒక ఆదర్శ ప్రయోగం. రచయితల నేపథ్యంతో నిమిత్తం లేకుండా, గొప్ప కథలకే ప్రాధాన్యం. ఔత్సాహికులకు ప్రోత్సాహం. విశిష్ట కథకులు, విశిష్ట రచనల పరిచయం. ఇదీ గత రెండు సంవత్సరాలుగా కథామంజరి సమర్థవంతంగా సంతరించుకున్న ప్రత్యేకత, విశిష్టత. నిర్వాహకులకు అభినందనలు, అభివందనాలు, శుభాకాంక్షలు.

**వసుంధర**



మానవ దేహం అనారోగ్యంతో క్షీణిస్తున్నప్పుడు ప్రధానంగా ఇచ్చేది సెలైన్. పత్రికలు ఒక్కటొక్కటి వివిధ కారణాలతో మూతపడుతూ రచయితలను ఎంతగానో నిరుత్సాహపరుస్తుండగా కథామంజరి అంతర్జాల మాసపత్రికగా రెండు సంవత్సరాల క్రితం జయంతి ప్రకాశశర్మగారి సంపాదకత్వంలో, సాహితీ మిత్రుల సహకారంతో ఆవిర్భవించి సెలైన్ రూపంలో రచయితలకు కొత్త శక్తిని ఇస్తూ ప్రోత్సాహిస్తోంది.

అచ్చులో వచ్చే పత్రికలకే పాఠకుల ఆదరణ తగ్గిపోతున్న సమయంలో అంతర్జాలంలో ఓ తెలుగు పత్రికను తేవాలనుకోవాటమే సాహసం. రెండు సంవత్సరాలుగా నిర్విఘ్నంగా నెలనెలా విలువలు పెంచుకుంటూ ముందుకు దూసుకు వెళుతుండటం నిర్వాహకుల పట్టుదలకు ప్రతీక. తమ పత్రిక ద్వారా పాఠకులకు మంచి కథలు ఇవ్వాలనే సత్సంకల్పంతో పోటీలు పెట్టి బహుమతులు ఇవ్వటం ముదావహం. ప్రత్యేక సంచికలు సరేసరి.

ఈ అంతర్జాల మాసపత్రిక మూడో సంవత్సరంలో కాలు పెట్టటం రచయితలకు, పాఠకులకు ఎంతో ఆనందాన్ని కలిస్తున్నది. లేత కొమ్మగా వేళ్లూని, బలాన్ని పుంజుకుని, విశాల వృక్షంగా మారి రంగురంగుల పూలగుత్తులను పాఠకులకు అందిస్తున్న కథామంజరి చిరకాలం అవిఘ్నంగా ఇంకా ఇంకా పెరుగుతూనే ఉండాలని ఆకాంక్షిస్తూ, దాన్ని తీర్చిదిద్దుతున్న బృందానికి శుభాకాంక్షలు తెలుపుతున్నాను.

అలాగే.. కథలపోటీలో బహుమతులు వచ్చిన కథలతో ఓ సంపుట ముద్రించి, కథలకు ఇచ్చే నగదు బహుమతులు తగ్గించి, ఈ పుస్తకాన్ని అందిస్తే, రచయితలకు తమ కథలను ముద్రణలో కూడా చూసుకునే భాగ్యం లభిస్తుంది. సాధ్యాసాధ్యాలను పరిశీలించండి.

**పి. ఎస్. నారాయణ**

మధుర పరిమళాల విరితోట కథామంజరి.




కొన్ని వేల కథలు, వేల మంది రచయితల కలాల నుంచి జాలువారిన అమూల్యమైన కథలెన్నో చదివాము. నాటి భారతి పత్రిక నుంచి నేటి నవ్య, స్వాతి వంటి పత్రికల దాకా ఎన్నో దిన, వార, పక్ష, మాస పత్రికలు అనేక మంది రచయితలను పాఠకలోకానికి పరిచయం చేశారు. వాస్తవ గాథలు, ఊహాజనితాలు, క్రైమ్ కథలు, హాస్య కథలు, విషాద గాథలు, సస్పెన్స్, దయ్యాల కథలు.. ఇలా ఎన్నో కథలు మనకి తెలుసు. కాకపోతే అన్ని పత్రికలు కథలతో పాటు సీరియల్స్ మాత్రమే కాక మహిళల కోసం, పిల్లల కోసం , health టిప్స్, sexual సలహాలు.., ఇలా అనేక రకాల శీర్షికలతో అన్ని రకాల పాఠకుల కోసం చక్కటి పత్రికలు నిర్వహించారు.

అయితే, కారణాలు ఏవి అయితేనేమి.. అనేక పత్రికలు కనుమరుగు అయిపోయాయి. వాటి స్థానంలో అంతర్జాల పత్రికలు అనేకం వస్తున్నాయి. వాటిలో ఎన్ని పత్రికలు విలువైన సాహిత్యం పాఠకులకు అందిస్తున్నాయనేది మిలియన్ డాలర్ ప్రశ్న.

ఇలాంటి తరుణంలో కేవలం కథలు మాత్రమే ప్రచురిస్తూ.. అందులోనూ ఏరి, కోరి అద్భుతమైన కథలు అందిస్తున్న ఏకైక పత్రిక కథామంజరి. స్వతహాగా మంచి రచయిత, అభిరుచి ఉన్న సాహితీ పిపాసి జయంతి ప్రకాశశర్మ గారు. ఎంతో అంకితభావంతో నిర్వహిస్తున్న అమూల్యమైన అంతర్జాల పత్రిక కథామంజరి. కొంచెం సాంకేతిక పరిజ్ఞానం తెలిస్తే చాలు ఒక పత్రిక నడిపిద్దాం అనుకుంటున్న వారెందరో ఉన్నారు. అందరికీ సాహిత్యంపట్ల అభిమానం, అభిరుచి ఉండాలి. అలాంటి అరుదైన వ్యక్తి జయంతి ప్రకాశ శర్మ గారు. వారికి సహకారం అందిస్తున్న అవసరాల వెంకటరావు గారు, ఎం.ఏ. పద్మనాభరావు గారు, కృపాకర్ పోతుల గారు, ఎం. ఎల్ కాంతారావు గారు, ఇతర సాంకేతిక సభ్యులు అందరికీ ఈ కథామంజరి ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు అందిస్తూ...

**అత్తలూరి విజయలక్ష్మి**



కథామంజరి రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా వారి బృందానికి శుభాకాంక్షలు. నేటి తెలుగుకథని నిలపెట్టి, రేపటి తరానికి అందచేసే ఓ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన కథామంజరి నేను వయసు ప్రభావంతో రెగ్యులర్ గా చదవలేక పోతున్నాను. కానీ వారితో తరుచు ఫోన్‌లో మాట్లాడడం, ఇతరుల ద్వారా వింటున్నందువలన, వారి ప్రయత్నాలన్నీ తెలుస్తున్నాయి. నేటి తరం కథకులు తప్పకుండా, కథమంజరిని చదువుతుంటే, కథలు రాయడంలో మెలకువులు తెలుస్తాయి. అలాంటివారికి, కథా రచనల మీద నా అనుభవాలను, సూచనలను తప్పకుండా అందించగలను. ఇక్కడ టూకీగా చెప్పాలంటే.. ఎక్కువ చదవండి, చదివిన కథల్లో ఉన్న అంశాలను పరిశీలనగా చదవండి. కథ పాఠకులను కట్టివేయడానికి, పది కాలాలపాటు నిలిచిపోడానికి.. మన రచయితలు వారి కథలలో శైలి, శిల్పం, కథనం, ఆరంభం, ముగింపులకు ఎంత శ్రద్ధ తీసుకున్నారో గమనించండి. కథలలో సామాజిక స్పృహ ఉండాలి. ఒక సందేశం ఇవ్వాలి. అప్పుడే కథకీ ఒక అర్థం, పరమార్థం ఉంటుంది. ఈ విషయంలో కథామంజరి శ్రద్ద తీసుకుంటుందని ఆశిస్తూ.. అభినందనలు తెలియచేస్తున్నాను.

**కొండముది హనుమంతరావు**



'కథామంజరి' అంతర్జాల మాసపత్రిక మూడో సంవతసరంలోకి అడుగు పెట్టబోతున్న శుభ సందర్భంలో నా హృదయ నివేదితను అందించగల అదృష్టాన్ని నాకు అందించిన కథామంజరి సాహితీ బృందానికి, ముఖ్యంగా జయంతి ప్రకాశశర్మ గారికి నా కృతజ్ఞతాంజలిని సమర్పించుకుంటున్నాను.

అరుదైన సాహితీవనంలో సంగీత ప్రియుల హృదయాలను రంజింపజేసేలా, సమ్మోహనపరిచేలా రూపులు దిద్దుకుంటున్న ప్రతి సంచిక శ్రావ్య సంచికే. కాలం మారుతోంది. సాహితీపరంగా కూడా అవాంఛనీయ భావాలను ఆహ్వానించే స్థితిలో ఉంది మన సమాజం. నేటి చిత్రాలలో, టివి సీరియళ్ళలో చాలా భాగం అవాంఛనీయ సంఘటనలు, చక్కటి కుటుంబ వ్యవస్థని చిన్నాభిన్నం చేస్తున్నాయి. తద్వారా ఎందరో మానసిక వికలాంగులుగా మారిపోతున్నారు. నా సుదీర్ఘ సాహితీ పయనంలో ఇటువంటి దౌర్భాగ్య స్థితిని ఊహించలేదు, ఊహించలేను కూడా. ఐతే, ఈ పరిస్థితులలో 'కథామంజరి' ద్వారా చేపట్టిన సాహితి యజ్ఞం సామాన్యమైనది కాదు. ఈ యజ్ఞంలోని సాహితీసుమాలన్నీ సాహితీవిలువల నిజ దర్పణాలు. మానసిక ప్రశాంతికి, మానవ వికాసానికీ, చైతన్యానికి నిలువెత్తు నిదర్శనాలు. అందుకే.. అందుకేనేమో, 'కథామంజరి' చక్కని ఔషధంలా, మనోవికాస గుళికలా, ఆరోగ్య పంథాలో చేయూతనిచ్చి, నడిపించే ఆత్మబంధువులా అవతరించింది. మరిచిపోయిన సాహితీ విలువలను గుర్తుకు తెచ్చుకుంటూ, మాననీయ మనవతను పెంపు చేసుకుంటూ, మమతానుబంధాలకు నిర్వచనాలను మరోసారి మననం చేసుకుంటూ, తెలుగు కథా వైభవాన్ని, విశిష్టతనూ తిరిగి మనసులో పదిలపరుచుకుంటున్నారు సాహితీప్రియులు!

లబ్ధప్రతిష్టులైన సాహితీమూర్తులను తలుచుకుంటూ, వారి పరిచయాలతో, అర్థవంతమైన సృజనాత్మకమైన కథలతో, ఆదర్శనీయంగా 'కథామంజరి' ని ముందుకు తీసుకొచ్చిన ఈ మహత్తర యజ్ఞ సృష్టికర్తలు ఎంతైనా అభినందనీయులు.

సాహితీలోకం వీరికి సదా ఋణపడి ఉంటుంది! ఆత్మీయతతో..

**కృష్ణక్క (డా. కే.వి. కృష్ణకుమారి)**



సాహిత్యం కనుమరుగైపోతోందని .... అక్షరం మీద అభిమానం అంతరించిపోతోందని ... తెలుగు భాషకు తెగులు పట్టించి పరభాషకు వలసలెక్కువవుతున్నాయని అందరూ గగ్గోలు పెడుతున్న వేళ.....అది ఆంధ్రరాష్ట్రంలో కరోనా మహమ్మారి పుణ్యమో... ఏమోగాని... ఒకే సమయంలో ఎంతో పేరుగాంచిన ప్రసిద్ధ పత్రికలన్నీ మూతపడిపోవడం.... సాహితీ పిపాసుల పుస్తక పఠనానికి ...సాహిత్య సేద్యానికి పెద్ద అగాథమే ఏర్పడింది.

అదిగో.. ఆ సమయంలో...నేనున్నా...నేనున్నానంటూ...కొత్త వరవడితో...కొత్త ఆలోచనలతో... ఉరకలు వేస్తూ... పాఠలోకమే ఆశ్చర్యపడేలా... పైసా ఖర్చులేకుండా... చదువరి చెంతకే మెయిల్ ద్వారా చేరేలా ముచ్చటైన కథల పత్రిక ఒకటి రూపుదిద్దుకుంటోందని ప్రకటన రాగానే సాహిత్యకారులు... పాఠకలోకం... ముఖ్యంగా రచయితలు ఉప్పొంగిపోయారు.

అదే కథామంజరి. నెల నెలా పసందైన పది కథలతో... అంతర్జాల పత్రికగా...విడుదలై... మెయిల్ ద్వారా అందరికీ చేరుతూ నయనానందకరంగా వెలుగొందుతోంది. అంతే కాదు అవే కథలకు గాత్రధారణ చేస్తూ పాఠకులను శ్రోతలను చేస్తూ ఆడియో పత్రికగా మార్చి యూట్యూబ్ ద్వారా శ్రోతలకు వీనుల విందు చేస్తోంది కథామంజరి.

కథామంజరి ఇప్పుడు రచయితల పాలిట వరమైంది.... కథామంజరి కథానిలయమైంది.

కథామంజరి సంపాదకుడిగా మిత్రుడు జయంతి ప్రకాశశర్మ కృషి అసామాన్యం. అతనికి వెనుక అండగా నిలబడ్డ సాహితీ పిపాసులు.. కార్యనిర్వాహకులందరికీ... ఇంత మంచి పత్రికని మనకందించినందుకు పేరు పేరున ధన్యవాదాలు తెలుపుతూ వారికివే నా హృదయపూర్వక అభినందనలు.

**ఇందూ రమణ**

*ఎడిటర్, సాహో మహా మాసపత్రిక; అధ్యక్షుడు, ప్రియమైన రచయితల సాహిత్య సంక్షేమ సంఘం*

కథామంజరి ఆవిర్భవించి

రెండు వర్షాలు నిండి

మూడవ వసంతంలోకి

అడుగిడుతున్న శుభతరుణాన,

మాకు వెన్నుదన్నుగా నిలిచిన

వదాన్యులకు,

కథకులకు, పాఠకులకు,

అభినందనాశీస్సులు అందించి

నిత్యం ప్రోత్సహిస్తున్న

విశిష్టఅతిథులకు,

పత్రికని సకాలంలో మీ ముందుంచే

కృషిలో తోడుగా నిలిచే

మా కథామంజరి జట్టుకి

మా

**కృతజ్ఞతాభివందనములు**

# ఇదీ వరస

## శీర్షికలు


| | | |
|---|---|---|
| కథాకీయం | | i |
| కథా మార్గదర్శి | | ii |
| కథా పరిచయం | | iv |
| వినదగునెవ్వరు చెప్పిన .. | | vii |


## కథలు, వ్యాసాలూ


| | | |
|---|---|---|
| అభిమన్యు | సింహప్రసాద్ | 1 |
| అక్షరకాష్టం | బి. నర్సన్ | 7 |
| వానప్రస్థం | రాధిక మంగిపూడి | 12 |
| ట్రెండ్ వద్దు స్టాండర్డ్ ముద్దు | సుంకరణం జ్యోతి | 17 |
| రంగులమయం | శానాపతి (ఏడిద) ప్రసన్నలక్ష్మి | 21 |
| కానుక | యం. విజయ కుమార్ | 25 |
| ఇది సమంజసమేనా..! | ఉమాబాల చుండూరు | 29 |
| మధ్యమావతి | భాగవతుల భారతి | 33 |


## యువ కలం


| | | |
|---|---|---|
| ఆప్తుడు | సి.హెచ్. గౌతమి | 38 |
| దర్పణం | పూర్ణిమా కీర్తి | 43 |


Cover Page Credits : Mr Emel Cayrow, India

# కథాకీయం

ఇరవైనాలుగు సంచికల వయసు నిండా నింపుకుని, మూడో సంవత్సరంలోకి కథామంజరి అడుగుపెడుతోంది. తెలుగు భాషని, తెలుగు కథలని రేపటి తరానికి పదిలంగా అందించాలనే ఓ ఉద్దేశంతో మొదట అడుగులు వేసి, ఆ అడుగులలోనూ ఓ నూతనత్వం తీసుకురావాలనే ఓ ఇద్దరి తపనల పక్కన మరో ఇద్దరు, తర్వాత వెనుక మరో ఇద్దరు, ఆ తర్వాత మరో ఇద్దరు చేరి ఈ రోజు బృందంగా కథాయాజ్ఞాన్ని ఫలాపేక్ష లేకుండా ముందుకు నడిపిస్తున్నాము. కొత్త తరం, కొత్త కథలు అందించాలనే ఓ ఆశయం ఇప్పుడిప్పుడే చిగురులు పెడుతోంది. కథకులు, పాఠకులు.. రాసి పరంగా పెరిగినా, వాసి పెరగాలనే సూచనలు పెద్దలు పదేపదే చేస్తున్నారు. అయితే మారిన కాలమాన పరిస్థితులలో ఈ 'వాసి' పెరగాలంటే ఇంకా సమయం పడుతుంది. సాంకేతికంగా వచ్చిన చేర్పులు, మానవ జీవన సరళిలో వచ్చిన అనూహ్యమైన మార్పులు .. ఇవి వచ్చినంత వేగంగా పఠనాశక్తి, రచనాశక్తి విషయంలో రావు. ముఖ్యంగా విద్యావ్యవస్థలో చోటుచేసుకున్న పెను మార్పులు బాల్యం నుంచే మనిషి ఆలోచనల్ని మార్చేసాయి. ఈ మార్పుల ప్రభావం సాహిత్యం మీద ఎక్కువ చూపెట్టింది. అయితే సాహిత్యం.. ముఖ్యంగా కథ యొక్క ప్రాముఖ్యత, అవశ్యకతలకు ఇప్పుడిప్పుడే గుర్తింపు లభిస్తోంది. కథలు చదివేవాళ్ళు, శ్రవ్య మాధ్యమాల ద్వారా అందించేవారు, వినేవారు.. సంఖ్య ఇప్పుడు పెరిగింది. కథ మన పిల్లల నడవడికకు, జ్ఞానసంపద పెంపొందించడానికి, వారి భవిష్యత్తుకు అవసరమనే విషయాన్ని పెద్దలు గుర్తిస్తున్నారు. ఆ మార్పే.. కథామంజరి ముందడుగుకు దారి చూపెడుతోంది.

రెండేళ్ళ కాలంలో మా వెనుక, ముందు నిలబడి దారి చూపిస్తూ, వెన్ను తడుతూ ప్రోత్సహిస్తున్న మా విశిష్ట అతిథులు, శ్రేయోభిలాషులు, రచయితలు, రచయిత్రులు, పాఠకులతో పాటు.. ఆర్థికంగా ఆదుకుంటున్న స్వచ్ఛంద పోషకులు ఉన్నారు. ఈ మహానుభావులందరికి వందనాలు తెలియచేసుకుంటున్నాం!


ఈ రెండు సంవత్సరాల పయనంలో అతిథులుగా విచ్చేసి, విశిష్టంగా మమ్మల్ని ప్రోత్సహిస్తూ, ఇప్పుడు ఆశీస్సులు అందజేసారు. వాటిని మీకు అందిస్తూ, గతంలో మేం చెప్పినట్టు, యువ రచయితలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో, ఈ సంచిక నుంచి యువరచయితల కథల కోసం ప్రత్యేకంగా "**యువకలం**" పేరిట కథలను ప్రచురిస్తున్నాం. ఈ సందర్భంలోనే మరోసారి ఏనుగు లక్ష్మణ కవి గారి పద్యాన్ని గుర్తు చేసుకుందాం....

*ఆరంభింపరు నీచ మానవులు విఘ్నాయాస సంత్రస్తులై*
*యారంభించి పరిత్యజించుదురు విఘ్నాయత్తులై మధ్యముల్*
*ధీరుల్ విఘ్ననిహన్య మానులగుచున్ ధృత్యున్నతోత్సాహులై*
*ప్రారబ్ధార్థము లుజ్జగింపరు సుమీ ప్రజ్ఞానిధుల్ గావునన్.*

తెలుగు కథని నిలబెట్టడానికి నడుం కట్టి, ధీరులై నిలబడాలనీ యువతను కోరుకుంటూ.. స్వస్తి!

**సంపాదకుడు**

# కథా మార్గదర్శి



**శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి**

"నీవు అనుకున్నది ఏమై ఉండునో నీ రచనలో స్పష్టంగా తెలియకపోతే, నీవు తెలుగువాడవేనా, నీది తెలుగు భాషేనా? 'లాకాయ్, లూకాయ్ వాళ్ళందరి కోసం కాదు నా రచన.' – అనుకుంటూ భుజాలు చరుచుకునే వాళ్ళూ లేరంటావా? .. ఉన్నారు! అది వాళ్ళ లలాట లిఖితం...." ఇలా సాగుతాయి వారి కథల మాటలు.. అవి కూడా వందేళ్ళ క్రిందట రాసిన కథలు. అది.. వారికి వ్యవహారిక తెలుగు భాష మీదున్న అభిమానం, నమ్మకం. . తెలుగులో ఒక రచన చేసినప్పుడు, ఆమాటకొస్తే ఏ భాషలోనైనా, అది సామాన్యుడికి అర్థం కావాలన్నది ఆయన ఉద్దేశం. అదే ధోరణిలో "గిడుగు రామమూర్తి పంతులుగారు వాగనుశాసనుడు. యీ తరంలోనూ, ఎల్లకాలమూ, కలం బట్టి నేర్చే వారందరికీ ఉపాస్య దైవం. నాకు, మరీ ముఖ్యంగాను." అంటూ గిడుగు రామ్మూర్తి పంతులుగారు వ్యవహారిక భాష కోసం చేసిన సేవ గురించి ఎంతో గొప్పగా చెపుతూ, కలం పట్టి, ఓ కొత్త ఒరవడిలో, రాజీ పడకుండా రచన ద్వారా ఉద్యమం చేపట్టిన ఆధునిక తెలుగు కథా శిల్పి శ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారని వేరే చెప్పనక్కరలేదు.

శాస్త్రి గారు 1891 ఏప్రిల్ 23వ తేదిన కోనసీమలోని ఒక శ్రోత్రియ కుటుంబంలో జన్మించారు. ఇంట్లో సంస్కృతమే తప్ప తెలుగు పుస్తకాలు ముట్టుకోడానికి వీల్లేదు. హాయిగా క్రాపు దువ్వుకుని, చొక్కా తొడుక్కోవాలనీ ఉండేది, ఇంట్లో ససేమిరా ఒప్పుకునేవారు కాదు. ఆ పరిస్థితులు నచ్చక, కుటుంబ సాంప్రదాయాలపై తిరుగుబాటు చేసారు. ఆ లక్షణాలే వారి రచనలలో కనబడతాయి.

కథకి చక్రవర్తిగా కొనియాడబడిన శాస్త్రిగారు సుమారు 75 కథలు, అనేక పద్య రచనలు, నవలలు, నాటకాలు, అనువాదాలు, వైద్య గ్రంథాలు రచించారు. వారి కలుపు మొక్కలు, గులాబీ అత్తరు, వడ్ల గింజలు, మార్గదర్శి, ఇలాంటి తవ్వాయి వస్తే, ఇల్లు పట్టిన వెధవాడపడుచు, కీలెరిగిన వాత.. వంటి కథలు ఆణిముత్యాలే! (ఏ పేరు?) కలం పేర్లతో ఎన్నో వ్యాసాలు రాసారు. అనేక అష్టావధానాలు కూడా చేసారు శ్రీపాద వారి కథలకి ఒక పరిమితి ఉండేది కాదు. ఇలా రాయాలని ఆయన అనుకునేవారు కూడా కాదు. రాయడం మొదలుపెడితే అది ఎన్ని పేజీలయినా ఉండవచ్చు. అలా అని ఆయన కథలలో వర్ణనలు, కల్పనలు కనబడవు. సాధారణ సంభాషణలే కథని నడిపిస్తాయి. కొన్ని కథలు కేవలం సంభాషణలతోనే నడుస్తాయి! అప్పటి సమాజంలో ఉన్న వాస్తవ పరిస్తితులను చదువరులకు చూపించే ప్రయత్నం చేశారు. అందుకే ఆయన కథలు జనాదరణ పొందాయి.

రచనలు చేసేవారికి ఓ మార్గదర్శకత్వం గా ఉంటుంది. ఆయన కథలలోనే కాదు.. తన "అనుభవాలూ – జ్ఞాపకాలు" పుస్తకంలో అప్పటి సమాజం గురించి, దాని పట్ల ఆయన దృక్పథం గురించి తెలియచేస్తారు. "రచన అనేది ఒక తపస్సు! ముందు గ్రంథాలు పట్టు, తర్వాత కలం పట్టు!" అంటూ చాల సూక్ష్మమైన మాటలలో కలం పట్టే రచయితలకు డెబ్బై ఎనభై ఏళ్ళ క్రితమే శ్రీపాద వారు సూచించారు.

1961 ఫిబ్రవరి 25వ తేదిన కనుమూసిన శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారి కథలు ఇప్పటికీ చిరంజీవులే. వారి సాహితీ ప్రక్రియలన్నీ తెలుగు జాతికి గర్వకారణం అని చెప్పాలి. అలాంటి మహనీయుడ్ని తలుచుకుంటూ.. వారికి ఘనమైన నివాళి అర్పించుకుంటున్నాం!

*కథామంజరి బృందం*

**ఈ పత్రిక నిర్వహణకు ప్రతీ నెలా ఒకరు ఆర్థికంగా సహాయపడుతున్నారు. ఆసక్తితో పాటు అవకాశం ఉన్నవారిని కథామంజరి కథాయజ్ఞంలో పాలుపంచుకోవలసినదిగా సవినయంగా కోరుతున్నాం. వివరాల కోసం సంప్రదించండి.**

**అవసరాల వెంకటరావు**
**9989976688**

**జయంతి ప్రకాశ శర్మ**
**98486 29151**

## శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారి కథ "మార్గదర్శి"

తెలుగుకథకు తనదంటూ ఒక ముద్ర వేసుకున్న కథకులలో శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి గారు అగ్రగణ్యులనే చెప్పాలి. శ్రీపాద వారు కథలు వందల్లో రాయలేదు. కాని రాసిన కథల్లో సంఘంలోని దురాచారాలు ఎత్తిచూపడం కనబడుతుంది. మనిషిలోని మేధకి జోహార్లు పలకడం కనబడుతుంది. స్వతంత్రమైన ఆలోచనలకు మెచ్చుకోలు కనబడుతుంది. సాంప్రదాయాలను త్రోసిపుచ్చి తన కాళ్ళమీద తాను నిలబడాలనుకునే వాళ్ళంటే ఆపేక్ష, అలా ఉండని వాళ్ళకి ప్రోత్సాహం కలిగించాలనే తాపత్రయం కనబడుతుంది. వ్యాపారవేత్తల ఆలోచనలకు మెచ్చుకోలు కనబడుతుంది. అదిగో ఆ చివరి ఆలోచనను కథారూపంలో మనకందించిన రచనే, 'మార్గదర్శి'. పెట్టుబడి దారీ విధానం తప్పుకాదని, అందుకు కావలసిన శ్రమ, చొరవ, తెలివి కేవలం వైశ్య కుటుంబాలకే పరిమితం కాదని, ఎవరైనా ప్రయత్నిస్తే ఒకరి క్రింద పనిచేయడం కంటే తన కాళ్ళమీద తాను నిలబడగలిగే స్వంత వ్యాపారం చేసుకోవడం మెరుగని శ్రీపాదవారు 'మార్గదర్శి' కథలో మన ముందుంచుతారు. ఈ కథ కృష్ణుడు అర్జునుడికి గీతోపదేశం చేసిన విధంగా ఉంటుంది. మార్గదర్శి కథలో రచయిత లక్ష్యం తను సృష్టించిన పాత్రల ద్వారా జీవితంలో బతకడానికి స్వంత కాళ్ళపై నిలబడే ఆలోచనలకు స్ఫూర్తినివ్వడం. భగవద్గీతలో కృష్ణుడు మన సగటు జీవితాలకు ప్రేరణనిచ్చే కథలు చెప్పలేదు. శ్రీపాదవారు అవికూడా చేర్చడం వల్ల మనకి రచన కేవలం ఒక ఉపన్యాసంగా తోచదు. చదువుతూంటే చాలామందికి 'బహుశా మనమెందుకు ఆ విధంగా ఆలోచించలేదా' అని అనిపిస్తుంది.

ఈ కథ ఒక బ్రాహ్మణ శ్రోత్రియ కుటుంబంలో పుట్టిన శంభశాస్త్రి, తన దగ్గరకు ఒక ఉద్యోగానికై సిఫార్సుకోసం వచ్చిన ఒక యువకుడికి చేసిన ఉద్బోధ. "పంతులూ! వెయ్యి కాదిక.. లక్ష చెప్పు నువ్వు.. కాని నౌకరీ కోసం సిఫార్సన్నమాట మాత్రం నా దగ్గిర యెత్తకు!" అంటూ ప్రారంభమవుతుంది కథ. శంభశాస్త్రి ఒక బీద శ్రోత్రియ బ్రాహ్మణ కుటుంబంలో పుట్టినవాడు. తండ్రిది ఉద్యోగమంటూ ఏమీ లేదు... యాచక వృత్తి తప్ప! పదిహేడోయేట తండ్రి పోయేటప్పటికి సెంటు భూమి లేదు. చేతిలో రాగి దమ్మిడీ అయినా లేదు. సరిగ్గా బడికి వెళ్ళి చదువుకోవాలనే ఆలోచన తండ్రి కలగచేయలేదు. బుజ్జగిస్తూ తల్లి చూపెట్టిన బాధ్యత మనసుకెక్కుతుంది. చిన్నతనంలో ఒక కోమటి కులానికి చెందిన స్నేహితుడు ఒక అణాతో ఎన్నో అణాలు గణించిన సంఘటన, తనలో అలాంటి ఆలోచన లేమి... కళ్ళకు కనబడతాయి. తల్లి చెప్పిన కథలు జీవితానికో దారి చూపెడతాయి. బదులుగా తీసుకున్న ఒక రూపాయతో తుండుగుడ్డల వ్యాపారంతో మొదలవుతుందతని జీవితం.

బట్టలకు విలువ పెంచవచ్చునెందుకంటే, కొనుగోలుదారు బజారు వరకూ నడవక్కరలేదు. అదీగాక అత్యవసరాలుంటాయి. ఎదురుగా కనక ఆ అవసరం తీరే అవకాశం వస్తే, కొంచెం ఎక్కువ ధరకైనా కొనడానికి సంకోచించరు కదా! తను ఆ తుండుగుడ్డలకి విలువ ఎక్కువ చేస్తున్నప్పుడు అర్ధణాకి కొన్న వస్తువు అణాకు అమ్మవచ్చుగదా! ఈ విధంగా మొదలయింది శంభశాస్త్రి వ్యాపారం. ఇంటింటికీ తిరిగి అమ్మడం కష్టమే అయినా ఒక రూపాయి పెట్టుబడితో నాలుగు చెయ్యగలిగాడనే తృప్తి, ఇంకా ఎక్కువ చేయాలనే తపన, ముందుకు పోనిస్తాయి. ఆ ప్రయాణంలో తను ఎదుర్కొన్న మొట్టమొదటిది, అతి పెద్దదైన సవాలు... తరతరాలుగా బ్రాహ్మణ కుటుంబాలలో జీర్ణించుకుపోయిన సాంప్రదాయం! బ్రాహ్మణులు వ్యాపారాలు చెయ్యడమా.. అదీ ఇంటింటికీ తిరుగుతూ, ఎంత అవమానం? నౌకరీలు చెయ్యొచ్చు, బ్రహ్మణార్థమైన పనులు చెయ్యవచ్చు, కాని వ్యాపారం చెయ్యడం ఒక నామర్దా! ఒక తక్కువతనం. రెండోది వ్యాపార దక్షతతో ఆలోచించగలగడం. తల్లి మృదువుగా చేసిన హితబోధ, కోమటి స్నేహితుని ఆదర్శంతో రెండు సవాళ్ళనూ అధిగమించగలుగుతాడు.

మెల్లమెల్లగా ఒక కొట్టు కొనగలుగుతాడు. ఒక మార్వాడీ తన వ్యాపార దక్షతా, కష్టపడే గుణం చూసి ఒక మెంటర్ గా మారి శంభశాస్త్రికి వ్యాపారంలో మరికొన్ని మెలకువలు చెబుతూ వెన్నుతడుతూ సహాయం చేస్తాడు. లక్షలు గణిస్తాడు. తల్లి

ఆనందిస్తుంది కొడుకు ప్రయోజకత్వం చూసి. వ్యాపార వృద్ధితో పాటు డబ్బు, పెళ్ళి, భార్య, పిల్లలు.... పిల్లలందరూ పైకొస్తారు. అదీ అతని జీవితం. సాంప్రదాయంలో కొట్టుకుపోతున్న మనుషుల బద్ధకపు తత్వాన్ని అధిగమించి పైకి రావచ్చుననే ఒక సందేశం కనిపిస్తుంది. చివరగా అంటాడు "కష్టపడు, బాగుపడు. అంతేకాని నౌకరీ ఇప్పించమని నన్ను వేధించకు..... ఇంతచెప్పినా నీకు నౌకరీ వ్యామోహం పోదూ, ఫో, నా ఎదుట నుంచోకు వెళ్ళిపో!"

కథలో చెప్పబడ్డ కొన్ని మాటలు మనల్ని నిలబెట్టి ఆలోచింపచేస్తాయి. ఇక్కడ కొన్ని చూద్దాం.

"బండరాయి చూస్తే, 'దీన్ని కదపగలమా?' అనిపిస్తుంది. కాని బుద్ధి ఉంటే, దాన్ని కొండమీదికే యెక్కించవచ్చు, సునాయాసంగా. సాగదీసి దాన్నొక తన్ను తన్నితే, మన కాలు పిప్పి పిప్పి అయిపోతుంది. అలా కాక, ఓపికపట్టి దాని మీదుగా నడవడం ప్రారంభిస్తే తుక్కు తుక్కు అయిపోవలసిన ఈ కాలి రాపిడికే, అది అరిగి పచ్చడి బద్ద అయిపోతుంది. వాస్తవంగా, సంసారం సంగతి కూడా అంతే. రెండు కళ్ళతోనూ చూస్తామా.. అది స్వాధీనంలో ఉంటుంది. కళ్ళు మూసుకుంటామ.. ఊబిలో వూరదొక్కేస్తుంది."

పై మాటలకి వేరే వ్యాఖ్యానం అక్కరలేదు.

పాశ్చాత్యుల నాగరికతని గురించి చెబుతూ ...

"పాశ్చాత్య నాగరికత వచ్చి మన పట్నాలూ నగరాలూ పెంచేసిందనడం, పల్లెలను నాశనం చేసిందనడమూ శుద్ధ అవివేకం. మనం మహోన్నత నాగరికత అనుభవించిన దినాల్లో, పాశ్చాత్యులు ఇప్పుడు మనం వుండిన స్థితి కంటే అధ్వాన్న స్థితిలో ఉండినారు. కాని చూస్తూ వుండగా వారు పైకి వొచ్చేశారు. మనం అడుక్కి పడిపోయాం. ఎవరేమన్నా ఇవాళ పాశ్చాత్య నాగరికతే నాగరికత. అప్పటి మన ఉన్నతిని తలుచుకుని మురిసిపోయే మనం, ఇప్పటి వారి ఉన్నతిని గర్హించడం అవివేకం."

అధ్యాత్మికత పేరుతో సంఘంలో పేరుకుపోతున్న జడత్వం ఆయనకు నచ్చలేదు. ఒకచోట అంటారు "అధ్యాత్మిక దృష్టి ఎప్పుడేర్పడ్డదో అప్పుడే మనకి పతనం ప్రారంభమయింది. జగత్తు అంతా మిధ్య అనుకుని నిర్లిప్తత పట్టుకు పాకులాడే వాళ్ళకి బానిసతనం కాకపోతే మరేం సిద్ధిస్తుందీ?"

"మన సనాతన వాఙ్మయం పరిశీలిన్చు. మన జాతికి, ఇప్పుడు పాశ్చాత్య జాతుల కంటే యెక్కువ భౌతిక దృష్టి వుండింది. కాని, కాలక్రమాన, అన్య జాతుల భౌతిక సాధన యెదట మన భౌతిక సాధన లిగాడయిపోయింది. దాంతో మనకి స్వరాజ్యం పోయి పరప్రభుత్వం యేర్పడిపోయింది. మనకి దాస్యం బలపడినకొద్దీ అధ్యాత్మిక చింత పెరిగిపోయింది. దాంతో జనులకు అజ్ఞానం అలుముకుంది. వ్యక్తిత్వం నశించిపోయింది."

చాలా పదునైన మాటలివి. భారతదేశం బానిసత్వంలో రెండువందల ఏళ్ళు మగ్గి ఉండడానికి కారణమిదా? శ్రీపాద వారి ఆలోచనల్లో లాజిక్ గమనించదగ్గవి.

అప్పటి బ్రాహ్మణ కుటుంబాల గురించి ఆయన చెబుతున్నా, అదే ఆలోచనా సరళి ఉన్న ఏ కుటుంబాలకైనా వర్తిస్తాయా మాటలు. చెప్పబడిన కులాలు ఆరోజుల్లో ఉన్న వివిధ వర్గాలుగా చూడాలి. ఆ వర్గాలలో ఉన్న సాంప్రదాయాలు, అవి ఆలోచనలలో కలిగించే భేదాలూ ఇక్కడ గమనించదగ్గ విషయం.

వర్తకం ఎలా చెయ్యాలో శ్రీపాదవారు చెప్పించిన ఆలోచనలు, పరిశీలనా కథ చదివితే బాగా అర్థం అవుతుంది.

ఇరవయ్యో శతాబ్దపు మొదట్లోనే శ్రీపాదవారు కథలో వెలిబుచ్చిన ఈ అభిప్రాయాలు ఆ రోజుల్లో ఎంత సంచలనం రేకెత్తించి ఉంటాయో! సనాతన సాంప్రదాయాల్లో కూరుకుపోయిన సమాజంలో ఇలాంటి అభిప్రాయాలు వెలిబుచ్చడానికి... మొదట స్వతంత్రంగా ఆలోచించగలిగే శక్తి కావాలి, రెండవది... ఎంతో ధైర్యం కావాలి. సమాజాన్ని ముందుకు తీసుకెళ్ళాలనే నిశ్చయం కావాలి. ఎందరు గురజాడలు, శ్రీపాదలు పుట్టినా సమాజం మారడం అంత సులభం కాదు. కానీ ఇలాంటి రచయితలూ, సంఘసంస్కర్తల ఆలోచనలూ, ఆచరణలూ ఏ కాలానికి ఆ కాలంలో తిరిగి తిరిగి వస్తూంటే కానీ, జడత్వం వదలదు, పురోగమనం ఉండదు.

ఈ కథ 1928 జనవరిలో భారతి పత్రికలో ప్రచురించబడింది. 1947లో ఆనందవాణిలో ఒక సీరియల్ గా కూడా వచ్చింది.

***శాయి రాచకొండ***

హ్యూస్టన్ నుంచి

సంపాదకులకు,

కథామంజరి జూన్ 22 సంచిక చదివాను. పత్రిక కొత్త రూపులో కళ్ళకు ఆహ్లాదకరంగాను, చదవటానికి అనుకూలంగానూ వుంది. రంగులలో మంచి హుందాగా తయారయింది. ఎప్పటిలాగే 'కథాకీయం' కథలు చదవటంపై ఆసక్తిని రేకెత్తించేటట్లుగా, కథలు రాసేవారికి ప్రోత్సాహకరంగానూ వుంది. కథల లోకంలో కథా విశ్లేషణ పాత్రకు సరైన గుర్తింపు తెచ్చే దిశలో మీరు కథాపరిచయం ప్రవేశపెట్టటం చాలా ప్రశంసనీయం. విశ్లేషణ చదివితే తప్పకుండా మళ్ళీ కథ చదవాలనిపిస్తుంది. కథలో మరో కొత్తకోణం ఆవిష్కరించబడుతుంది. అందుకేనేమో, కథల పుస్తకాలలో 'ముందుమాట'కు అంత ముఖ్యస్థానం. ముందుమాటలు కథలను చదివిస్తాయి. ఈ సంచికలోని కథలన్నిటిలో నాకు బాగా నచ్చిన కథ 'కవిప్రపంచంలో కాంతామణి'. రచయిత ఇరిగినేని హనుమంతరావుగారు సరళమైన భాషలో మంచి సంభాషణలతో హాస్యాన్ని చక్కగా జోడించి కథనాన్ని బాగా నడిపారు. హాస్యకథలు కనుమరుగవుతున్న ఈ రోజుల్లో ఈ కథ ఎడారి ప్రయాణంలో ఓ ఓయాసిస్సు తగిలినట్లున్నది. చాగంటి శంకర్ కథ 'గంటలు కొట్టని స్తంభం' మానవ నైజాన్ని కాచి వడబోసినట్లున్నది. మంచి కథనం. మిగిలిన కథలు బావున్నాయి. కథాంశాలు పాతవే అయినా ఎక్కడో ఒకచోట 'కొత్తదనం' కనబడుతోంది. మిగిలిన కథలు బావున్నాయి. 'తొలి అడుగు' లో సీనియర్ సిటిజెన్ యాక్ట్ , 'వెల్‌నెస్ సెంటర్ ' లో సొంతూరు వెళ్ళడం, 'దృక్కోణం' లో ముగింపు.. కథామంజరి కలకాలం కథలతో మమ్మల్ని అలరించాలని ఆశిస్తూ..

**అక్కిరాజు శ్రీహరి**,
హైదరాబాదు

---

సంచిక బాగుంది. మీ ప్రయత్నం అభినందనీయం. మంచి కథలు ప్రచురిస్తున్నారు. నేను ఒక సంచిక చూసేను.

మీకృషికి అభినందనలు!

***నిడదవోలు మాలతి***
Founder, Editor, www.thulika.net

---

జూన్ మాసపు కథా నికుంజం!

అందమైన ముఖ చిత్రంతో వెలువడిన జూన్ నెల సంచిక ఆకర్షణీయంగా ఉంది. సమకాలీనంగా పది కథలతో ఏ రూపంలోనైనా... అంతర్జాల పత్రికగానీ, ముద్రణరూపంలో పత్రికలు గానీ, వెలువడటం అనేది నా ఎరుకలో 'కథామంజరి'లోనే గావచ్చు. ఇలా సాహిత్యసేవను బాధ్యతగా చేస్తున్న బృందానికి తగు సమయంలో చేయి వేస్తున్న వితరణశీలురకు నమోవాకములు. చదవడంలో లభిస్తున్న తృప్తి రీత్యా, శ్రావ్యసంచికను వినినప్పటికీ, తమ గాత్రంతో సహకరిస్తున్న బృందానికీ అభినందనలు. కానీ ఎందుకో ఏదో ఒకరోజు చదవడానికి బద్ధకించి, ఆ వినడానికే మొగ్గు చూపుతానేమో అన్న శంకకు సమాధానంగా ఆ శ్రావ్యసంచికను ఓ రెండు వారాల తరువాత మాత్రమే అందుబాటులోకి వచ్చేటట్టు చేస్తే అనివార్యంగా ఆ చదివే అలవాటు తప్పదేమో... అని సంపాదక బృందానికి చేసుకుంటున్న అభ్యర్థన.

ఇందులో ఉన్న పదకొండు కథలతో పాటు 'కథాకీయం'లో చెప్పినట్టు కొత్త అంశం శేషతల్ప శాయిగారి 'కథాపరిచయం'తో కలిపి ఈ మాసపత్రిక వెలువడింది. కొడవటిగంటిగారి 'కొత్త జీవితం'తో వచ్చిన కథాపరిచయం ఆసక్తికరంగా ఉంది. ప్రస్తుత సమాజానికి అవసరమైన మార్పును అంతర్లీనంగా ఉద్బోధించే కథను ఎంచుకొని శుభారంభం చేశారు. సహజంగా పేరు పొందిన కథకుల, కథల పరిచయాలు చాలా చోట్ల కనపడతాయి. మంచి కథ అయి ఉండి ఎక్కువమంది దృష్టిలో పడని కథల పరిచయం అయితే, ఆయా కథలకూ, కథకులకు మేలు చేసినవారు అవుతారేమో.. శాయిగారూ ఆలోచించాలి!

'నాస్తి బుద్ధి మతాం శత్రు:' మంచి హోదాలో రిటైరైన అతను ఒక రిటైర్డ్ తెలుగు ఉపాధ్యాయుని జీవనశైలి గురించి పొరపడటం అంశంగా వచ్చిన కథ. సినిమాటిక్ ముగింపుతో వచ్చిన మరో కథ 'ప్రాణం'. తులసీ బాలకృష్ణగారు ముగింపుపై ఇంకాస్త దృష్టి పెట్టాల్సింది. సమకాలీన రాజకీయవ్యవస్థ, ఎన్నికల ప్రహసనం గురించి ప్రకాశ్‌రావుగారు రాసిన కథ 'మారని సమాజం'. ఆత్మహత్య యత్నం చేయబోయిన కుమారుడిని మార్చిన తండ్రి అనే అంశంతో వచ్చిన కథ. లక్ష్మణరావుగారి 'జీవిత పరమార్థం'. బహు పాత అంశం. శైలి బాగానే ఉన్నా, విభిన్నమైన ప్లాట్స్ ఎంచుకుంటే బాగుంటుంది. 'ఆకలి కేక' ప్రమీలా శర్మగారి కథ. టైటిల్ కు, కథకు పొసగలేదు అనిపించింది. జర్నలిస్ట్‌గా ఉన్న యువతికి దొండపర్తి ఫుట్ పాత్‌పై ఉన్న అవ్వ దీనస్థితి బాధ కలిగిస్తుంది. వడగళ్ళవాన కురిసినంతసేపు తన బాల్యం గుర్తుకు వస్తుంది. కాస్త కునుకు తీసి బయలుదేరాక అవ్వ గుర్తుకు వస్తుంది. మరి వడగళ్ళ వాన సమయంలో అవ్వ ఇబ్బంది గుర్తుకు రాలేదు. పైగా ఎక్కువ పరిచయం ఉన్నదానిలాగా 'ఒక్క చూపుకే' జర్నలిస్ట్‌ను పలకరిస్తుంది. కథను ఇంకాస్త జాగ్రత్తగా రాయాల్సింది. తరువాతది 'దృక్కోణం' కథ. బహుశా వీరు కొత్తగా రాస్తున్నవారు గావచ్చు. రచయిత్రిగా ఇంకాఎక్కువగా ప్రయాణం సాగించాల్సి ఉంది. పైగా సినిమాటిక్ ముగింపు. సరిగా హోంవర్క్ కుదరలేదు. మిగతా కథలన్నీ సో.. సో.. !

ఈ సంచికలో పాఠకుడిగా నన్ను ఎక్కువగా ఆకట్టుకున్న కథ 'కవి ప్రపంచంలో కాంతామణి'. అచ్చంగా సంభాషణలతోనే నడిపిస్తూ సాగిన కథ. చదువుతున్న పాఠకుడిని సమానమైన మేధకలిగిన వాళ్ళుగా భావించిన కథ. ఎక్కువమంది కథకులు చదివేవారిని మరీ అమాయకులుగా ట్రీట్ చేస్తూ... పూసగుచ్చినట్టు కథ చెబుతారు. ఇది అలాకాక చదివే పాఠకుడిని లీనం చేస్తూ పెదవులపై నవ్వులు పూయించింది. కవులు, రచయితలు సృష్టించే పాత్రలపై వ్యంగ్యవాక్యాలు విసురుతూ భలే నడిచింది. వీరి నుండి ఇంకా మరిన్ని రచనలు ఆశించడం దోషం కాబోదు.

ఈ నెల కథా మార్గదర్శి చాగంటి శంకర్ గారి 'గంటలు కొట్టని స్తంభం' చిట్ట చివరి కథ. తాగేవాడు వార్ధాలోనైనా తాగుతాడు 'తాగనివాడు గోవాలో కూడా తాగడు'. 'కథకీ, కలకీ కాళ్ళుండవు' వంటి వాక్యాలు భలే! కానీ ఓపెన్‌గా చెప్పాలంటే కథలో శంకర్‌గారు ఏం చెప్పారో అర్థం కాలేదు. ఈ మధ్య ఎక్కడ చదివినా ఎక్కువ కథలు పాతవాసనతో కాస్తంత విసుగు పుట్టిస్తున్నాయి. బహుశా అందుకే కాబోలు సంపాదక వర్గం వచ్చే నెలనుండి 'యువ విభాగం' పేరుతో యువత రాసే కథలను ప్రచురించబోతున్నారు. ఈ వార్త వింటుంటేనే యవ్వనంలో ఉండే ఉత్సాహం మనసును ఊపేస్తోంది. చూడాలి ఆ యువత కథలు అంతే హుషారు, ఆవేశంతో కదనం తొక్కుతాయా? పరుగుపెడుతున్న సమాజంలోని కనపడని కోణాలను వెలికి తీస్తారా? కథామంజరి వారు కల్పిస్తున్న ప్లాట్ ఫామ్‌ను ఉపయోగించుకుంటారా? ... ఏమో? చూద్దాం!!

**–రాంబో**

*స్పందన, చిన్నదైనా, మొదలైనందుకు పాఠకులకు కృతజ్ఞతలు.*
*మంచి నాయకుడు కావాలంటే, ఆలోచించి వేసే ఓటే ఉండాలి.*
*మంచి కథ కావాలంటే మంచి విమర్శనతో కూడిన పాఠకుల స్పందనే కావాలి.*

# అభిమన్యు

సింహప్రసాద్



✆ 9849061668

శ్రీమతి సోమదూరి నాగమణిశ్రీ స్మారక కథల పోటీ
సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ
శ్రీ శుభకృత్ వత్సర ఉగాది - 2022

***"ప్రశ్న ఒక క్షిపణిలాంటిది. గుండె నిబ్బరం గలవాడు సంధిస్తే లక్ష్యాన్ని ఛేదించి తీరుతుంది. పాలకులకు గొడుగు పట్టే వారు, వారి అడుగులకు మడుగులొత్తే వారూ.. ఆ పని చేయలేరు. జనపక్షాన్ని నిలిచే వీరులకు మాత్రమే అది సాధ్యం. అలాంటి వారే జనజీవన ఉన్నతికి బాటలు వేయగలరు!"***

★★★

చూసిన ఫైలునే మళ్ళీ మళ్ళీ చూశాను. 'ఇక ఇవాళ్టికి చాలు' అని లేవబోతూంటే పిఏ వచ్చాడు.

"అభిమన్యుగారట, మిమ్మల్ని ఏదో అడగాలట. లైన్లో ఉన్నారు. కనెక్షన్ ఇవ్వనా సార్ ?"

ఒక్కసారిగా వెన్ను జలదరించింది. తత్తరపడ్డాను. "వద్దొద్దు. బిజీగా ఉన్నానని చెప్పు"

వెనుదిరిగిన అతణ్ణి ఆపి, "నెంబర్ తీసుకో. ఖాళీ దొరకగానే నేనే చేస్తానని చెప్పు!" అన్నాను.

గ్లాసుడు నీళ్ళు ఒక్క గుక్కలో తాగేశాను. కాస్త స్థిమిత పడ్డాక బెల్ కొట్టాను.

ప్యూన్ బ్రీఫ్‌కేస్ అందుకున్నాడు. వెళ్తుంటే, "అభిమన్యుగారు ఫోన్ నెంబర్ ఇవ్వలేదు సార్. తర్వాత మాట్లాడతానన్నారు!" అన్నాడు పిఏ.

తల పంకించి వెళ్లి కార్లో కూర్చున్నాను. ఏసీ గాలి చల్లగా వస్తోంది. నాకు మాత్రం ముచ్చెమటలు పోస్తున్నాయి.

ఎందుకిలా భయపడుతున్నాను? అతడ్నుంచి పారిపోతున్నానా? అతడేమీ నా శత్రువు కాదు. పై అధికారీ కాదు. ఆఫ్ట్రాల్ ఓ అభిమాని. శిష్యుడు..!

దారిపొడవునా సర్ది చెప్పుకుంటూ మనసుని జోకొట్టాను.

ఇంట్లో అడుగుపెడుతూనే తుళ్ళిపడ్డాను.

'ప్రశ్న ప్రశ్న ప్రశ్న...గాండీవం ధరించి, పాశుపతం సంధించు, పాలకుల అక్రమాలు తుత్తునియలు చేసేలా... ప్రశ్న ప్రశ్న ప్రశ్న...!' సీడీ ప్లేయర్లోంచి ఖంగుమంది అభిమన్యు కంఠం. గబుక్కునెళ్లి ఆపేశాను.

"విని చాన్నాళ్ళయిందని పెట్టాను. మీ పాటల్లో చాలా శక్తి ఉంది సుమండీ. విన్న వాళ్ళెవరైనా సరే కదను తొక్కాల్సిందే..!"

ఇల్లాలి మాటలు విన్నా, విననట్టుగా గదిలోకి నడిచాను. వెనకాలే వచ్చింది.

"ఆ రోజుల్లో ఉరికే జలపాతంలా ఉండేవారు. కళ్ళల్లో మెరుపులు కురిసేవి. ఇప్పుడేవిటో మన్ను తిన్న పాములా ఉంటున్నారు!" చిన్నగా నవ్వింది .

"ఏం, ఆ రోజులే గాని ఈ రోజులు బాగాలేవా?"

"చాలా బాగున్నాయి. స్వంతిల్లు. కారు. నౌకరు. చేతినిండా డబ్బు. ఇంత గొప్పగా బతుకుతామని ఎప్పుడూ ఊహించలేదు.



నేనెంతో అదృష్టవంతురాలిని అంటున్నారు బంధువులు!" సంబరంగా చెప్పింది.

"అవునిది ఊహించని అదృష్టమే!" మంచం మీద నడుం వాలుస్తూ అన్నాను.

"అయ్యోరామా,అసురసంధ్యవేళ మంచమెక్కుతున్నారేంటి!"

"కాస్సేపేనే.... "

"ఒంట్లో నలతగా ఉందా?" నుదుటి మీద చెయ్యేసి చూసింది. "వేడిగా లేదు " వెళ్ళిపోయింది.

మరిచిపోదామనుకుంటున్నా తలపుల్లోకి తోసుకొచ్చాడు అభిమన్యు.

అప్పట్లో బడిపంతులుగా చేస్తుండేవాడ్ని. కవిత్వం బాగా రాసేవాడ్ని. వామపక్ష భావజాలానికి ఉత్తేజితుడినై, జనం పాటలు రాసేవాడ్ని. ప్రభుత్వ ప్రజావ్యతిరేక, అవినీతి పాలనను ఎదిరిస్తూ ప్రతిపక్షాలు కొత్త ఉద్యమం లేవదీశాయి.

ఒక పార్టీకి చెందిన వీరాజీ కొత్త నాయకుడై ప్రభంజనంలా దూసుకొచ్చాడు.

నేను రెచ్చిపోయాను. అధికారపక్షం ఎన్ని రకాలుగా జనాన్ని వంచిస్తోందో, దోచేస్తోందో వివరిస్తూ పాటలు గుప్పించాను.

చక్కని వక్తని కూడా అవడంతో ప్రజా నిరసనోద్యమం తాలూకు ప్రతి మలుపులో జనాన్ని చైతన్య పరుస్తూ ఉపన్యసించే వాడ్ని. 'ప్రశ్నించండి, నిలదీయండి, హక్కులు సాధించండి..' అని ఉద్బోధించే వాడ్ని. నా పాటలూ పాడే వాడ్ని. అప్పుడు 'మీ అభిమానిని' అంటూ వచ్చాడు అభిమన్యు.

"మీ రచనల ద్వారా ప్రభుత్వాన్ని ప్రశ్నించే తీరు, ఎండగట్టే విధానం అపూర్వం సార్. మీ ఆలోచన, మీ నిబద్ధత నాకు బాగా నచ్చాయి సార్."

"ప్రశ్న ఒక క్షిపణిలాంటిది. గుండె నిబ్బరం గలవాడు సంధిస్తే లక్ష్యాన్ని ఛేదించి తీరుతుంది. పాలకులకు గొడుగు పట్టే వారు, వారి అడుగులకు మడుగులొత్తే వారూ.. ఆ పని చేయలేరు. జనపక్షాన్ని నిలిచే వీరులకు మాత్రమే అది సాధ్యం. అలాంటి వారే జనజీవన ఉన్నతికి బాటలు వేయగలరు!"

"మీ పాట ప్రభుత్వాన్ని నగ్నంగా నిలబెట్టి, నిలువునా కడిగేస్తుంది. హేట్సాఫ్ సార్. "

"ఆ గొప్పతనం నాది కాదు, ప్రశ్నది. ప్రశ్న పాలకుల గుండెల్లో గునపమై దిగుతుంది. వారి చొక్కా పట్టుకుని కూర్చోబెడుతుంది. దృష్టి మార్చుకోమని హెచ్చరిస్తుంది. ప్రశ్నించగలగడమే సమాజ చైతన్యానికి చిహ్నం. ప్రశ్నించలేకపోవడం అంటే అది మేథో పతనమే. దిగజారుడే....!" ఆవేశపడ్డాను.

"ప్రశ్న నిజంగా అంత ప్రభావశీలి అంటారా?"

“ముమ్మాటికీ. అందుకే ప్రశ్నించే వారంటే పాలకుల గుండెలు గజగజ వణుకుతాయి. ప్రశ్నించడం మనిషి హక్కు. అసలు ప్రశ్నలోంచే ప్రగతి పుడుతుంది!“

“మీ వల్ల స్ఫూర్తి పొందాను. మీ శిష్యుడిగా స్వీకరించండి గురూగారూ!”

“దానికన్నా ప్రశ్నించే గొంతుగా మారితే ఎక్కువ సంతోషిస్తాను!”

“తప్పకుండా గురూగారూ. మిమ్మల్ని కలిసాకే కళ, కళ కోసం కాదని, జనం కోసం అని బోధపడింది. జీవితాంతం మీ బాట విడువను. ప్రజా ప్రయోజనాలకు వ్యతిరేకంగా ప్రవర్తించే పాలకుల్నందర్నీ వ్యతిరేకిస్తాను. డప్పు మోగిస్తూ, మీ పాటను ఎక్కుపెడతాను. దుష్ట పాలకుల గుండెల్లో విస్ఫోటం పుట్టిస్తాను.”

“భేష్. ఇప్పుడు నా నిజ శిష్యుడివనిపించుకున్నావ్!”

అభిమన్యు కాళ్లకు గజ్జెలు కట్టుకొని, నడుముకు ఎర్రగుడ్డ చుట్టుకుని, చేతిలోని డప్పుమీద దరువేస్తూ నా పాటలకు ప్రాణం పోసేవాడు. జనాన్ని ఉర్రూతలూగించే వాడు.

నా పాటకు కొత్త ఊపు, రూపు, గుర్తింపు వచ్చాయి. కవిగా మరింత ఎదిగాను. కలానికి మరింతగా పదును పెట్టాను. ఉద్యమం ఉధృతరూపం దాల్చింది. అన్ని ప్రతిపక్ష పార్టీలూ ఒక త్రాటిమీదకు వచ్చాయి. అందరి ఉమ్మడి లక్ష్యం ఒక్కటే. ప్రజా వ్యతిరేక పాలకపక్షాన్ని ఇంటికి సాగనంపడం!

వీరాజీ ఉదయసూర్యుడై జనాన్ని బాగా ఆకట్టుకున్నాడు. ఎన్నో ప్రజాహిత పథకాలు చేపడతానని హామీలు గుప్పించాడు. అతని లక్ష్యశుద్ధి నచ్చినా, గత ఎన్నికల్లో అతడింకో జెండా మోసిన సంగతి గుర్తుంది . అతన్ని పూర్తిగా నమ్మలేకపోయాను. ఘాటుగా విమర్శించాను. అయినా అతడు కోపగించుకోలేదు.

అతడికి నా గురించి, నా పాట గురించి తెలిసింది. మా ప్రాంతంలో అతడి సభ ఉంటే చాలు నన్ను ప్రత్యేకంగా పిలుచుకెళ్లేవారు. అతడిని పొగుడుతూ ప్రసంగించే వాడ్ని. ఇక అభిమన్యు నా పాటలతో జనాన్ని ఉద్రేకపరిచేవాడు. పిడికిలి బిగింపజేసేవాడు.

మొత్తానికి అందరి కృషి ఫలించింది. అధికారపక్షం చిత్తుగా ఓడిపోయింది. ఎక్కువ సీట్లు గెలిచినందున అధికారం వీరాజీ పార్టీ చేతికొచ్చింది. నిస్సందేహంగా ఇది జన ఘన విజయమే!

వీరాజీ అధినేత అయ్యారు. అన్ని పార్టీలనూ కలుపుకుంటే బాగుణ్ణనుకున్నాను. కానతడు ‘ నేనే రాజు నేనే మంత్రి‘ అని కొత్త పల్లవి అందుకున్నాడు.

నాబోటి కళాకారులకు రాజకీయాలు అర్థం కావడం కష్టమే సుమా!

ఎన్నో సంస్కరణలు, పథకాలు, ప్రాజెక్టులు చేపట్టారు. అన్నీ వందల వేల కోట్లవే. కొన్ని చాలా మంచివి. కొన్ని ప్రజా వ్యతిరేకమైనవి. మరి కొన్ని కార్పోరేట్ల కొమ్ము కాసేవి.

పేదసాదల జీవితాల్లో పెను మార్పులేవీ రాలేదు. రైతుల ఆత్మహత్యలు ఆగలేదు. నిరుద్యోగం తగ్గలేదు. పార్టీ కార్యకర్తలు కాంట్రాక్టర్లుగా, స్థానిక నాయకులుగా ఎదిగారు. వారు చెప్పిందే వేదం అయింది.

“మౌన ప్రేక్షకుడయ్యారేమిటి గురూగారూ!” అభిమన్యు అడగలేదు, ప్రశ్నించాడు.

"కొత్త ప్రభుత్వం కదాని కొంత సమయం ఇచ్చా. ఇక చూస్కో జమ్మి చెట్టు మీంచి అస్త్రాలు దించుతా. శర పరంపర సంధిస్తా!"

అన్నట్టే కలం ఝుళిపించాను. ఆ పనిలో ఉండగా వీరాజీ స్వయంగా ఫోన్ చేశారు. "మీకు మన మహాకవి పేరిట నెలకొల్పిన పురస్కారం ఇస్తున్నాను. లక్ష రూపాయల నగదు, ఘన సన్మానం... "

ఊహించని బహుమతికి ఉబ్బితబ్బిబ్బయ్యాను.

వార్త మరునాటి పేపర్లో ప్రముఖంగా వచ్చింది. మీడియా వచ్చి ఇంటర్వ్యూలు తీసుకుంది.

"ఓ సారి వెళ్లి, సార్ దర్శనం చేసుకో. ఆయన గుడ్‌లుక్స్‌లో ఉంటే మంచిది. చాలామంది అనుచరులకు చాలా రకాల పదవులిస్తున్నారు. సలహాదారులుగా నియమిస్తున్నారు!" సలహా ఇచ్చారు మిత్రులు.

రాజధానికెళ్లి కలిశాను. ఎదురొచ్చి మరీ ఆహ్వానించారు. పొంగిపోయాను. "దొరవారికి వేనవేల కృతజ్ఞతలు!" అన్నాను.

ఆయన పరమానందపడ్డారు. నేను ఏనుగు ఎక్కాను.

"మీ కలం శక్తి అమోఘం. మీ సేవలు మన రాష్ట్రానికి అవసరం. కొత్తగా 'మహాకవి పీఠం ' ఏర్పాటు చేస్తున్నా. దానికి మిమ్మల్ని చైర్మన్‌ని చేస్తున్నా. లక్ష జీతం, క్యాబినెట్ హోదా, ఆఫీసు కారు, నౌకర్లు..."

తపస్సు చేయకుండానే భగవంతుడు ఇంటికొచ్చి మరీ వరాలు ఇచ్చేసాడు. అమాంతం కాళ్ళ మీద పడిపోయాను. తర్వాత అంతా మంత్రించినట్టు మారిపోయింది. టీచర్ ఉద్యోగానికి రాజీనామా చేసి రాజధానికి మారిపోయాను. హోదాకు తగ్గట్టు వేషం, భాష మార్చాను. నడక, నడత మార్చుకున్నాను. ఆఫీసులో పనీ తక్కువే. మహాకవి రచనల్ని క్రోడీకరించడం, కొత్త సమీక్షలు వ్యాఖ్యానాలు రాయించడం, ప్రచురించడం, ప్రచారం చేయడం– ఇదే పని.

ఒకసారి అభిమన్యు తిన్నగా ఆఫీసుకొచ్చాడు. సింహాసనం లాంటి కుర్చీ మీద కూర్చున్న నన్ను చూసి "గురువుగారికి ఠీవి వచ్చిందే" అన్నాడు నవ్వుతూ.

దాన్ని ప్రశంసగానే తీసుకున్నాను. "అమెరికాలో అమెరికా వాడిలానే ఉండాలోయ్!"

"రోమ్ పోయి అమెరికా తిష్ట వేసిందన్నమాట! నేను మీ కొత్త పాటల కోసం వచ్చాను!"

కంగారుపడ్డాను. "అవి ఇప్పుడెందుకులే, వదిలేయ్. ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన కళాకారులకు ఉద్యోగాలిచ్చి గౌరవిస్తున్నారు వీరాజీ . నీ బయోడేటా ఇచ్చి వెళ్ళు"

"మనలాగా గాక, డబ్బులిీసుకుని ఆడి, పాడిన వారికి ఇచ్చారు!

విసుగ్గా చూశాను. . "ఎవరి గొడవో నీకెందుకు? నీ భవిష్యత్తు నువ్వు చూసుకో!"

"నా గొంతు నొక్కించుకోవడమా? అయినా సిఫారుసులతో వచ్చే ఉద్యోగం వద్దులెండి"

"ఇవాళ రేపు సిఫారుసులూ, లంచాలూ లేకుండా ఏవీ నడవ్వోయ్.." అనబోయి మధ్యలో మింగేసాను. ఎందుకో పీక పట్టుకుంటాడని భయం వేసింది.

"చూడు అభిమన్యూ. నువ్వు పిపీలికానివి. నీది పీల గొంతు. నాలాగా నీకేమీ ప్రత్యేక స్థాయి లేదు. నీకు నువ్వు గొప్పవాడిననుకోవచ్చుగాని ఎవరూ అనుకోరు. నా దన్ను లేకపోతే సోదిలోకీ రావు. గుర్తుంచుకో!" కోపంగానే అన్నాను.

అతడు నవ్వాడు. చిర్రెత్తుకొచ్చింది.

"నాతో ఇంకేమైనా పనుందా?"

"మీరెందుకు ఇలా రెక్కలు ముడుచుకున్నారు?"

ఖంగు తిన్నాను. వెంటనే ఛళ్లున నవ్వాను. అతనికి అర్ధమైంది. అదోలా చూచి వెళ్లిపోయాడు.

నుదుటికి పట్టిన చెమటలు తుడుచుకుని, నా పనిలో పడిపోయాను.

తర్వాతోసారి ముంపు గ్రామాల తాలూకు నిర్వాసితులు ఆందోళన చేబడితే పోలీసు లారీలు స్వైరవిహారం చేశాయి. ఓ కర్మాగారం ప్రైవేటుపరం చేస్తోంటే వ్యతిరేకించిన జనం మీద పోలీసు తుపాకీలు పేలాయి. అప్పుడు అభిమన్యు ఫోన్ చేసాడు.

"మీ కలంలో సిరా ఇంకిపోయిందా, లేక శాశ్వతంగా మూత పెట్టేసారా? ఏవి తల్లీ నిరుడు ఎగిసిన నిప్పుల నెగళ్ళు అని విస్తుబోతున్నాం!"

"ఎప్పుడూ నిప్పులేనా? ఇప్పుడు వెన్నెల గురించి రాస్తున్నా. మన వీరాజీ గార్ని రెండువందల పద్య పద్మాలతో అభిషేకించబోతున్నా!"

"మీకు చేసిన దానికా, జనానికి చేసిన దానికా?"

"మనకింక ప్రశ్నలతో పనిలేదు. అడక్కుండానే అన్నీ ఆకులో వడ్డించేస్తున్నారు. పేదలకోసం ఎన్ని ఉచిత పథకాలు పెట్టారో చూస్తున్నావుగా. ఉంటాను!"

సెల్ ఆఫ్ చేసి, కుర్చీలో వెనక్కి వాలి, చిన్నగా నిశ్వసించాను.

ఏదో మీటింగ్‌కి వెళ్ళినప్పుడు వీరాజీ లాబీలోని ఒకరు నా చెవిలో చిన్నగా చెప్పారు. అభిమన్యు గ్రామాల్లో నా పాటలు పాడుతున్నాట్ట. "సార్ దృష్టిలోకెళ్తే బాగోదు!" అన్నాడు.

చలిజ్వర పీడితుళ్ళా వణికాను. వెంటనే అభిమన్యుకు ఫోన్ చేశాను. "నువ్వు నా పాటలు పాడొద్దు. అవి కాలం చెల్లిన పాటలు"

"అందులో కొన్ని ఇప్పటికీ రెలివెంటే గురూగారూ. ఆ పరిస్థితులేం మారలేదు!"

"ఏం కాదు. అవి గత దుష్టపాలనకు వ్యతిరేకంగా రాసినవి. ఇప్పుడు మన వీరాజీగారి రాజ్యం వచ్చేసింది. మనకు వ్యతిరేకంగా మనమే గొంతెత్తకూడదు. శత్రువులకు లోకువైపోతాం!"

"ఒక అనుమానం గురూగారూ"

"వద్దు. ఇంకేం అడగొద్దు. ప్రశ్నించే వారంటే ప్రపంచంలోని ఏ ఒక్క పాలకులూ హర్షించరు. అణగదొక్కేస్తారు, జాగ్రత్త!"

"ఇదివరకు పాలకుల్లేరా? వారిని మట్టి కరిపించలేదా?"

"ఆ పరిస్థితులు వేరు. ఇప్పుడు మొత్తం రాజకీయ సీన్ మారిపోయిందోయ్. జనం బలం కన్నా జనాన్ని మాయచేసే, మభ్యపెట్టే సోషల్ మీడియా దన్ను కావాలి. రణతంత్రం రచించే వ్యూహకర్తలు కావాలి. ఇవన్నీ నీకు అర్థం కావులే. నువ్వు అభిమన్యుడివే అయినా ఒంటరి పోరాటం మానేసి స్రవంతిలో కలిసిపో, పైకొస్తావు. నా పాటలు పాడడానికి వీల్లేదు" అధికార స్వరంతో అతని గొంతు నొక్కేసాను.

ఆ తర్వాత అతడు పాడినట్టు వినలేదు. గుండెల మీంచి పెద్ద బరువు దిగిపోయినట్టు ఫీలయ్యాను.

అతడెక్కడో పిచ్చోడు. ఇంకా పాతకాలంలోనే దేవుళ్ళాడుతున్నాడు. కాలం మార్పు గమనించకుండా, జనం రాతలు మారాయా, బడుగుల బతుకులు బాగుపడ్డాయా అని తర్కించుకుంటూ కూర్చోవడం అనవసరం. వృథా ప్రయాస! ఆ తర్వాత ఎప్పుడో వాట్సాప్లో అభిమన్యు నుంచో మెస్సేజ్ వచ్చింది.

అదుర్తున్న గుండెల్తో చదివాను.

'గాయకుల గొంతులు మూగబోయాయి. కవుల కలాలు నిద్రపోతున్నాయి. గజ్జెల సవ్వళ్లు ఆగిపోయాయి. వివిధ కళారూపాలు మూలనపడ్డాయి. కొన్ని భజనబృందాలుగా మారాయి. మేధావుల్లో, కళాకారుల్లో ఎందుకీ నిర్లిప్తత? ఎందుకీ స్తబ్దత? ప్రశ్నించడం చైతన్యానికి చిహ్నం అని ఒకప్పుడు మీరే చెప్పారు. జడ సమాజం ప్రశ్నించలేదు. అభివృద్ధి సాధించలేదు. నిస్తేజమై పోతుంది. చేతులు మాత్రమే కదుల్తాయి, తప్పట్లు కొట్టడానికి. అంతేనా గురూగారూ? 'జీవిత ధ్వనులను వినకపోతే నువ్వు మెల్లగా మరణించడం మొదలు పెడతావు' అన్నాడు పాబ్లో నెరూడా. జనజీవన ధ్వనుల్ని వినకపోతే కళాకారుడు మెల్లగా మరణిస్తున్నట్లే అంటాన్నేను. నేను రైటేనా గురూగారూ?''

ముచ్చెమటలు పోశాయి. గొంతు తడారిపోయింది. ఎవరైనా గమనిస్తున్నారేమోనని చుట్టూ కలయచూశాను. గుండె దడదడ లాడుతుంటే, ఫోన్ లోంచి అతడి 'కాంటాక్ట్' తొలగించేశాను.

రోజులు ప్రశాంతంగా గడిచిపోతుంటే, ఉరుములేని పిడుగులా ఇదిగో ఇవాళ ఏదో అడగాలని ఫోన్ చేశాడు అభిమన్యు.

వాడి పేరే దడ పుట్టిస్తోంది. అసలు వాడే నిలువెత్తు ప్రశ్నార్థకంలా ఉంటాడు. ఇక వాడు అడిగే ప్రశ్నలు బాంబులై పేలవూ!

వాడిని ఎలా వదిలించుకోవాలో తెలీలేదు. ఆ రాత్రి నిద్ర పట్టలేదు. ఏదో అశాంతి. మరేదో అస్థిరత!

మర్నాటి పేపర్లో వార్త చూసి, కాలి కింది భూమి కంపించినట్లు అదిరిపడ్డాను.

సమస్యల్ని ఎత్తిచూపుతూ, ప్రభుత్వ దుశ్చర్యల్ని ప్రశ్నిస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టాట్ట. ప్రభుత్వానికి అప్రతిష్ఠ తెస్తున్నాడని అభిమన్యుని మొదట కొందరు ఫోన్లో బెదిరించారట. పిమ్మట కొందరు కార్యకర్తలు దాడి చేశారట. ఆపైన పోలీసులు అతడ్ని అరెస్టు చేశారట.!

అతడెందుకలా చేశాడు? వీళ్ళెందుకంత తీవ్రంగా ప్రతిస్పందించారు..?

ఎక్కడో ఏదో లింకు మిస్సయినట్టుగా, లంగరందనట్టుగా ఉంది!

'ఏం జరుగుతోంది?' అని ప్రశ్నించుకోబోయే దిగమింగేసాను.

అనవసర విషయాల్లో తలదూరిస్తే మధ్యలో నా తలకాయ రాలి పడొచ్చు..!

నాకెందుకులెద్దూ. తాబేలు డొప్పలాంటి సేఫ్‌జోన్ లోకి ముడుచుకుపోయాను. ఆల్ ఈజ్ వెల్ విత్ ద వరల్డ్. . !

# అక్షరకాష్టం

సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ

బి. నర్సన్



✆ 9440128169

**'నగరం నటస్వాముల గడి..**
**ఊరు వెచ్చని కన్నతల్లి ఒడి' అని**
**'నగరం అదృశ్య కరవాలం..**
**గాటు పడుతుంది గాని బాకు కనబడదు'**
**అని తన కసినంతా కవిత్వంలో చూపించాడు.**

★★★

"ఇది క్షయ వ్యాధి. లంగ్స్‌కి టిబి ఎఫెక్ట్ అయింది. ఇదిగో చూడు" అనుకుంటూ డాక్టర్ ఎక్స్‌రేలో తెల్లగా కనిపిస్తున్న గుండెలను భాస్కర్‌కు చూపెట్టి "ఊపిరితిత్తులకు రంధ్రాలు పడ్డయి. ఆర్నెల్ల పాటు రెగ్యులర్‌గా మందులు వాడుతూ బలమైన ఫుడ్, రెస్ట్ తీసుకోవాలి. పాలు, గుడ్లు తీసుకుంటూ మందులు వాడాలి. లేకుంటే కష్టం!" అన్నాడు.

ఇప్పటికే ఇంట్లో ఉన్న కష్టాలు చాలవన్నట్లు.. ఈ సంగతి చెప్తే పార్వతి బేజారైపోతుంది. భార్య గుర్తుకు రాగానే వచ్చేప్పుడు కిలో బియ్యం తీసుకురమ్మన్నమాట గుర్తుకచ్చింది. జేబులో చూస్తే అంతా కలిసి వంద రూపాయలున్నయేమో. ఏడ్పును అసహ్యించుకునే భాస్కర్ కండ్లు చెంపలను తడుపుతున్నయి. కష్టాలతో కలగలిసి బతకటానికి వెరవని ఆయన రోగం పేరు వినగనె గజ్జుమన్నాడు. ఎన్నడూలేంది బతుకు మీద ఆలోచన మొదలైంది. పుట్టినూరు విడిచి నగరానికి వచ్చుడే పొరపాటైందని తొలిసారిగా అనిపిస్తోంది. సొంతూరు వేములవాడలో హాయిగా సాగే బతుకు.. పాకుడురాళ్ల హైదరాబాదుకొచ్చి ఐదేళ్ళయితోంది. నాలుగు పదులైన నిండని జీవితం చేయి దాటిపోతున్నట్లనిపిస్తున్న వేళ పాత రోజులు గుర్తొచ్చి ఆయన్ని మరింత మెలిపెడుతున్నాయి.

★★★

ఇంటర్ ఫెయిలై పనిలేక తిరుతున్నాడని తల్లి, అక్కను బతిలాడితే భాస్కర్ బావ బ్యాంకు లోను తీసి, ఆయనతోనే ఊర్లో జెరాక్స్ దుకాణం తెరిపించాడు. ఊర్లో అలాంటి మెషీను అదే మొదలు. గిరాకీ జోరుగా ఉండేది. జేబులో గలగల పెరిగి, పదో తరగతిలో చాటుగా తాగిన సిగరెట్ పొగ దుకాణంలో కొచ్చింది. ఇంట్లో బాత్‌రూమ్‌లో మొదలై బెడ్‌రూమ్‌లో కొచ్చింది. చేతిలో సిగిరెట్ ఉంటేనే భాస్కర్ అనేంతగా అలవాటైంది. చదువు మీద ఆశలేకున్నా ఖాళీగా ఉన్నప్పుడు జెరాక్స్ కోసం వచ్చిన పుస్తకాలను తిరిగేయడం ఆయనకు అలవాటైంది. ఊర్లో సాహితీ సమితి నడిపే నరేష్ పోటీలకు వచ్చే కవితలను జెరాక్స్ చేయిస్తుంటాడు. వాటిని చదవడంతో భాస్కర్‌కు కవిత్వం మీద ఇష్టం ఏర్పడ్డది. నరేష్ దగ్గర కవిత్వం పుస్తకాలు తీసుకోని చదివేవాడు. అట్లా కవిత్వం పరిచయమై మనసుల ఏవో ఆలోచనలు మొదలైనాయి, వాటిని కాగితం మీద రాసేదాక మనసు ఊరుకునేది కాదు.

ఓనాడు దుకాణంలోకి నరేష్ రాగానే వేళ్ళ నడుమ ఉన్న సిగరెట్ విసిరేసి, ఎదురుగున్న టీ స్టాల్ మల్లేశంకు రెండు చాయెలు తెమ్మన్నట్లు చేతి వేళ్ళు చూపి, నరేష్ పక్కన కూచుని "నేను రాసిన కవితలు ఓసారి చదువుతావా!" అన్నాడు.

"సరే..దాందేముంది ..చూపెట్టు.." అన్నాడు నరేష్. ఒక్కో కవితను పరీక్షగా చదివిన నరేష్ "పర్వాలేదు.. కొన్ని బాగున్నయి, నేను పత్రికల అడ్రసులిస్తా. పంపు! ప్రింటయితే నలుగురు చదువుతారు, నీకు గుర్తింపు వస్తుంది!" అని నరేష్ కవితల కట్టను భాస్కర్ చేతిలో పెట్టాడు.

కష్టమర్లు వచ్చినప్పుడు తప్ప పగలు షాపులో భాస్కర్ ధ్యాసంతా కవిత్వం మీదనే. రాత్రి నిద్రపోయే గది, మొత్తం భాస్కర్ సిగరెట్ పొగతో, ఆయన మెదట్లో తిరిగే కవితల సుడులతో వేడెక్కేది. ఎప్పుడు సాయంత్రాలు వచ్చే నరేష్, ఓనాడు పొద్దున్నే వచ్చి “భాస్కర్! నీ కవిత నవజ్యోతి పత్రికల అచ్చయింది. యూ ఆర్ గ్రేట్.. మొత్తానికి సాధించినవు. చాలా సంతోషంగా ఉంది!” అంటూ భాస్కర్‌ను గట్టిగా వాటేసుకున్నాడు.

అట్ల మొదలైన భాస్కర్ కవితలు ఏడాది తిరిగేలోగా అన్ని పత్రికలల్లో రావడం, అందరు మెచ్చుకోవడంతో జెరాక్స్ భాస్కర కాస్తా ఊర్లో కవి భాస్కర్ అయిపోయాడు.

నరేష్, ఆయన బ్యాచ్ వాళ్ళు చదువులు పూర్తయి దొరికిన ఉద్యోగాల్లో చేరిపోయారు. ఊర్లో పట్నంలో చదివేటోళ్లకు సెలవుల్లో భాస్కర్ షాపుయే అడ్డా. అందరు కలగలిసి ‘ఇన్ని కవితలు రాసినవు, పుస్తకమెప్పుడేస్తావు’ అని పదే పదే అడుగుతున్నారు.



పుస్తకమంటే మామూలు విషయమా.. వేలు కావాలి. తనది అంతంత సంపాదనేనాయె. పైసలు మిగిలినా, జమజేసే తెలివి, ఆలోచన ఆయనకు లేదు, రాదు. అయినా భాస్కర్‌కు పుస్తకం మీద మనసు పడింది. చివరకు దగ్గరున్న డబ్బులకు మిత్రుల సాయం తోడై కవితా సంపుటి వచ్చింది. పత్రికలకు సమీక్షల కోసం, తెలిసినోళ్లకు చేతికీయడం, దూరమున్నవారికి పోస్టులో పంపడం.. ఇట్ల తెలియకుండానే రెండు నెలలు గడిచాయి.

ఇంటి బరువు తెలియని భాస్కర్‌ను.. ఊహించని తల్లి చావు ఒంటిగాన్ని చేసింది. ‘ఎన్నాళ్ళు ఒక్కనివి బతుకుతవని’ అక్క బావలు కలిసి పార్వతితో పెళ్లి చేశారు. ఆమె పల్లెటూరి పేద పిల్ల. ఆమెకు భాస్కర్.. తనకన్నా కవిత్వాన్ని, సిగరెట్లను ఎక్కువగా ఇష్టపడే అర్థంకాని మొగుడు. భాస్కర్ పుస్తకానికి ఓ నగర సాహితి సంస్థ ఆ యేటి పురస్కారం ప్రకటించింది. భాస్కర్‌ను రమ్మని ఖర్చులకు పైసలు కూడా పంపింది. భాస్కర్, నరేష్ ఇద్దరు సభకు వెళ్లొచ్చారు. తెల్లారి పేపర్లో భాస్కర్ కవిత్వం గురించి గొప్పగా రాశారు. పార్వతి పిల్లాడిని కన్నది. సరళ అని పేరు పెట్టారు.

హైదరాబాద్ సభల భాస్కర్ కవిత్వం గురించి మాట్లాడిన నవజ్యోతి దినపత్రిక ఎడిటర్ శివప్రసాదరావు కాన్నుంచి భాస్కర్‌కు ఉత్తరం వచ్చింది. “భాస్కర్! మా పత్రికలో రోజుకో కవిత నీతో రాయించి మెయిన్ ఎడిషన్‌లో వేద్దామనుకుంటున్నాను. రెమ్యునరేషన్ కూడా ఉంటుంది. నువ్వు హైదరాబాద్ షిఫ్ట్ కాగలవా.. ఆలోచించి చెప్పు. కింద నా ఫోన్ నెంబర్ ఉంది.“ అని అందులో ఉంది.

ఊరు, చిన్ననాటి మిత్రులు, సొంత ఇల్లు, చౌరస్తాల పదేళ్లుగా నడిచే దుకాణం, పుట్టింది, పెరిగింది, బతుకుతోంది అంతా ఇక్కడే.. మరో చోట జీవితం ఎన్నడూ ఊహించలే. ఏంజెయ్యాలె.. ఎట్లైతే బాగుంటది. భాస్కర్ మెదట్లో పురుగు ఆగకుండా

మెసులుతోంది. నాల్రోజులు గడిచాక భాస్కర్‌కు 'కవిగా నిలబడాలి అనుకుంటే' హైదరాబాద్ వెళ్లక తప్పదనిపించింది. 'నా తీరే భయపడితే హైదరాబాద్ లో అంత జనం ఉండేవారా.. అందరితో మేం. ఎక్కడ బతికినా అన్నం పెట్టేది జెరాక్స్ మిషినే. పత్రిక నుంచి కూడా డబ్బులొస్తాయ్. నడవదా జిందగీ..' అని తీర్మానించుకున్నాడు.

హైదరాబాద్ వెళ్లిన భాస్కర్ తిరిగి తిరిగి విద్యానగర్‌లో ఓ మూలకు జెరాక్స్ కోసం చిన్న దుకాణం గది, అన్నుంచి నడిచి పోయేటంత దూరంలో.. రాంనగర్లో చిన్న ఇల్లు కిరాయికి పట్టుకున్నాడు. రెంటికి కలిపి బాడుగ నెలకు వెయ్యి రూపాయలు. వేములవాడను విడిచివెళ్లడం ఇష్టం లేకున్నా, కొడుకును చంకలేసుకొని మొగని చేయి పట్టుకొని పార్వతి హైదరాబాద్ బస్సెక్కింది. రాంనగర్ ఇంట్లో దిగినాక పార్వతి పక్కింటామె వెంటెళ్లి అవసరమున్నయి కొనుక్కొచ్చుకుంది. అన్నం తిని భాస్కర్ పత్రికాఫీసుకు వెళ్ళాడు. అకౌంటెంట్‌ను పిలిచి ఎడిటర్ భాస్కర్‌కు వేయి రూపాయల అడ్వాన్సు ఇప్పించాడు.

తొలి రోజు పత్రికలో 'కవి కిరణం' కింద తన కవితను చూసుకొని భాస్కర్ ఎంతో సంతోషపడ్డాడు. హైదరాబాద్ రావడం మంచిదే అయిందనిపించింది. సరళ్ ను బడికి పంపుదామని భాస్కర్‌కు చెప్పి చెప్పి, యాష్టకచ్చి పార్వతి తనే ఇంటికి దగ్గరున్న బళ్ళో వేసింది. కవిత్వం, జెరాక్స్ మెషిన్ పని జమిలిగా సాగుతున్నాయి. భాస్కర్ రాస్తున్న కవి కిరణం శీర్షిక పాఠకులకు బాగా చేరిపోయింది. కొంతమందయితే ఆయన్ని కల్సి మెచ్చుకోటానికి వెతుక్కుంటూ దుకాణానికి, ఇంటికి వస్తున్నారు. ఊర్లో మాదిరే ఇక్కడ కూడా ఓ మిత్రమండలి జమయ్యింది. ఇక్కడికొచ్చినాక చిన్న చిన్న రిపేర్లతో మూడేండ్లు పనిచేసిన జెరాక్స్ మెషిన్ పూర్తిగా మొరాయించింది.

"మెషిన్ పాతదైపోయింది. ఇంక పని జేయది, ఎంత రిపేర్ చేసిన నాల్రోజులే." అన్నాడు మెకానిక్. కొత్తది ముప్పై వేలైన ఉంటుంది. తనతో కాని పని. దగ్గరున్న బ్యాంకులో లోను అడిగాడు. షూరిటీ కావాలన్నారు. కవిత్వంతో దగ్గరైన వారిలో కొందరిని కష్టంగానే షూరిటీ కోసం అడిగాడు. ఎవరు సరే అనలేదు. ఏదొ సాకు చెప్పారు. ఇన్నాళ్లు ఆహా..ఓహో అనుకుంటా రాసుక పూసుక తిరిగినోళ్ళు ఎకాఎకి మారిపోవడం భాస్కర్ జీర్ణించుకోలేక పోతున్నాడు. వాళ్ళనెందుకు తప్పుపట్టాలి. ఇట్లా ఉంటేనే ఈ మహానగరంలో బతుకగలుగుతారేమో అని కూడా అనుకున్నాడు. మొత్తానికి ఊరి మిత్రులు, వీళ్ళు ఒక్కటి కాదని మాత్రం అర్థమైంది. పై పై మాటలే.. వీరింతే అని అర్థమైంది. ఎంత కష్టమొచ్చినా ఎవర్నీ ఏమి అడగొద్దని మనసులో గట్టిగా అనుకున్నాడు. 'నగరం నటస్వాముల గడి.. ఊరు వెచ్చని కన్నతల్లి ఒడి' అని, 'నగరం అదృశ్య కరవాలం.. గాటు పడుతుంది గాని బాకు కనబడదు' అని తన కసినంతా కవిత్వంలో చూపించాడు. కొత్త మెషిన్ కొనలేక దుకాణం ఖాళీ చేయక తప్పలేదు. పత్రిక ఇచ్చే పైసలు నెలలో ఇరువై రోజులకు కూడా సరిపోతలేవు. మిగిలిన పది దినాలు పార్వతి చేబదుళ్ళు అడిగి, కిరాణా ఖాతాలతో నడిపిస్తోంది. ఏంపని చేద్దామన్నాఇప్పటి దాకా ఒకరి దగ్గర పని చేసినోడు కాదు. మాట పడడు. దులుపుకొని బతకడం భాస్కర్ బుద్ధికి సరిపడదు. పత్రికలోనే ఏదైనా పనీయమని ఎడిటర్‌ను అడిగితే ఏమంటాడో.. వీలు కాదని చెప్పటానికి ఆయనైతే మొహమాట పడకపోవచ్చు గాని, ఊర్కే మాట పోగొట్టుకున్నట్టవుతది. ఇంకో చోట చేస్తే కవిత రాయటానికీ, ఆఫీసులో ఈయటానికి టైం కుదురదు. ఇలా సాగాయి ఆయన ఆలోచనలు. ఆదాయం తక్కువై సరళ్ స్కూల్ ఖర్చులు పెరిగి ఫీజు బకాయిపడ్డది. కిరాణా ఖాతా బిగుసుకుపోతోంది. చాయే, సిగరెట్ చిల్లరకు దిక్కులు చూసుడే అయితోంది. కవిత్వమొక్కటే కష్టాలను ఒరుసుకుంటా ఇంకింత పదును తేలుతోంది. మెచ్చుకునే వాళ్ళకు తక్కువేం లేదు కానీ, నావాళ్ళనీ ఒక్కరు అనిపించరు. కష్టాలు ప్రాణం మీదికొచ్చినాయి. పూటకు గండమైతోంది. ఊర్లో ఇల్లు అమ్మితే తప్ప బతుకమనిపించింది.

"ఇల్లు అమ్మద్దు.. అక్కడికే పోయి ఉందాం" అన్నది పార్వతి మెల్లగా.

"నీకేం తెల్వది ఊర్కో.." అని సర సర బయటికెళ్లిపోయాడు.

సిటీ దాటితే పత్రికలో 'కవికిరణం' ఆగిపోతుంది. రాయడం చాతగాలేదనుకుంటారు. పొద్దున్నే లేచి వేములవాడ బస్సెక్కాడు.. ఇంటికి వెళ్ళాడు.

"ఇల్లు అమ్ముదామనుకుంటున్న.." అన్నాడు.

"ఎవరికో ఎందుకు, మాకే అమ్ము!" అన్నాడు కిరాయికి వున్నాయన.

బేరం అయింది. అడ్వాన్సుగా కొంత సొమ్ము తీసుకొని భాస్కర్ బస్టాండుకొచ్చాడు. రాణిగంజ్ ల బస్సు దిగి పత్రికాఫీసుకు వెళ్ళాడు. ఓ కాగితం తీసుకొని..

కవితా!
నీ నీడలో
నేను సర్వపరిత్యాగిని
అక్షర భస్మధారిని
ఆఖరి నిశ్వాసలోను
నీ ధ్యాసే నీ తోడే
నా చివరి చరణమైనా
నీ ఖణ ఖణలే భగ భగలే'

అని రాసిచ్చి బయట పడ్డాడు. ఇంట్లో పార్వతి ఏడ్సుకుంటూ ఉన్నది. సరళ్ భయం భయంగా.. ఇద్దరు మొఖాలు చూస్తున్నాడు. తెచ్చిన డబ్బులు పార్వతి చేతిల పెట్టగానే ..ఇన్ని బాధల్లో రూపాయలు చూడగానే అన్ని మర్చిపోయిందామె.

నెల రోజుల్లో ఇల్లు రిజిస్ట్రేషన్ అయిపోయింది. వచ్చిన డబ్బులో సగం పార్వతికిచ్చాడు. ఐదేండ్ల నుండి రాస్తున్న కవి కిరణం కవితలల్లో మంచి వాటిని పుస్తకం వేయాలని తనకు ఎన్నటి నుంచో కోరికగా ఉంది. కాపీలు అమ్ముడవుతాయనే నమ్మకముంది. పది రోజులు వాటిని ముందటేసుకుని ఎనిమిది వందల కవితలను వేరు చేశాడు. ప్రెస్‌కు వెళ్లి అడిగితే ' మీ కవిత్వానికి మంచి అమ్మకాలు ఉంటాయి. ఎన్ని కాపీలైన వేయొచ్చు' అని ధీమా ఇచ్చాడు. 'సరే...'అని కొంత అడ్వాన్స్ ఇచ్చాడు.

రోజు కొన్ని కవితలు కంపోజ్ చేసి ఇస్తున్నారు. సరిదిద్ది వాపసు ఇస్తున్నాడు. మొత్తానికి నాలుగు నెలలు అయినంక పుస్తకాలు ప్రెస్‌ల నుంచి అమ్మే దుకాన్లకు చేరినయి. అప్పటికి చేతిలో ఉన్న పైసలు దగ్గర పడ్డా.. కాపీల అమ్మకంతో కొంత కొంత సొమ్ము చేతులో పడుతోంది. భాస్కర్ ఇచ్చిన పైసల నుంచి పాత బాకీలన్నీకట్టింది పార్వతి. మిగిలింది ఇంట్లో ఎందుకని ఇన్నాళ్ళుగా తెలిసిన కిరాణా దుకాణమాయనకు అప్పు కింద ఇచ్చింది. వడ్డీ ఇంటి కిరాయికి, ఖర్చులకు సరిపోతోంది. డబ్బుకు కట కట లేకుండా కాలం గడుస్తోంది. చేతిలో ఏం లేకున్నా వడ్డీకి ఇచ్చిన సొమ్మును తాకద్దనుకుంది. చిల్లర ఖర్చులకు భాస్కర్‌నే అడుగుతోంది. ఓ రోజు పొద్దుగాల్నే బయట గొడవ వినిపిస్తే పార్వతి రోడ్డు మీదికి పోయింది. కిరాణా షాపు దగ్గర అందరు నిలబడి ఉన్నారు. గుండెలో రాయి పడ్డట్లు ఉరికింది. షాపు ఓనర్ పారిపోయిండని, ఆయనకు అప్పు ఇచ్చినోళ్లు అక్కడ జమైనారు. ఏడ్చి ఏడ్చి, తిట్టి తిట్టి తలకాయ కొట్టుకుంటూ ఒక్కొక్కరు వెళ్లిపోతున్నారు. ఎంత పనైపోయింది. ఎంత పాపపు బతుకిది. దిక్కులేని వేళ ఇన్ని పరీక్షలా.. అనుకుంటూ పార్వతి కళ్ళు తుడుచుకుంటూ ఇంట్లోకొచ్చింది. తను ఇచ్చిన పైసల లెక్క ఏనాడూ భాస్కర్ పార్వతిని అడగలేదు. ఆయనకు ఆ అలవాటు కూడా లేదు.

పుస్తకాల రాబడి మెల్లగా తగ్గుతున్నయి. సిటీలో బుక్ సెంటర్ల నుంచి కొంత కొంత సొమ్ము తనే పోయి తెచ్చుకుంటున్నాడు గాని, బయటి ఊర్లలో ఉండే దుకాణదార్లు పుస్తకాలు అమ్ముడుపోయినా ఇప్పుడు.. అప్పుడు అని వాయిదాలు పెడుతున్నారు కాని పైసా పంపలేదు. లెక్క చూసుకుంటే లాభం అటుంచి పెట్టుబడికే పది వేల బొక్క పడ్డది. పత్రిక పెంచే సొమ్ము బెత్తెడైతే ఖర్చు జానెడు అయితోంది. మళ్ళీ కటకట బాగోతం మొదలైంది. ఇళ్ళమ్మకముందున్న గండం మళ్లీ మీదికొచ్చింది.

★★★

బస్సు హారన్‌కు తెలివికొచ్చిన భాస్కర్‌కు తాను హాస్పిటల్ గేటు దగ్గర ఉన్న సంగతి స్పృహకొచ్చింది. కాళ్ళు పీకుతుంటే పక్కనే బెంచిపై కూచొని కాగితం తీసి

'డాక్టర్ నీ సూదిమందు

నిలుచునా ఈ మహమ్మారి ముందు

దారులు మూసుకున్న ఈ మహానగరమందు

రోగం కాదది నా పాలిటి రాబందు'

అని రాసుకొని బయటపడ్డాడు.

శరీరంలో పత్రికాఫీసుకు పోయేంత శక్తి లేదు. రోజూ కవితను బయటి ఎస్‌టిడి బూత్‌కెళ్ళి చెబుతున్నాడు. ఇలా నెల గడిచింది. ఇంకింత చేతగాకుంట అయింది. కవితను పక్కింటి పిల్లోడి కిచ్చి ఫోన్ల చెప్పమంటున్నాడు. రాత్రంతా దగ్గుకుంటూ వున్నా నిద్రలోనో ఏదేదో గుర్తుకొస్తోంది.

తన తోవ తప్పా..ఒప్పా.. ఏది తేల్చుకోలేకపోయాడు.

పొద్దున పది దాటినా భర్త లేవలేదేందని దుప్పటి తీసి పార్వతి తట్టి చూస్తే చల్లగా తగిలాడు. నిద్రలోనే ప్రాణం పోయినట్లుంది. తెల్లారి నవజ్యోతి పత్రికలో రోజువారీ కవిత స్థానంలో 'భాస్కర్ ఫోటో ఉంచి 'కవి భాస్కర్ ఇక లేరు' మినీ కవితకు వన్నె తెచ్చిన కవి, ఆయన కవిత్వం అజరామరం, అనితరసాధ్యమైన ఈ శీర్షికను ఇంతటితో ముగిస్తున్నాం' అని వేశారు.

భాస్కర్‌పై వార్త రాయడానికి వచ్చిన విలేకరి పార్వతితో "జీవితంలో భాస్కర్‌గారు ఓడినట్లా .. గెలిచినట్లా.. మీరేమనుకుంటున్నారు?" అంటూ అడిగాడు.

"ఏమి గెలిచాడు... మమ్ముల నడిసముద్రంలో విడిచి పెట్టిపోయాడు." అంది పార్వతి.

"ఎ ఫెయిల్యూర్ ఫాదర్" అన్నాడు సరళ్.

"మీ అభిప్రాయం ఎట్లున్నా ఆయన గెలిచాడనే అంటాను. భాస్కర్ మాదిరే ప్రపంచంలో ఎందరో మహానుభావులకు ఇంట్లో పాస్ మార్కులు కూడా పడలేదు. కానీ వారు చరిత్రలో నిలిచారు. అదే వారి గెలుపు" అని వెళ్లిపోయాడాయన.

రేపటి రోజు గడవడమెలా అని దిక్కులు చూస్తున్న వారికి ఆయన సమాధానం ఎలాంటి ధీమా ఇయ్యలేకపోయింది.

# వానప్రస్థం

సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ

రాధిక మంగిపూడి



***"ఈ సూపర్ మార్కెట్లు, షాపింగులొచ్చాక ఇలాంటి సంత చూసి ఎన్నేళ్ళయిందిరా!" అన్న కృష్ణకు, సత్యం జవాబివ్వలేదు సరికదా ఎదురుగా ఉన్న కూరల దుకాణం వైపు చూస్తూ కొయ్యబారిపోయి ఆగిపోయాడు.***

***ఎదురుగా చిత్ర ఆకుపచ్చని నేతచీరలో చేతిలో కూరల సంచితో వనదేవతలా సాక్షాత్కరించింది. నెరిసిన ముంగురులు, ముఖంపై చిన్నగా ముడతలు వచ్చినా, ఆమెలోని కాంతి ఏ మాత్రం తగ్గలేదు.***

★★★

"ఎవరింటికెళ్ళాలి సార్?" అడిగాడు వాచ్మెన్, కారు నెంబర్ రాసుకుంటూ. "మోహన్ గారింటికి." అన్నాడు సత్యం కారు కిటికీలోంచి. "ఓహ్ మోహన్ గారా! కుడివైపు తిన్నగా వెళితే మొదటి అంతస్తులో లిఫ్ట్ పక్క ఫ్లాట్." అంటూ దారి చూపించాడు వాచ్మెన్.

సత్యం కారును పార్క్ చేసి శుభలేఖల సంచీ తీసుకొని తన దూరపు చుట్టం మోహన్‌రావు ఫ్లాటు వైపుకు నడిచాడు. ఇదివరకు అక్కడ ఉన్న పాత ఇల్లు గుర్తొచ్చింది. పెద్ద వాకిలి, పెరడు, నిండుగా పళ్ళ చెట్లు, పువ్వులతో ఎనిమిది వందల గజాల పెద్ద ఇల్లు ఉండేది. మోహన్ ఆ మధ్యనే పాత ఇల్లు పడగొట్టించి, ఆ జాగా డెవలప్మెంటుకు ఇచ్చి ఫ్లాట్లు కట్టించాడు. ఆ తర్వాత సత్యం అక్కడకి ఇదే రావడం. ఒకసారి తన జ్ఞాపకాలలోనున్న పాత ఇంటిని తలచుకుంటూ నిట్టూర్చి ముందుకు నడిచాడు సత్యం. వాచ్‌మెన్ చెప్పిన ప్రకారమే వెళ్లి ఇంటి బెల్లు కొట్టాడు.

ఒకావిడ వచ్చి తలుపు తీసి ఎవరు కావాలని అడిగింది.

"మోహన్‌రావూ..!" అంటూ నసిగాడు సత్యం అనుమానంగా.

"ఓహ్! మోహన్‌రావుగారిల్లు పై అంతస్తండీ! ఇది కృష్ణమోహన్ గారిల్లు." అంది మర్యాదగా.

సత్యం వెంటనే సారీ చెప్పబోతుండగా లోపలనుండి "ఎవరు రమా?" అంటూ ఒకతను వచ్చాడు. సత్యాన్ని చూస్తూనే నిర్ఘాంతపోయి ఉండిపోయాడు. సత్యానికి ఒక నిమిషం పట్టింది తన చిన్ననాటి స్నేహితుడు కృష్ణని పోల్చడానికి. మొత్తం బట్టతల వచ్చేసింది మరి. అప్పటికే కృష్ణ కళ్ళలో నీళ్ళు తిరుగుతున్నాయి. అమాంతంగా బయటకొచ్చి సత్యాన్ని గట్టిగా హత్తుకున్నాడు. సత్యానికి కూడా కళ్ళు చెమర్చాయి. "ఎన్నేళ్ళయ్యిందిరా నిన్ను చూసి! ఎలా ఉన్నావు?" నెమ్మదిగా నోరు పెగిలింది సత్యానికి. కృష్ణ ప్రేమగా చేయి పట్టుకొని సత్యాన్ని లోపలికి తీసుకెళ్లాడు. ఆశ్చర్యంగా చూస్తున్న రమతో "ఎవరనుకున్నావ్! మా పోలవరం స్కూలు స్నేహితుడు సత్యమే! ఎక్కడున్నాడో తెలియదని ఇన్నేళ్లుగా వెతుకుతున్న సత్యం." అన్నాడు ఆనందంగా. రమ కూడా వెంటనే సంబరపడిపోయి సత్యాన్ని పలకరించింది. చిన్ననాటి స్నేహితులిద్దరి ఆనందానికి అవధులు లేవు.

"మీ నాన్నగారికి పోలవరం నుండి బదిలీ అయ్యాక నువ్వెక్కడున్నావో అసలు తెలియలేదు. నేను స్కూల్ అయిపోయాక రాజమండ్రి కాలేజీలో చదువుకొని అక్కడే ఉద్యోగం చూసుకున్నాను. ఇన్నేళ్ళూ అక్కడే ఉన్నాం. ఈ మధ్యనే బదిలీయై ఈ విజయవాడకు వచ్చాం. మాకు పిల్లలు లేరు. దానికి నేను. నాకు అది. అంతే. మరి నీ సంగతులేంటి చెప్పు!" అని అడిగాడు కృష్ణ ఆత్రంగా.

"పోలవరం తర్వాత గుంటూరులో ఉన్నాం కొంతకాలం. నా చదువంతా బొంబాయిలో సాగిందిలే! కొన్నేళ్లు ఉద్యోగం చేశాను. పదేళ్ల క్రితం జబ్బుచేసి నా భార్య పోయింది. ఆ తర్వాత అక్కడ ఉండలేక, ఈ విజయవాడకు వచ్చి ఒక సొంత కంపెనీ పెట్టి వ్యాపారం మొదలుపెట్టి, బానే సంపాదించాను. నాకు ఒక్కడే కొడుకు. వచ్చేనెల వాడి పెళ్లి. ఆ శుభలేఖ ఇవ్వడానికే మా బంధువు మోహన్రావు ఇల్లు వెతుక్కుంటూ వచ్చి, వాచ్‌మెన్ పేర్లు పొరపాటు పడడంతో అనుకోకుండా మీ తలుపు తట్టాను. నాకైతే ఇంకా ఏదో కలలో ఉన్నట్టే ఉంది!" అన్నాడు సత్యం నవ్వుతూ.



"పోనీలే! ఎలాగైతేనేం మళ్ళీ కలిశాము. కాలేజీలో మళ్లీ నీలాంటి స్నేహం నాకు ఎవరితోనూ కుదరలేదురా! నిన్ను చాలా మిస్ అయ్యేవాడిని." అన్నాడు కృష్ణ.

"అవునురా నిజమే! భలే అల్లరి చేసేవాళ్ళం కదా! చూస్తూ చూస్తూ నలభై యేళ్ళు గడిచిపోయాయి. ఆ రోజులు మళ్ళీ రావు." అంటూ ఒక్క క్షణం మౌనంగా ఉండిపోయిన సత్యం నెమ్మదిగా "చిత్ర ఎక్కడుంటోందో తెలుసా? ఎలా ఉంది?" అని అడిగాడు.

కృష్ణ చిన్నగా నవ్వి "తను ఇంకా గుర్తుందా నీకు! ఇప్పుడు ఎక్కడుందో తెలియదు. స్కూలు రోజుల తర్వాత పెద్దగా మాట్లాడేది కాదు. ఎంతైనా ఆడపిల్లలు చిన్నప్పుడు మనతో కలిసి ఆడుకున్నట్లు కాలేజీకొచ్చాక చనువుగా ఉండరుగా! ఎప్పుడైనా అడపాతడపా పలకరించేది. తరువాత డిగ్రీ అవ్వగానే తనకు వాళ్ల బావతో పెళ్లి చేసేసారు. కానీ ఒక కూతురు పుట్టాక ఏవో గొడవలయ్యి భర్తతో విడిపోయిందని విన్నాను. మళ్లీ పోలవరంలోనే వాళ్ళ అమ్మ దగ్గరే ఉంటూ కొన్నాళ్ళు టీచరుగా చేసేది. మేము ఊరిలో ఇల్లు అమ్మేశాక గత ఎనిమిదేళ్లలో నేను మళ్ళీ అక్కడికి వెళ్ళలేదు. మరి చిత్ర అక్కడే ఉంటోందేమో తెలీదు!" అన్నాడు కృష్ణ, సత్యం కళ్ళలో బాధను గమనిస్తూ.

సత్యం నిట్టూర్చి "ఉద్యోగం, సంపాదన, వ్యాపారం అంటూ చాలా పరుగులు పెట్టాను జీవితంలో. మా వాడి పెళ్లి అయిపోగానే ఏ హరిద్వారుకో, రామేశ్వరానికో పోవాలని ఉంది. అదెప్పుడు కుదురుతుందో తెలియదు కానీ, ఒకసారి ఇద్దరూ కలిసి పోలవరం వెళదామా? మళ్లీ ఆ రోజులు జ్ఞాపకాలు నెమరేసుకోవాలని ఉంది. చిత్ర కనిపిస్తే తనను కూడా పెళ్లికి పిలిచినట్లు ఉంటుంది. ఏమంటావు?" అన్నాడు సత్యం.

కృష్ణ కూడా వెంటనే అంగీకరించడంతో వచ్చే ఆదివారం ఇద్దరూ కలిసి పోలవరం వెళ్దామని నిర్ణయించుకున్నారు. చాలాసేపు అక్కడే కబుర్లు చెప్పుకుని భోజనం చేసి, మోహన్రావుకు కూడా శుభలేఖ ఇచ్చి ఇంటికి వెళ్ళాడు సత్యం.

శిశిరంలో వసంతంలా ఒక కొత్త ఉత్సాహం మొదలైంది సత్యం జీవితంలో. ఆదివారం కోసం ఆత్రంగా ఎదురు చూశాడు. పదవ తరగతి వరకు పోలవరంలో తను, కృష్ణ, చిత్ర కలిసి ఒకే స్కూల్లో చదువుకున్నారు. చిత్రంటే తనకు ప్రాణం. ముగ్గురు కలిసి చాలా అల్లరి చేసేవాళ్ళు. చిత్ర కూడా వీళ్ళతో కలిసి కర్రా బిళ్ళ ఆడేది. వీళ్ళిద్దరూ ఆమెతో కలిసి తొక్కుడుబిళ్ళ ఆడేవారు. కాకెంగిలి చేసి తిన్న మామిడికాయలు, క్లాసులో ఒకరి కోసం ఒకరు తిన్న దెబ్బలు, గోదావరి ఒడ్డున కట్టిన ఇసుకగుళ్ళు, ఒకటేమిటి అన్నీ కళ్లముందు వరుసగా తిరిగాయి సత్యానికి. తను అదే ఊరిలో ఉండి ఉంటే ఖచ్చితంగా చిత్రనే పెళ్లి చేసుకునేవాడేమో! తెలిసీ తెలియని వయసులో, మనసులో నాటుకుపోయిన కల్మషమెరుగని స్వచ్ఛమైన స్నేహం అది. మళ్ళీ వెతికినా దొరకదు ఈ రోజుల్లో.

ఆదివారం ఉదయాన్నే స్నేహితులిద్దరూ కలిసి, సత్యం కారులో పోలవరం బయలుదేరారు కొత్త ఉత్సాహంతో. గమ్యం దగ్గరవుతుంటే, ప్రయాణిస్తున్న ప్రతి మైలుకు వారి వయసు ఒక్కో ఏడాది తగ్గుతున్నట్టు అనిపించింది. పదకొండు గంటలకు పోలవరం చేరుకున్నారు. ఊరంతా బాగా మారిపోయింది. అన్నీ చూస్తూ నెమ్మదిగా వినాయకుడి గుడి వద్ద కారు పార్కు చేసి, దర్శనం చేసుకుని, కాలినడకన ఇద్దరూ ఊరిలోకి నడిచారు. ఆదివారం సంత జరుగుతోంది.

"ఈ సూపర్ మార్కెట్ల షాపింగులొచ్చాక ఇలాంటి సంత చూసి ఎన్నేళ్ళయిందిరా!" అన్న కృష్ణకు, సత్యం జవాబివ్వలేదు సరికదా ఎదురుగా ఉన్న కూరల దుకాణం వైపు చూస్తూ కొయ్యబారిపోయి ఆగిపోయాడు.

ఎదురుగా చిత్ర ఆకుపచ్చని నేతచీరలో చేతిలో కూరల సంచితో వనదేవతలా సాక్షాత్కరించింది. నెరిసిన ముంగురులు, ముఖంపై చిన్నగా ముడతలు వచ్చినా, ఆమెలోని కాంతి ఏ మాత్రం తగ్గలేదు. అదే చిరునవ్వు. అదే నిబ్బరం. "చిత్రా!" అంటూ తనవైపు వస్తున్న కృష్ణను పోల్చుకోలేక ఆశ్చర్యంగా చూస్తోంది చిత్ర.

సత్యం కూడా నెమ్మదిగా దగ్గరకు వెళ్ళి "ఎలా ఉన్నావు చిత్రా? మమ్మల్ని పోల్చుకున్నావా?" అని అడిగాడు ఆర్ద్రమైన కళ్ళతో. ఆనందంతో ఆమె వయసు వెనక్కి మళ్ళింది. మనసు స్కూలుకు పరుగులు తీసింది. ఇద్దరిని పోల్చుకుని ప్రేమగా పలకరించింది. పక్కసందులో ఉన్న తన ఇంటికి ఇద్దరిని ఆహ్వానించి తీసుకెళ్ళింది.

ఒకటే గది, వసారాతో ఉన్న చిన్న ఇల్లది. మాటల్లో చిత్ర తన కథంతా చెప్పింది. దగ్గర సంబంధం అని నమ్మి, తల్లితండ్రులు ఉన్నదంతా ఊడ్చిపెట్టి ఆమె పెళ్ళి చేశారు. కాని ఆమె భర్త తాగుడుకు బానిసై, ఆమెను, కూతుర్ని బాధలు పెడుతుంటే భరించలేక అతనిని విడిచి పుట్టింటికి వచ్చేసింది. తండ్రి పోయాక అక్కడే స్కూలులో టీచరుగా ఉద్యోగం చేస్తూ జబ్బుపడ్డ తల్లిని చూసుకుంటూ, కూతురు వాణిని చదివించింది. తల్లి కూడా చనిపోయాక ఉన్న ఆ ఒక్క ఇల్లు కూడా అమ్మి వాణికి ఆరునెలల క్రితమే పెళ్ళి చేసింది.

"అదేంటి చిత్రా! ఇప్పుడు వాణి ఎక్కడుంది? మరి ఇప్పుడు నీకు ఏమిటి ఆధారం?" అడిగాడు కృష్ణ అంతా విని.

"నాకేం లోటు! అన్నింటికీ దేవుడే ఉన్నాడు. నా జీవితంలాగా అవ్వకుండా నా కూతురికి మంచి సంబంధం వచ్చింది. దాని స్నేహితురాలి అన్నయ్యే కోరి చేసుకున్నాడు. ఢిల్లీలో పెద్ద ఉద్యోగం అల్లుడికి. వాణికి ఇల్లు తాకట్టు మాత్రమే పెడుతున్నానని అబద్ధం చెప్పి పెళ్ళి చేశాను. నిజం తెలిస్తే అది ఒప్పుకోదు." అంది చెంపపై రాలుతున్న రెండు కన్నీటి ముత్యాలను కొంగున మూటకడుతూ.

"మరి నువ్వు కూడా వాణి ఇంటికే వెళ్ళిపోవచ్చుగా! ఇక్కడ నీకెలా గడుస్తుంది?" అడిగాడు సత్యం భారంగా. "నాకు ఆధారం లేదని దానికి భారం కాలేను! అయినా ఆ ఢిల్లీ బ్రతుకు నా వల్ల కాదు. నాకు ఉండడానికి ఈ అద్దిల్లు చాలు. సాయంత్రాలు కొందరు పిల్లలు ట్యూషనుకి వస్తుంటారు. ఆ డబ్బుతో నా రోజులు వెళ్ళిపోతున్నాయి. ఈ గోదావరి తల్లి ఒడిలో ఇలా నా జీవితం హాయిగా వెళ్ళిపోతే చాలు. నాకు ఇంకే కోరికలు లేవు." అంది చిత్ర గంభీరంగా.

సత్యం మనసులో చిన్ననాటి చిత్ర కదలాడింది. ఎంత మార్పు! ఆ చిత్రేనా! అల్లారుముద్దుగా పెరిగిన చిత్ర! అంత చలాకీగా అందరికీ తలలో నాలుకగా మెదిలిన చిత్ర! ఇవాళ ఈ పూరింటిలో ఒంటరిగా నిస్సహాయంగా ఉండాల్సిందేనా! చిత్ర నిజంగానే చిత్రంగా కనిపిస్తోంది సత్యానికి. ఆ మధ్యాహ్నం భోజనం చేసి ముగ్గురూ గోదావరి ఒడ్డు, తమ చిన్ననాటి గుర్తులున్న ప్రాంతాలు చూసి వచ్చాక, సాయంత్రానికి సత్యం, కృష్ణ తిరుగు ప్రయాణమయ్యారు.

సత్యం నెమ్మదిగా పెళ్లి పనులలో పడ్డాడు. నెల రోజుల తర్వాత సత్యం కొడుకు పెళ్లికి చిత్ర, కృష్ణ కూడా వచ్చారు. అంతా ఘనంగా జరిగిపోయింది. రోజులు నెమ్మదిగా గడుస్తున్నాయి. అప్పుడప్పుడు స్నేహితులు కలుస్తూనే ఉన్నారు. ఆరు నెలల తర్వాత ఒకనాడు సత్యం దగ్గరనుంచి చిత్రకి ఒక ఉత్తరం వచ్చింది. ఆత్రంగా తెరిచి చూసింది. లోపల షిరిడీకి ఒక రైలు టికెట్టు, చిన్న చీటీ ఉన్నాయి. అందులో "చిత్రా! నీకు ఒక సర్ప్రైజ్! ప్రశ్నలు వేయకుండా ఈ టికెట్టుతో రెండు రోజుల్లో ప్రయాణమై షిరిడీ చేరుకో. నేను నిన్ను అక్కడ స్టేషన్లో కలుసుకుంటాను. ఇట్లు సత్యం" అని ఉంది.

షిరిడీ అనగానే చిత్రకు ఆసక్తికరంగా తోచింది. ఆనందంగా ప్రయాణానికి సిద్ధమైంది. టికెట్టుపైనున్న తేదీనాడు బయలుదేరి రైలెక్కింది. మర్నాడు సాయంత్రానికి రైలు షిరిడీ చేరుకుంది. అన్న ప్రకారం సత్యం ప్లాట్ఫారంపై ఆమె కోసం ఎదురుచూస్తున్నాడు.

"ఏంటిది ఉన్నట్లుండి? నీ సంగతి తెలుసు కాబట్టి ఏదో ముఖ్యమైన ప్లాన్ వేసుంటావనుకొని బయలుదేరి వచ్చేసాను." అంది నవ్వుతూ చిత్ర రైలు దిగుతూనే.

"నా మీద ఉన్న నమ్మకానికి ధన్యవాదాలు రాణీగారూ! నీ నమ్మకం ఎప్పటికీ అలాగే నిలుపుకుంటానులే. ముందు పద. వివరాలు తర్వాత చెప్తాను!" అంటూ ఆమె చేయి పట్టి అందుకున్నాడు సత్యం. వాళ్ల కోసం స్టేషన్ బయట సిద్ధంగా ఉన్న కారులో గంటన్నర ప్రయాణం తరువాత అహ్మద్నగర్ దగ్గర ఒక పచ్చని పల్లెటూరుకు చేరారు.

చుట్టూ ప్రహరీ గోడ ఉన్న ఒక గేటు బయట కారు ఆగింది. చిత్ర చుట్టూ ఆశ్చర్యంగా చూస్తూ, సత్యం వెంట లోనికి నడిచింది. చక్కటి పండ్ల చెట్లు, పువ్వుల చెట్లతో చిన్న తోట. మధ్య కాలిబాటన కొంచెం ముందుకెళ్ళగానే చిన్న కుటీరంలాంటి పెంకుటిల్లు కనిపించింది. కొత్తగా రంగులు వేసినట్లు తెలుస్తోంది. వెనుకగా గలగలమంటూ గోదావరి ప్రవహిస్తోంది. సాయంసంధ్యా కిరణాల మధ్య ముద్దుగా ముచ్చటగా మెరుస్తున్న ఆ కుటీరం వైపునుండి కళ్ళు తిప్పుకోలేకపోయింది చిత్ర. మనసు లేడిపిల్లలా లోలోపలే గంతులు వేసింది. కుటీరంపై 'వానప్రస్థం' అని రాసి చిన్న బోర్డు ఒకటి ఉంది.

"ఇది ఎవరిల్లు సత్యం? ఎంత బావుందో!" అంది చిత్ర. ఆమె ఆనందాన్ని, ఆమె కంట్లోని మెరుపుని మౌనంగా చూస్తున్న సత్యం "నీదే!" అన్నాడు.

చిత్ర నిర్ఘాంతపోయింది. అంతలో లోపలనుండి ఒక అవ్వ మంచినీళ్లు తీసుకొచ్చింది. "అలసిపోయి ఉన్నావు. విశ్రాంతి తీసుకో చిత్రా!" అని సత్యం అనగానే అవ్వ చిత్రను లోపలకు తీసుకువెళ్లి ఆమె గది చూపించింది.

మర్నాడు సూర్యోదయం వేళ సత్యం, చిత్ర ఇంటి వెనుకనున్న గట్టుపై కూర్చున్నారు గోదావరి అందాన్ని చూస్తూ.

"ఇప్పటికైనా వివరంగా చెప్తావా నీ మనసులో ఏముందో! నన్ను ఎందుకు రమ్మన్నావో!" నెమ్మదిగా అడిగింది చిత్ర.

"నా కొడుకుకి లండన్లో మంచి ఉద్యోగం వచ్చి గత నెల భార్యతో లండన్ వెళ్ళిపోయాడు. నాకు ఈ దేశం వదిలి వెళ్ళడానికి మనస్కరించలేదు. కావలసినంత సంపాదించుకున్నాను. ఇక పరుగులు పెట్టే యాంత్రిక జీవితంనుండి ప్రకృతి ఒడిలో సేదతీరే ప్రశాంత వానప్రస్థాశ్రమంలోనికి అడుగు పెట్టాలనుకున్నాను. అనుకోకుండా ఒక మరాఠీ స్నేహితుని ద్వారా ఈ స్థలం కొని ఇల్లు బాగుచేయించాను. నీ పరిస్థితి తెలుసుగా! అందుకే నిన్నూరమ్మన్నాను. ఇకపై మనమిక్కడే ఉందాము. కావాలంటే పిల్లల దగ్గరకు వెళ్లిరావచ్చు. లేదా వాళ్లే మన దగ్గరకు వచ్చిపోతుంటారు. అనాథైన ఆ అవ్వ కూడా ఇల్లు కనిపెట్టుకొని మనకు తోడుగా ఇక్కడే ఉంటుంది." అన్నాడు తన ఉద్దేశాన్ని వివరిస్తూ.

చిత్ర ఒక్క క్షణం మౌనంగా ఉండిపోయింది. "నీ ఉద్దేశం బాగుంది కానీ, నేను భర్త నుండి వేరుపడ్డదాన్ని. నీకు భార్య చనిపోయింది. ఈ వయసులో మనిద్దరం ఇక్కడ కలిసుంటే లోకం ఏమంటుందో ఒక్కసారైనా ఆలోచించావా!" నెమ్మదిగా గోదావరి వంక చూస్తూ అడిగింది చిత్ర.

సత్యం చిన్నగా నవ్వాడు. "నా దృష్టిలో నువ్వు గోదావరిమాత అంత స్వచ్ఛమైనదానివి చిత్రా! నీపై నాకు ఆరాధనాభావమే కానీ ఎప్పుడు ఏ దురుద్దేశమూ లేదు. నేనేంటో లోకానికి తెలియకపోవచ్చు. నీకు తెలిస్తే చాలు. నిన్ను నీ భర్త అన్ని బాధలు పెట్టినప్పుడు, ఒంటరిగా నీ కూతుర్ని చదివించడానికి నువ్వు కష్టపడినప్పుడు నీ గురించి ఆలోచించిందా ఈ లోకం? ఇవాళ నువ్వెందుకు లోకం గురించి ఆలోచిస్తున్నావు?" అన్నాడు సత్యం.

"మరి నా కూతురు.." అంటూ ఏదో అనబోయి ఆగిపోయింది చిత్ర.

"నేను ముందే వాణితో ఫోన్లో మాట్లాడాను. నువ్వు తన దగ్గరికి రావట్లేదని, నీ విషయంలో బెంగ పెట్టుకుంది. నాతో చెప్పి బాధపడింది. నా నిర్ణయం చెప్పగానే చాలా ఆనందించి నిన్ను ఎలాగైనా ఒప్పించమని, ముందుగా విషయం చెప్తే నువ్వు ఒప్పుకోవని, ఉత్తరంలో టికెట్టు పెట్టి పంపమని సలహా చెప్పింది కూడా తానే." అన్నాడు సత్యం.

చిత్ర పెదవులపై చిరునవ్వు, కళ్ళలో నీరు ఒకేసారి వచ్చాయి.

"బాధపడకు చిత్రా! మన కృష్ణ కూడా ఈ ఏడాది వాలంటరీ రిటైర్మెంట్ తీసుకుంటున్నాడట. వాడిని కూడా భార్యను తీసుకుని ఇక్కడికే వచ్చేయమందాం. ఒక తల్లి కడుపున పుట్టకపోయినా ఒక నేలతల్లి ఒడిలో కలిసి పెరిగిన బిడ్డలం. మళ్లీ ఆ నేలతల్లి ఒడిలో కలిసేవరకు స్వచ్ఛమైన స్నేహితులుగా హాయిగా కలిసుందాం." అన్నాడు సత్యం నిర్మలమైన చిరునవ్వుతో.

అప్పుడే ఉదయించిన సూర్యబింబం ప్రేమగా పలకరిస్తున్నట్లు వెచ్చని కిరణాలను వానప్రస్థంపై ప్రసరింపజేసింది. గోదావరి ఎప్పటిలా గలగలా నవ్వింది.

# ట్రెండ్ వద్దు స్టాండర్డ్ ముద్దు

సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ

సుంకరణం జ్యోతి



***"ఒకే రంగుకి పిల్లలు అలవాటు పడకూడదట, రంగులు మారుస్తూనే ఉండాలిట, అందుకే ఒక్కో రోజు ఒక్కో రంగు యూనిఫాం! వీళ్ళ రూల్స్ అన్నీ ముందుచూపుతో చాలా బావున్నాయండీ!" అంటూ చెప్తూ మురిసిపోయింది వేణి.***

★★★

అప్పుడే ఆఫీస్ నుంచీ ఇంటికి వచ్చిన మోహన్ చేతికి టీ తో పాటు పిల్లలిద్దరి ప్రోగ్రెస్ రిపోర్ట్‌ని కూడా అందించింది వేణి.

వాటిని పై నుంచీ కిందకి చూసి, వెక్కిరిస్తున్న నిండు సున్నాలు తప్ప అంకెలేవీ కనపడక పోవడంతో, నిరాశ, నిస్పృహతో ఎదురుగా ఉన్న టీపాయ్ మీదకి పడేసి "హు.. ఎన్ని స్కూల్స్ మార్చినా, ట్యూషన్లు పెట్టినా ఫీజులు పెరగడమే కానీ, వీళ్ళ మార్కులు పెరగడం లేదు. ఏ డాక్టర్లనో, ఇంజనీర్లనో చేద్దామని అనుకుంటూ ఉంటే కనీసం పదో క్లాసైనా గట్టెక్కుతారో లేదో అనిపిస్తోంది, ఇంకా వీళ్ళేదో ఉద్ధరిస్తారని ఏ ఏటికాఏడు ఫీజులు తగలెయ్యడం నా బుద్ధి తక్కువ, మానిపించేస్తాను, ఇద్దరినీ స్కూళ్ళు మానిపించేసి రెండు గేదెల్ని కొంటాను, కాసుకుంటారు వెధవలు!" అన్నాడు అసహనంగా మోహన్.

"ఇదే.. ఇదే కరెక్ట్! నేనూ ఇదే అనుకుంటున్నాను!" అంది వేణి వెంటనే పక్కనే కూర్చుంటూ.

"ఏవిటీ?" అంటూ తెల్లబోతూ వేణి ని చూసి "నేనేదో కోపంలో అలా అన్నాను, నిజంగానే గేదెల్ని కొనేద్దామా?" అంటూ ఆశ్చర్యంగా అడిగాడు.

"అబ్బా.. నేను అనుకుంటున్నది గేదెల్ని కొనాలని కాదు, వీళ్ళిద్దరినీ స్కూల్ మానిపించెయ్యాలనీ.." అని అంటున్న వేణిని చూసి ఇంకా ఆశ్చర్యపోతూ "నువ్వేమి మాట్లాడుతున్నావో నీకేమైనా అర్ధం అవుతోందా?" అని అన్నాడు మోహన్.

' ఇదిగో ఇది చూడండి ముందు, తర్వాత నా మాటలు మీకే అర్ధం అవుతాయి!" అంటూ ఓ పాంప్లెట్‌ని భర్త చేతిలో పెట్టింది వేణి.

దానిలో 'మీ పిల్లల భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని, వాళ్ళ తర్వాత తరాలకి కూడా భరోసా ఉండాలనీ మీరు కోరుకుంటున్నారా.. అయితే రండి, మా "ఎక్స్ ఎక్స్" కోచింగ్ సెంటర్‌లో జాయిన్ చెయ్యండి. మీ పిల్లల బంగారు భవితకు మార్గం సుగమం చెయ్యండి.' అంటూ ఉన్న అడ్వర్‌టైజ్మెంట్‌ని చూసి, 'ఏవిటిది' అన్నట్లు వేణి మొహం లోకి చూశాడు.

"ఇదీ" అంటూ మోహన్ చెవిలో రహస్యంగా ఏదో చెప్పింది. అది విన్న మోహన్ "అవునా.. వీటికి కూడా కోచింగ్ సెంటర్లు ఉంటాయని నేనింత వరకూ వినేలేదు" అన్నాడు. "నేను వీళ్ళకి ఫోన్ చేసి అన్ని వివరాలూ కనుక్కున్నాను, వీళ్ళ ఇచ్చే కోచింగ్‌కి పిల్లలకి చదువూ, తెలివితేటలతో సంబంధమే లేదట, పెద్దగా బుర్ర ఉండాల్సిన అవసరం కూడా లేదట. మీ కెందుకు, మమ్మల్నినమ్మి ఓ అయిదారేళ్లు మీ పిల్లలని మాకు వదిలేయ్యండి, అన్ని విషయాల్లో ఆరితేరి బయటికి వచ్చి, ఓ ప్రభంజాన్ని పిల్లలు సృష్టించకపోతే మమ్మల్ని అడగండి! మీరే అయితే... అతి కష్టం మీద మీ పిల్లలని చదివించి, మహా అయితే ఓ డాక్టర్నో, ఇంజనీరునో ఇంకా కాదంటే ఓ ఐ.ఏ.ఎస్. ఆఫీసర్నో చెయ్యగలరు. అదే మేమైతే వీళ్ళందరినీ వేలెత్తి చూపించి.. శాసించే స్థాయి గల వ్యక్తులుగా మీ పిల్లలని తీర్చి దిద్దగలం. మాది గ్యారంటీ, అంతే కాదు పూర్తి స్థాయి కోచింగ్ తీసుకుని మా సంస్థ నుండి వెళ్ళే ప్రతీ విద్యార్ధికీ వారు కోరుకున్న డిగ్రీ లో సర్టిఫికెట్లు కూడా ఇస్తాం, అంటూ ఎంతో బాగా చెప్పారండీ! మా లేడీస్ క్లబ్ లో చాలా మంది వాళ్ళ పిల్లలని జాయిన్ చేసేశారు, నాకు కూడా మన పిల్లలిద్దరికీ ఇదే కరెక్ట్ అనిపిస్తోంది!" అంటూ వివరించింది వేణి.

"నాకెందుకో అంత నమ్మకంగా అనిపించటం లేదు!" అంటూ నసుగుతున్న మోహన్‌కి..

"ఇన్ని సంవత్సరాలూ వేలకి వేలు ఫీజులు పోశాం, ఏనాడైనా ఎవరైనా ఇంత భరోసా ఇచ్చారా! ఇప్పుడు కూడా ఓ ఏడాది పంపించి చూద్దాం, వాళ్లేమి చెప్తారో, వీళ్ళేమి నేర్చుకుంటారో తెలుస్తుంది, వద్దనిపిస్తే అప్పుడే మానిపించేద్దాం!" అంటూ మోహన్‌ని ఒప్పించింది వేణి. అంతే కాదు భర్త మనసు మారకుండా మర్నాడే వెళ్ళి ఫీజులు కట్టేసింది. మరో రెండు రోజుల్లో కోచింగ్‌కి వెళ్లబోతున్నారనగా, యూనిఫాంలు కొనుక్కొచ్చింది. అనేక రకాల రంగుల యూనిఫాంలు మంచంనిండా పరుచుకుని ఉండడం చూసి "యూనిఫాం అంటే ఒకటే కదా, ఇన్నేవిటీ?" అంటూ ఆశ్చర్యంగా చూస్తూ అడిగాడు మోహన్.

"ఒకే రంగుకి పిల్లలు అలవాటు పడకూడదట, రంగులు మారుస్తూనే ఉండాలిట, అందుకే ఒక్కో రోజు ఒక్కో రంగు యూనిఫాం! వీళ్ళ రూల్స్ అన్నీ చాలా ముందు చూపుతో చాలా బావున్నాయండీ!" అంటూ చెప్తూ మురిసిపోయింది వేణి.



ఓ ఆదివారం, పేపరు చదువుతూ కూర్చున్న మోహన్ దగ్గరికి పిల్లలిద్దరినీ తీసుకొచ్చి నించోబెట్టి, "చెప్పు నాన్నా, పెద్దయ్యాక నువ్వేమి చేస్తావో మీ నాన్న వింటారూ!" అంటూ అడిగింది కొడుకుని.

వాడు వెంటనే " ప్రతీ పేదవాడికీ విల్లాను కట్టించి ఇస్తా, కూలి పని చేసే ప్రతీ వాడికీ కారుని కేటాయిస్తా, ఏ పనీ పాటా లేకుండా తిరిగే వాడికి నెల నెలా భృతిని ఇప్పిస్తా ..." అంటూ ఏకధాటిగా వాగ్దానాలు చేసేస్తున్న వాడ్ని "చాలు నాన్నా చాలు!" అంటూ బుగ్గలు రాసేసి ముద్దులాడి , "ఇప్పుడు నువ్వు చెప్పవే" అంటూ కూతుర్ని ముందుకు తోసింది వేణి. ఆ పిల్ల మెలికలు తిరిగిపోతూ "ప్రతీ మహిళకీ, ప్రతీ శ్రావణ మాసానికీ తులం బంగారం, పట్టు చీరా అందేలా ఏర్పాటు చేస్తా, తెల్ల రేషను కార్డు కలిగిన ప్రతీ మహిళకూ రేషనులో అతి తక్కువ ధరకే లిప్ స్టిక్కులూ, మేకప్ కిట్లూ ఇప్పిస్తా, తిండి లేక విల విలలాడే అక్క చెల్లెమ్మలకి కిలోల కిలోలు పసుపూ, కుంకుమా పంచి పెడతా.." అంటూ ముద్దుగా మూతి తిప్పుకుంటూ చెప్పడంతో వేణి మురిసి ముక్కలైపోయింది.

పిల్లల నోటి నుండీ ఇప్పటి వరకూ ఏ పద్యమో, పాటమో విన్నది లేదేమో, ఇది ఏదో కాస్త బాగానే అనిపించింది మోహన్‌కి కూడా. ఓ రోజు ఇంకా పూర్తిగా తెల్లారకుండానే, గోల గోలగా ఎవరో తిట్టుకుంటూ గొడవపడడం వినిపించి, నిద్ర చెడీ అసహనంగా బయటికి వచ్చి, అది పిల్లల గదిలో నుంచే అని గమనించి నెమ్మదిగా తలుపు తోసుకుని ఆ గదిలోకి వెళ్ళాడు మోహన్. అక్కడ "నీ ..." అని కొడుకు ఓ బూతు ప్రయోగం చేయగానే, దానికి ధీటుగా కూతురు "ఓరి నా పిచ్చి ...." అని మరో బూతు బాణం వదిలింది, దానికి సమాధానంగా కొడుకు నుంచీ మరోటీ, వెంటనే రిప్లై ఇస్తూ కూతురు ఇంకోటి అనగానే అక్కడే నుంచున్న వేణి "అయ్యో అలా పై పైన తేలిపోతూ కాదమ్మా.. ఇలా నాలిక మడత పెట్టి, బాగా లోపటి నుంచీ బలంగా రావాలి" అంటూ ఎలాగో చేసి చూపిస్తోంది కూతురికి, అంతే!

అది చూసి తట్టుకోలేక "ఛీ ఛీ ఏవిటే ఈ ఛండాలం, ఆపండి!" అంటూ అరిచేశాడు మోహన్.

"ఛండాలం కాదు .. ఈ రోజుల్లో చలామణీ అవుతున్న భాష ఇదే, నేనూ విన్న మొదట్లో మీలాగే కంగారు పడి అడిగాను వీళ్ళ ట్రైనర్స్ ని. 'ఈ రోజుల్లో మనం ఎవర్నైనా చెప్పు చేతల్లో పెట్టి ఒక పని చేయించుకోవాలన్నా, మన పనికి ఎవడూ అడ్డు తగలకుండా ఉండాలన్నా, మన తప్పు ఎవ్వరూ వేలెత్తి చూపించకుండా ఉండాలన్నా.. దేనికైనా సరే ఇటువంటి భాష ముఖ్యం. అందుకే ఈ భాష ఎంత అనర్గళంగా, ఎంత ధారాళంగా వస్తే అంత బావుంటుంది. వీళ్ళ ఫ్యూచర్ అదే' అంటూ చెప్పారండి వాళ్ళు!" అంటూ వివరించింది వేణి.

అసలే ఈ మాటలు సగమర్ధమయీ, అవ్వక అయోమయంలో ఉన్న మోహన్‌కి కూతురు నోటితో మాట్లాడకుండా చేతులతో ఏవేవో పిచ్చి పిచ్చి సైగలు చేస్తూ ఉండడం కనిపించింది. "ఇదేవిటి ఇలా చేస్తోందీ" అన్నాడు గాబరాగా. దానికి కూడా పెద్దగా నవ్వేస్తూ "మాటలెక్కడైనా రికార్డ్ అయి భవిష్యత్తులో ప్రమాదం వస్తుందేమో అని అనుమానం ఉన్నప్పుడు ఇలా ద్వంధార్ధపు సైగలు చెయ్యాలన్నమాట. దానికి ప్రాక్టీస్ చేస్తోంది అది!" అని చెప్పింది వేణి.

"ఏమో నాకు ఇవన్నీ చూస్తుంటే అంతా గాబరాగా ఉంది!" అంటూ చెప్పాడు ఏడుపు మొహం తో మోహన్.

"అబ్బా మీరు మరీనండీ, ఏదో ఎప్పుడూ ఇలాటివి విననట్లే, చూడనట్లే కంగారు పడిపోతున్నారు. టివిల్లో, సోషల్ మీడియాలలోనూ రోజూ చూసి అలవాటు పడిపోలేదూ, ఇక్కడా అంతే! మొదట్లో అలాగే ఉంటుంది, రాను రానూ ఏవీ అనిపించదు, పైగా ఇవి ఏవో మీరు బూతులు అనుకుంటున్నారు కానీ, ఇవి అసలు బూతులే కాదుట. వీటికి అర్ధాలే వేరు కావలిస్తే ఇది చూడండి!" అంటూ కోచింగ్ సెంటర్ వాళ్ళు తయారు చేసిన ఓ డిక్షనరీ ని తీసుకొచ్చి చూపించింది.

అందులో ప్రతీ బూతుకి ' ఓ మంచి వాడా ' అనో 'నువ్వు అభివృద్ధిలోకి రా' అనో, 'నువ్వు కలకాలం సుఖంగా ఉండాలి' అనో అర్ధాలు రాసి ఉండడం చూశాడు మోహన్.

"చూసారా, మీరు నిశ్చింతగా ఉండండి! నేను వీళ్లతో అప్పుడప్పుడూ క్లాస్‌లకి వెళుతూ, ఏవి ఎందుకు చేస్తున్నారో, వేటి ఉపయోగం దేనికో తెలుసుకుంటున్నాను, వీళ్ళ సంగతి నేను చూసుకుంటాను, మీరేమీ వర్రీ అవ్వకండి!" అంటూ ధైర్యం చెప్పింది వేణి.

ఈ లోగా మళ్ళీ కొడుకు బూతు పురాణం మొదలెట్టడంతో భరించలేక, అక్కడ ఉన్న తువ్వాలిని తీసుకుని చెవులకి చుట్టేసుకుంటూ బయటకి పరిగెట్టాడు మోహన్.

మరో రోజు ఏదో పనిలో ఉన్న వేణిని ఎందుకు డిస్టర్బ్ చెయ్యాలిలే అనుకుని, భోజనం తనే పెట్టుకుని తినడానికి సిద్ధమయ్యాడు మోహన్. ఇలా ఒక్క ముద్ద నోట్లో పెట్టీ పెట్టుకోగానే భరించలేని కారంతో నోరు మండిపోవడంతో "ఒసేయ్ .. నీ మొహం మండా ఇంత కారం పోసావేవిటే!" అంటూ ఒక్క కేక వేశాడు.

దాంతో అక్కడికి వేణి పరిగెట్టుకుంటూ వచ్చి "అయ్యో పిల్లలకి చేసిన కూర మీరు వేసుకున్నారా!" అంటూ అడిగింది. మొత్తం బిందె ఎత్తి వగర్చుకుంటూ నీళ్ళు తాగేసి "పిల్లలకి చెయ్యడం ఏవిటీ.. ఏం వాళ్ళని చంపేద్దామనుకున్నావా?" అంటూ అడిగాడు కోపంగా.

"రామ రామ! అవేం మాటలండీ. చుట్టూ ఉన్నవాళ్ళు మనల్ని చూసి భయపడాలన్నా, మన అడుగులకి మడుగులొత్తాలన్నా ఒక రకమైన పోగరూ, తెగువాతో ఉండాలిటండీ! అందుకు సాత్విక ఆహారం పనికి రాదట, ఇలాగే ఉండాలని చెప్పటంతో.." అంటూ వేణి చెపుతుంటేనే ఆపేసి "వద్దు వద్దు .. ఏమైనా చెయ్యి, కానీ ఇంత కారం మటుకు వాళ్ళకి వద్దు భరించలేరు!" అంటున్న మోహన్‌కి "అటు చూడండి" అంటూ చూపించింది వేణి.

అక్కడ పిల్లలిద్దరూ ఆ కారపు కూరని ఓ చేత్తో పెద్ద పెద్ద ముద్దలుగా చేసుకుని మింగేస్తూనే మరో చేత్తో దొరికిన స్టీలు గ్లాసులనీ, చెంచాలనీ కసిగా నొక్కి పిప్పి చేసేస్తూ కనిపించడంతో.. అవాక్కయి అక్కడ నుంచీ వెళ్లిపోయాడు మోహన్.

పిల్లలు నేర్చుకొస్తున్నవన్నీ విచిత్రంగా, వింతగా, కాస్త ఏహ్యంగా ఉండడంతో నచ్చక పోయినా వేణి ఎప్పటికప్పుడు నచ్చ చెపుతుండడంతో సరిపెట్టుకొస్తున్న మోహన్ ఆ రోజు జరిగిన సంఘటనని మాత్రం సరిపెట్టుకోలేకపోయాడు. రోజూలా సాయంత్రం ఆఫీస్ నుంచీ ఇంటికి వచ్చి, వీధి గుమ్మంలోనే కనపడ్డ దృశ్యం చూసి నిర్ఘాంతపోయాడు, కూతురి జుత్తుని పిడికిట్లో బిగించి పట్టుకుని బలంగా వీపు మీద కొడుతున్నాడు కొడుకు, నొప్పి భరించలేక ఏడుస్తున్న కూతుర్ని ఒక చేత్తో విడిపిస్తూనే, మరో చేత్తో కొడుకును తోస్తూ "ఒరేయ్ .. అది నీ చెల్లిరా, వదలరా" అంటూ ఉన్న వేణి ని, విసురుగా ఒక్క తోపు తోశాడు కొడుకు. దాంతో వెళ్ళి గోడకి కొట్టుకుని పడిపోయింది వేణి. ఇదంతా చూసి కోపం పట్టలేక ఉగ్రుడైపోయాడు మోహన్. కొడుకుని చాచి పెట్టి ఒక్కటి కొట్టి, వాడి చేతి లోంచి కూతుర్ని విడిపించి, దగ్గరికి తీసుకుని "ఎందుకురా దాన్ని కొడుతున్నావు?" అంటూ అరిచాడు.

"అది మనింట్లో ఉంటూనే, నా ఎనీమీ రాముగాడితో ఫ్రెండ్ షిప్ చేస్తోంది!" అంటూ ముద్ద ముద్దగా చెప్తూ, తూలుతూ, తిడుతూ.. తన మీదకి కూడా వచ్చి చెయ్యి ఎత్తబోతున్న కొడుకుని మరో దెబ్బ వేసాడు. వాసన వస్తున్న వాడ్ని దూరంగా తోసేసి, పడిపోయిన భార్యని లేవదీసి "ఏవిటిది వేణీ ఏవిటీ ఘోరం, వీడెందుకు ఇలా చేస్తున్నాడు?" అంటూ అడిగాడు. అన్నిటికీ నవ్వి తేలిగ్గా తీసుకునే వేణి అప్పుడు మాత్రం "నేటి నాయకత్వ లక్షణాల్లో విచక్షణ కోల్పోవడం ప్రధానం, దానికి మధ్యపానం అవసరం అని వాళ్ళు చెప్పడంతో, ఓఓ అంశుడు మద్యం ఇవ్వడం మొదలుపెట్టానండీ!" అంటూ చెప్పి భోరుమని ఏడ్చింది.

ఇక దాంతో సహనం కోల్పోయాడు మోహన్. "చాలు ..ఇప్పటి దాకా వీళ్ళని దిగజార్చింది చాలు! చదువు సంధ్యలూ, తగినంత అర్హతా లేకపోయినా రౌడీయిజం, గుండాయిజంతో ఎవరో ఏదో చేసేస్తున్నారనీ, కోట్లు సంపాయించి రాజ్యాలు ఏలేస్తున్నారనీ, వాళ్ళవే రోజులనీ చెప్పి అటువంటి వాళ్ళలా మన పిల్లలని కూడా తయారుచేస్తే, తిరుగులేని భవిష్యత్తు ఉంటుందనుకోవడం పిచ్చితనం. ఆ కోచింగ్ సెంటర్ వాళ్ళు.. నీలా ఆలోచించే తల్లిదండ్రుల మనస్తత్వాలను ఆసరా చేసుకుని, పిల్లల జీవితాలతో ఆడుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు! న్యాయాలు, అన్యాయాలు, మంచి చెడ్డలూ, అనేవి మన పురాణకాలాల నుంచీ ఉన్నాయి.. ఇప్పుడూ ఉన్నాయి. ఏదో కాలమాన పరిస్థితుల ప్రభావంతో ఒక్కోసారి అన్యాయం, అక్రమం, అవినీతి, అహంకారాలదే పై చెయ్యి కావచ్చు, అంత మాత్రంచేత అది అనుసరణీయం కాదు. చూశావుగా ఈ రోజు నీ కొడుకు ప్రవర్తన, విచక్షణ కోల్పోయిన వాడు ఇంత చిన్నతనంలోనే చెల్లినీ, తల్లినీ కూడా ఉపేక్షించలేదంటే, రేపటి రోజున ఈ సమాజానికి వాడు ఎంతటి చీడపురుగుగా మారతాడో ఊహించడానికే ఒళ్ళు గగుర్పొడుస్తోంది. అలాంటి బతుకూ ఓ బతుకేనా.. అదీ ఓ భవిష్యత్తేనా! నీతి నియమాలనే నమ్ముకుని, వాటి కోసం తమ ప్రాణాలనే త్యాగం చేసిన ఎంతో మంది పురాణ పురుషులూ, ఆదర్శమూర్తులు, మహనీయులు ఉన్నారు, అటువంటి వారిని.. పిల్లలూ, నేటి యువతా ఆదర్శంగా తీసుకునేలా, వారిని అనుసరించేలా మనం చెయ్యగలిగితే కనీసం రేపటి తరానికైనా మహోన్నతమైన నాయకులు తయారయ్యి, ఈ సమాజానికి పట్టిన చీడను వదులుస్తారు. అందుకే ఈ రోజు నుంచే.. కాదు కాదు ఈ క్షణం నుంచే నేను పిల్లల మార్కులూ, ర్యాంకులూ వెంటపడడం మానేసి, వాళ్ళకి కష్టపడే తత్వం, క్రమ శిక్షణా అలవాటు చేసి, నా వంతు సమాజ సేవ నేనూ చేస్తాను, వాళ్ళకి బతుకు తెరువునీ, మంచి భవిష్యత్తునీ అవే చూపిస్తాయి!" అంటూ మోహన్ స్థిరంగా నిర్ణయించుకుని పిల్లలిద్దరినీ దగ్గరకి తీసుకున్నాడు.

# రంగులమయం

శ్రీమతి ఘంటసాల నాగమణిశ్రీ స్మారక కథల పోటీ
సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ
శ్రీ శుభకృత్ వత్సర ఉగాది - 2022


శానాపతి(ఏడిద) ప్రసన్నలక్ష్మి



✆ 9492339499


***ఓటుకి నోటు అనేది చట్టవిరుద్ధమైన పని కాబట్టే... తెలివినుపయోగించి, చట్టబద్ధమైన పనిగా ప్రజలకి ఎన్నో పథకాల పేర్లతో వారి బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు గుమ్మరిస్తూనే ఉంది. ఈ ఎలక్షన్ల సమయాన్ని ఎలా ఉపయోగించుకోవాలో బాగా పట్టు తెలిసిన ప్రభుత్వం కాబట్టే, అత్యధిక మెజారిటీతో మళ్లీ అధికారంలోకి రావడం ఖాయం!***

★★★

ఎన్నికల సమయం వచ్చింది...

చంటినాయుడు మెదడు ఒకటే దురదగా వుంది. తాను ఈసారి ఎమ్మెల్యే పదవి కోసం ఎన్నికల్లో పోటీ చేయాలని..! పదవుల కోసం పోటీపడ్డం తనకేమీ కొత్తకాదు. గత పదేళ్లుగా... తను నమ్ముకున్న పార్టీ కోసం పాట్లు పడుతూనే వున్నాడు. ఈసారి గనుక ఎలక్షన్లో నుంచుంటే, గెలుపు ఖాయమనే నమ్మకంతో.. ఉవ్విళ్లూరుతూనే ఉంది మనసంతా.

ఒకానొక మంచి సమయం చూసి.. భార్య మూడ్ లో వున్నప్పుడు, ఆమెకు చెప్పాలనుకున్నాడు.

ఆ సమయం తరుణించడంతో... "ఒసేయ్...రాజ్యం ఇటు రావే!" భార్యను ప్రేమగా పిలిచాడు చంటినాయుడు.

కూనిరాగాలు తీస్తూ, వంటగదిలో వంట చేస్తున్న రాజ్యం భర్త పిలుపుని ఖాతరు చేయలేదు.

"ఒసేయ్ రాజ్యం నిన్నే పిలిచేది. ఓసారి ఇటొచ్చి కూర్చోవచ్చు కదా!" ఈసారి అతని గొంతులో ప్రేమతో పాటూ అభ్యర్థన కూడా ధ్వనించడంతో ఆమెకు మనసు చలించింది. స్టవ్ ఆఫ్‌చేసి, చేతులు తుడుచుకుంటూ భర్త దగ్గరకు వచ్చింది.

"నాపని ఆపుచేయించి మరీ అంత ఇదిగా పిలుస్తున్నారు. ప్రొద్దుటే మీరు చెప్పే మాటలు వింటూ కూర్చోడానికి నాకేమీ పనులు లేవనుకుంటున్నారా ఏంటి! వంట పని పూర్తిచేసి, ఇంకా బోలెడు పనులు చక్కబెట్టుకోవాలి. అదేమిటో త్వరగా చెప్పండి!" ఆ పక్కనున్న కుర్చీలో కూలబడింది రాజ్యం.

"మరేంలేదే... ఈసారి జరగబోయే ఎలక్షన్లో ఎమ్మెల్యేగా పోటీ చేద్దామనిపిస్తుంది. దానికి నువ్వేమీ భయపడాల్సిన పనేమీ లేదు!"

భర్త చెప్పడం పూర్తికాకుండానే, దిగ్గున లేచింది రాజ్యం.

"ఒద్దండీ... ఈ రాజకీయాలు మనకు సరిపడవని మీకెన్నోమార్లు నెత్తీనోరూ కొట్టుకుని చెప్తూనే వున్నాను. మీకు ఇంత జరిగినా బుద్ధిరాలేదు. మీకు పాడీ పంటా ఉంది కదాని, పది ఎకరాల భూమిచ్చి నన్ను మీకు కట్టబెట్టారు మావాళ్ళు. మీ తల్లిదండ్రులు మీకిచ్చిన ఆస్తినంతా, ఆ పార్టీ వాళ్ళకే ఖర్చుపెట్టి ఆర్పేశారు. ఇన్నేళ్లలో ఎప్పుడూ కూడా చిన్న కార్పొరేటర్ పదవి కూడా మీకు రాలేదు. చింత చచ్చినా పులుపు చావలేదు మీకు. మా పుట్టింటోళ్లు నాకిచ్చిన భూమిని కూడా పార్టీకి ఖర్చుపెట్టేయాలనే కదా మీ ఉద్దేశ్యం. ఆ పప్పులేమీ ఉడకవు. అదైనా వుండనిస్తే... పెళ్లీడుకొచ్చిన కూతురుకి కొద్దిలో కొద్దయినా మంచి సంబంధం చూడగలం!" మీ ప్రయత్నం విరమించుకోండి అన్నట్టు... భర్తకు మరో మాట అవకాశమివ్వకుండా విసవిసా వంటగదిలోకి వెళ్ళిపోయింది రాజ్యం.

భార్యవేసిన చురకకి, తల పట్టుక్కూర్చున్నాడు చంటినాయుడు. తాను చెప్పదల్చుకున్నది చెప్పకుండానే క్లాసు పీకించుకున్నాడు.




ఎలాగైనా ఈరాత్రి పడగ్గదిలోనైనా... తాను ఎమ్మెల్యే అవ్వడానికి అవకాశం ఉందని భార్యకు అర్థమయ్యేలా చెప్పాలనుకుంటూ, అక్కడనుంచి లేచి వెళ్ళిపోయాడు.

అటుగా లేచి వెళ్లిపోతున్న భర్తను చూస్తే జాలేసింది రాజ్యానికి. భర్త మంచి పదవిలో కూర్చుంటే, తనకు మాత్రం గౌరవం కాదూ! ఆ హోదా, ఆ ఠీవి రావాలంటే పెట్టిపుట్టాలి. అలాగని ఉన్నది కాస్తా తరిగిపోతుంటే చూస్తూ ఎలా కూర్చోగలను! గట్టిగానే బుద్ధిచెప్పానని అనుకున్నా... ఆ క్షణమెందుకో భర్తపై జాలేసిందామెకు!

రాజకీయాల్లో పైకి రావాలని భర్తకున్న ఇష్టానికి.. ఎన్నో పూజలు చేసింది. నోములు నోచింది. పార్టీ తననీ గుర్తించి ఎప్పటికైనా సీట్ ఇవ్వకపోతుందా అనే విశ్వాసంతో... పార్టీకి భర్త చేస్తున్న సేవలు అంతా ఇంతా కావు. తమ ఆస్తినంతా ధారపోసి నాయకులకు ఒత్తాసు పలికినోళ్ళలో తన భర్త ఎందులోనూ తీసిపోడు. అనవసరంగా భర్తపై మాట జారాను. అసలు ఆయన ఉద్దేశ్యం ఏమిటో కూడా వినకుండా మధ్యలోనే అడ్డుపడ్డాను. ఏం చెప్పాలనుకున్నారో ఏమో? ఒకవేళ ఆయనది అదే గట్టి నిర్ణయం అయితే... సున్నితంగా త్రోసిపుచ్చాలి. మనసుని శాంతపర్చుకుంది రాజ్యం!

ఆ రాత్రి పడగ్గదిలోకి వెళ్ళాక ఉదయం భర్త కదిపిన విషయాన్ని మళ్లీ చెప్పమంటూ కదిపింది.

చంటినాయుడుకి తెల్సు... భార్య ఆవేశం ఎంతోసేపు ఉండదని, మళ్లీ తానే వచ్చి పలకరించి తనని చల్లబరుస్తుందని... ఆ ధైర్యంతోనే ఇన్నాళ్లు తన ఆటలు సాగాయి.

భార్యను చేయి పట్టుకుని కూర్చోబెడుతూ... "ఈసారి నే చెప్పేది పూర్తిగా విను. విన్నాక నువ్వే నాకు పూర్తిగా సపోర్ట్ చేస్తావు. మధ్యలో మాత్రం అడ్డుపడకు!" అంటూ చిలిపిగా వార్నింగ్ ఇచ్చాడు.

"అలాగే స్వామీ తప్పుతుందా." అంటూ భర్త పక్కన చోటు చేసుకుంటూ, వినడానికే సిద్ధపడింది.

"నేను చెప్పేది ఏమిటంటే... నేనీసారి ఎలక్షన్లో నుంచున్నా, ఒక్కపైసా కూడా ఖర్చుపెట్టాల్సిన అవసరముండదు!"

భర్త మాటలు పెద్ద విడ్డూరంగానే అనిపించింది. 'చాల్లెండి చెప్పొచ్చారు' అని అందామనుకుంటూనే... అడ్డు తగలొద్దని ముందుగానే భర్త చెప్పడంతో, 'అదెలా' అన్నట్టు ముఖకవళికలోనే క్వశ్చన్ మార్కు చూపించేసింది

"ఇలా ఊహించి ఎందుకు చెప్తున్నానంటే... నాకు బుర్రలేక కాదు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం ప్రజలకి బిస్కెట్లు వేస్తూనే ఉంది కదా. ఓటుకి నోటు అనేది చట్టవిరుద్ధమైన పని కాబట్టే... తెలివినుపయోగించి, చట్టబద్ధమైన పనిగా ప్రజలకి ఎన్నో పథకాల పేర్లతో వారి బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు గుమ్మరిస్తూనే ఉంది. ఈ ఎలక్షన్ల సమయాన్ని ఎలా ఉపయోగించుకోవాలో బాగా పట్టు తెలిసిన ప్రభుత్వం కాబట్టే, అత్యధిక మెజారిటీతో మళ్లీ అధికారంలోకి రావడం ఖాయం! అందుకే ఈసారి ఈ పార్టీ నుంచి పదవి కోసం టిక్కెట్టు సంపాదించానంటే... పైసా కూడా ఖర్చు పెట్టకపోయినా, వంద శాతం గెలిచే ఛాన్స్ ఉంది!"

భార్యకు విడమర్చి చెప్పేసరికి, ఆమె ముఖం కూడా విప్పారింది.

భర్త భుజంపై తలపెడుతూ "మీరు చెప్పింది విన్నాక, ఎందుకో మనకీ మంచిరోజులు వస్తాయనిపిస్తుంది. ఈసారి తప్పకుండా మీ ప్రయత్నం నెరవేరుతుందండీ!" అంటూ భర్తకు భరోసా ఇచ్చింది రాజ్యం.

★★★

హైద్రాబాద్ వెళ్ళాడు చంటినాయుడు.. ముందుగానే పార్టీ ప్రెసిడెంటుని కలిసి, ఎమ్మెల్యే టిక్కెట్టు తనకి ఇవ్వవలసిందిగా కోరడానికి! విజిటర్స్ రూమ్‌లో కూర్చుని వెయిట్ చేస్తున్న అతన్ని లోపల నుంచే చూసింది ప్రెసిడెంటుగారి భార్య అంజనీదేవి.

ఆమె కొంచెం కలుపుగోలు మనిషి! రాజకీయతత్వం తెలిసిన మనిషి కావడంతో... భర్త ఇంట్లోలేరనే విషయం చెప్పడానికై.. "ఓహ్..మీరా చంటినాయుడు గారు, లోపలికి రండి!" అంటూ విశాలంగా ఉన్న పెద్ద హాల్లోకి రమ్మని పిలిచి కూర్చోమంది.

"ప్రెసిడెంటు గారు లేరామ్మా?" వచ్చిన పని గురించి విన్నవించుకోవాలనే ఆత్రుతతో అడిగాడు.

"ఆయన పనిమీద ఢిల్లీ వెళ్లారు. రేపు సాయంత్రానికి గానీ రారు. వచ్చిన పని చెబితే ఆయన వచ్చాక చెప్తాను!" అంటూ, సర్వెంట్ కి కాఫీ తెమ్మంటూ ఆర్డర్ వేసింది.

అతని రాకకి కారణం ముందుగానే పసిగట్టి... విషయం రాబట్టాలనే అంజనీ దేవి ఏమీ ఎరగనట్టుగా అడిగింది.

చంటినాయుడుకి తెలుసు... ఆవిడ అండ దండలతోనే ఆవిడ భర్త రాజకీయాల్లో ఎదిగాడని, ఆవిడతో వచ్చిన విషయం చెబుదామా వద్దా అనుకుంటూనే... చెప్పడానికే సంసిద్ధుడయ్యాడు.

"మరేం లేదు అంజనీ గారు.. ఇప్పటివరకూ, రెండు మూడు సార్లు పదవి కోసం పోటీచేసి ఓడిపోయిన మాట మీకూ తెలుసు. ఈసారైనా నా అదృష్టం పరీక్షించుకోవాలని.. ప్రెసిడెంటుగారిని పార్టీ టిక్కెట్టు నాకే ఇప్పించమని అడుగుదామని వచ్చాను!" ఇందులో నసుగుడు ఎందుకని, వచ్చిన విషయం టూకీగా చెప్పేసాడు.

అతను చెప్పింది విన్నాక... "మీరు భలే తెలివైన వారు చంటినాయుడు గారు. ఈసారి కూడా అధికారంలో ఉన్న పార్టీయే తప్పకుండా గెలుస్తుందనేగా మీ నమ్మకం. మీలాగే ఇలాంటి నమ్మకంతో వచ్చినవాళ్ళు చాలా మందే వున్నారు. అందరికీ మేము చెప్పే మాట ఒక్కటే నాయుడు గారు! ఈ ఎమ్మెల్యే పదవికి పోటీ పడ్డానికి టిక్కెట్టు కోసం వచ్చిన వారిలో మీరు పదోవారు. వాళ్లందరికీ ప్రెసిడెంటు గారు చెప్పిన మాటే మీకూ చెప్తున్నా... ఈ టిక్కెట్టు మీకీయాలంటే... నేను చెప్పేదంతా శ్రద్ధగా వినండి. పదవికోసం ఖర్చు పెట్టాల్సిన పనేమీ మీకుండదు. ప్రభుత్వమే రైతుల కోసం అన్నదాతకు ఆసరా అని, పెళ్లికాని పిల్లల కోసం మంగళసూత్రమని, వృద్ధుల కోసం ఆపద్బాంధవుడని, నిరుద్యోగుల కోసం ప్రతిభకు పురస్కారం అనీ, ఇలా ఎన్నో స్కీముల పేరుతో... ప్రజలందరినీ తనవైపుకి ఆకట్టుకుంది. కాబట్టి ఈసారి కూడా అధికారపార్టీయే గెలుస్తుందనే నమ్మకం అందరిలోనూ పాతుకుపోయింది. ఈ ఎన్నికల్లో ఎవరు నుంచున్నా, వారికి విజయం వరించడమన్నది ఖాయం. ఓట్లకు నోట్లు ఖర్చుపెట్టాల్సిన పైకమంతా మీకు మిగులే. టిక్కెట్టు మీరు గనుక చేతబుచ్చుకుంటే, మీరు ఎమ్మెల్యే అవ్వాలనుకున్న కల కూడా నెరవేరుతుంది." అంటూ చెవిలో ఓ మంత్రం వేసినట్టుగా ఏదో చెప్పి... "మేమూ మనుషులమే కదా! మీకూ ఆశలున్నట్టే మాకూ ఉంటాయి." అంది కళ్లకున్న కళ్ళజోడుని సవరించుకుంటూ!

చంటినాయుడు ఆమె చెప్పిన లెక్క విన్నాక గతుక్కుమన్నాడు. "మరొక్కసారి ఆలోచించండి. ఈ పార్టీ కోసం పదేళ్లుగా ఎంత

సేవ చేసానో... ప్రెసిడెంటు గారికి తెలుసు. ఆయనతో మరోసారి వచ్చి మాట్లాడి చూస్తాను!" ప్రాధేయపూర్వకంగా అన్నాడు అంజనీ దేవితో.

ఆమె పకపకా నవ్వింది. "మీలాగే ఈయన కూడా పార్టీని పట్టుకునే వ్రేలాడుతూ... పార్టీ కార్యకర్తగానే మిగిలిపోతున్నారు గానీ, ఇప్పటివరకు ప్రభుత్వంలో ఎలాంటి మినిస్టర్ పదవీ రాలేదు. మాకున్నదంతా పార్టీ కోసమే ఈయన కూడా ఊడ్చి పెట్టేసారు. ఒకవేళ పార్టీ గెలిచినా, ఓడినా మా జాగ్రత్తలో మేము ఉండాలంటే... అవకాశం దొరికినప్పుడే మేమూ ఉపయోగించుకోవాలి. మాకూ పిల్లలున్నారు. పెద్దవాళ్లవుతున్నారు. పిల్లల్ని ఓ దారికి తెచ్చుకోవాలంటే, మాకు ఇదే సదవకాశం మరి. కనుక మీరు మళ్లీ మళ్లీ తిరిగినా, అది శ్రమే అవుతుంది గానీ ఫలితం ఉండదు నాయుడు గారూ! నేను చెప్పిందే మావారికి వేదం. కాబట్టి నేను చెప్పిన విషయాన్ని బాగా ఆలోచించుకుని.. ఏ విషయమూ ఫోన్ చేసి చెప్పినా సరిపోతుంది. మీకు ఒప్పందం అయితేనే మీ పని అవుతుంది!" అంటూ చిన్న హెచ్చరికతో కూడిన అభయం చంటినాయుడికిచ్చి సాగనంపింది అంజనీ దేవి.

గంపెడాశతో వెళ్లిన భర్త, మొఖం వ్రేలాడేసుకుని రావడం చూసి, చేతిలోని బాగ్‌ని అందుకుని గబగబా లోపలకెళ్లి, గ్లాసుడు మంచినీళ్లు తెచ్చి అందించింది రాజ్యం. కాస్సేపు చూసి, ఇక వుండబట్టలేక భర్తని అడిగింది ... 'వెళ్లిన పని ఏమైందని?'

అక్కడ పార్టీ ప్రెసిడెంటు గారి భార్యకీ, తనకూ అయిన సంభాషణంతా పూస గుచ్చినట్టు చెప్పాడు.

"అయితే ఈ ఎన్నికల్లో ఓట్లకు నోట్లు ఖర్చు చేయాల్సిన పని ఏమీ వుండదనుకుని సంబరపడ్డాం. కానీ మరో రూపంగా వాళ్ళకి సమర్పించమనడం న్యాయమంటారా? అదీ... పదవి కోసం మనం ఖర్చుపెట్టాల్సివచ్చే డబ్బు కంటే ఎక్కువగా ఇంకో కోటి రూపాయలు అదనంగా వారికి ఇచ్చుకుంటేనే, ఈ టిక్కెట్టు మీకు ఇస్తాననడం ఏమీ బాగోలేదు!" అంజనీదేవిపై తనకొచ్చిన దురభిప్రాయాన్ని వెళ్లగక్కింది రాజ్యం.

భార్య వైపు తప్పుచేసిన వాడిలా క్షమించమన్నట్టు చూసాడు. ఇప్పటికే చాలా ఆలస్యంగా తేరుకున్నందుకు సిగ్గుతో కూరుకుపోయినా.. రాజకీయాల్లో వుండే స్వార్థం, మోసం, పార్టీ టిక్కెట్టుని కూడా బ్లాకులో అమ్ముకోవడం అన్నీ బాగా తెలిసొచ్చాయి. ఒకప్పుడు రాజకీయనాయకులు తెల్లటి దుస్తులు వాడేవారు. అది స్వచ్ఛతకు సూచన. కానీ ఇప్పుడు ఒక్కొక్క పార్టీ ఒకొక్క రంగు దుస్తులు వాడుతూ, రాజకీయమే రంగులమయంగా అయిపోవడంతో, ఇప్పుడైనా మిగిలిన కాస్త ఆస్తినీ.. ఈ రాజకీయ జిత్తులమారి నక్కలనుంచి నుంచి కాపాడుకోవాలి అన్నట్టు ఒక స్థిరమైన నిశ్చయానికొచ్చాడు చంటినాయుడు!!

యం. విజయ కుమార్

శ్రీమతి సోమూరి నాగమణిశ్రీ స్మారక కథల పోటీ
సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ
శ్రీ శుభకృత్ సంవత్సర ఉగాది - 2022

**నిస్సహాయురాలనై, దిక్కు తోచని స్థితిలో ఈ దిక్కునే వెతుక్కుంటూ వచ్చాను. ఊహించని ఒంటరితనంతో శూన్యమయిపోయిన బ్రతుకుతో బ్రతకడం ఇష్టంలేక, పిరికిదానిలా చనిపోవాలని అనుకున్నప్పుడు ఎక్కడో ఒకచోట చావాల్సిందే కదా... అదేదో మీ ఊళ్ళోనే చనిపోదామనుకొని నిర్ణయించుకొని ఇక్కడకు వచ్చాను.**

★★★

అప్పటివరకు భయం భయంగా, ఆందోళనగా చూస్తున్న ఊరి జనం ఆ మహిళ మృతదేహం తమ ఊరి వారిది కాకపోవడంతో ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయం బయట పంచలో ఓ మహిళ మృతదేహం ఉన్నదన్న వార్త గుప్పుమనడంతో అక్కడ గుమిగూడారు.

ఆ ఊరి పేరు వీరాపురం. ముఠా కక్షలకి, గొడవలకి పెట్టింది పేరు. పంతాలకి, పట్టింపులకి పెద్ద పీట వేస్తారు ఊరివారు. పాలక, ప్రతిపక్ష జెండాలను మోస్తూ రెండు వర్గాలుగా చీలి, చీటికీ మాటికీ గొడవలకి దిగుతూనే వుంటారు. మగవారు సంవత్సరంలో సగం రోజులు ఇళ్ళల్లో వుంటే మిగిలిన సగం రోజులు గాయాలతో ఆసుపత్రిలోనో, పోలీసుల భయంతో తెలిసిన వాళ్ళ ఇళ్ళలోనో, కేసులతో పోలీస్ స్టేషన్‌ల చుట్టూ తిరుగుతూ ఉంటారు. ఆడవారు ఎప్పుడు ఏమి జరుగుతుందో అన్న భయంతో బిక్కు బిక్కుమంటూ గడిపేస్తూ వుంటారు. చదివే పిల్లలు కూడా బడిలో ఈ వర్గ వైషమ్యాలకి ప్రతీకలుగానే ఉంటూ ఉంటారు.

ఊరివారికి సంబంధించిన మృతదేహం అయితే అది ఏ అనుమానాలకి, అపార్థాలకి, ముఠా గొడవలకి దారి తీస్తుందో అని భయపడుతున్న జనం, ఆ మహిళ మృతదేహం తమ ఊరికి సంబంధించినది కాక పోవడంతో తేలికపడ్డారు.

ఉదయాన్నే కార్యాలయం ఊడ్చి శుభ్రం చేయడానికి వచ్చిన పనిమనిషి కార్యాలయం బయట వరండాలో మృతదేహాన్ని గమనించింది. కార్యాలయానికి కాంపౌండ్‌వాల్ లేదు. ఎవరో పడుకొని వుంటారని మామూలుగా పిలిచి చూసి, లాభం లేకపోవడంతో అనుమానం వచ్చి గ్రామ కార్యదర్శికి తెలియజేసింది. కార్యదర్శి వచ్చి పరిశీలించి, ప్రాణం లేదని నిర్ధారించుకున్నాక, పోలీస్ వారికి కబురు చేస్తే, వారు హుటాహుటిన బయలుదేరి వచ్చారు.

మహిళకు సుమారు ఓ యాభై అయిదు సంవత్సరాలపైన ఉండవచ్చు. నీలంరంగు చీర, మాచింగ్ జాకెట్ ధరించి ఉన్నది. మెడలో ఓ సన్నగొలుసు వుంది. చూపులకి బిచ్చగత్తెలా లేదు. ఓ సాధారణ కుటుంబ స్త్రీలాగా వుంది. జనంలో గుసగుసలు బయలుదేరాయి. ఎవరీ మహిళ? ఇక్కడెందుకు వచ్చింది? ఎవరన్నా చంపి పడేశారా? అనారోగ్య సమస్యా.. రకరకాల అనుమానాలు, ఊహాగానాలు బయలుదేరాయి. పోలీసులకి అవే అనుమానాలు కలిగాయి. ఆనవాలు, ఆచూకీల కోసం పరిశీలించగా తలక్రింద ఓ కవరు కనిపించింది. తీసి చూస్తే కవరు మీద "దయచేసి ఈ కవరులో రాసి ఉంచిన విషయాలు గుమిగూడిన ఊరి జనానికి చదివి వినిపించగలరు!" అని వుంది. ఆశ్చర్యపోయిన కానిస్టేబుల్, సబ్ఇన్‌స్పెక్టర్ గారికి కవరు అందించాడు. కవరులో ఉన్న కాగితాలు వేగంగా చదివిన ఆయన పైకి చదివి వినిపించమంటూ గ్రామ కార్యదర్శికి అందించాడు. ఉత్సుకతతో కార్యదర్శి చదవడం ప్రారంభించాడు .

★★★



"వీరాపురం గ్రామ ప్రజలకు నమస్కారములు. ఆశ్చర్యపోకండి, నేను మీకు తెలియక పోయినా, మీరు వ్యక్తిగతంగా నాకు తెలియక పోయినా, మీ గ్రామానికీ నాకు సంబంధం వుంది. మీ గ్రామం చెరిపేసిన బ్రతుకు నాది. మీ రాజకీయ పార్టీల అభిమానపు కుమ్ములాటలో చితికి పోయిన బ్రతుకు నాది. నిస్సహాయురాలనై, దిక్కుతోచని స్థితిలో ఈ దిక్కునే వెతుక్కుంటూ వచ్చాను. ఊహించని ఒంటరితనంతో శూన్యమయిపోయిన బ్రతుకుతో బ్రతకడం ఇష్టంలేక, పిరికిదానిలా చనిపోవాలని అనుకునప్పుడు ఎక్కడో ఒకచోట చావాల్సిందే కదా... అదేదో మీ ఊళ్ళోనే చనిపోదామనుకొని నిర్ణయించుకొని ఇక్కడకు వచ్చాను.

పనిలో పనిగా మీకు చిన్న కానుకలు కూడా తెచ్చాను. చావు కానుకలు అనుకోకుండా దయచేసి తీసుకోండి.

నాది హత్యకాదు. ఓ పిరికి ఆత్మహత్య. పిల్లల వివరాలు ఉన్నాయి. వాళ్ళు వస్తే శవాన్ని ఇవ్వండి. లేదంటే భగవదేచ్ఛ.

వివరాలలోకి రాబోయే ముందు నాకొక చిరు సందేహం. ఆవేశం తప్ప ఆలోచన ఎందుకుండదు మీకు. మీ ఊరి పెద్దలు గానీ, వర్గ నాయకులు గానీ.. అర్థంలేని ఆవేశాలతో సాధించేదేముందని ఏ నాడయినా ఆలోచించారా? అమాయకులు బలవడం తప్ప జరుగుతున్నదేమీ లేదని ఎందుకు అర్థం కావడం లేదు. రాజకీయ పార్టీలని భుజాన వేసుకొని నడుస్తున్న మీకు అవి వొరగబెట్టేదేమిటో ఒక్క నిమిషమయినా ఆలోచించారా?

ఒకే జెండా కింద గాయపడుతున్న దేహాలు ఏమాత్రం మారడం లేదు. అవి మీవే. సానుభూతి ఒలకబోస్తూ, పరామర్శించే నోళ్ళు మాత్రం మారుతూనే ఉన్నాయి. ఊసరవెల్లిలా రంగులు మారుస్తూ, అవసరానికి జెండా మారుస్తున్నా చోద్యం చూస్తూ కూర్చుంటారు. కనీసం వీసమెత్తు ప్రశ్న కూడా ప్రశ్నించలేరు. భుజాలు నెప్పుడుతున్నా, కుటుంబాలు గుల్లవుతున్నా గుడ్డిగా జెండాని మోస్తూనే వుంటారు. ఎందుకొచ్చిన పార్టీలు, గొడవలు అని అనుకోరు. వాడి నెవడినో అధికార పల్లకిలో ఊరేగించడానికి మీరు పాడెమీద ఊరేగటానికి కూడా సిద్ధం. ఎంత చిత్రం!

మీ కోపం కర్రలై, కత్తులై లేచి పగవాడి రక్తాన్ని చవి చూసినప్పుడు పోలీసు పికెట్ ఊరి మధ్యలో వెలుస్తుంది. ఇళ్ళు వదిలి మీరు పారిపోతే ఆడవారు, పిల్లలు బిక్కుబిక్కు మంటూ బ్రతకవలసిందే! ఇంట్లో ఆడవాళ్ళకి ఎంత కష్టమో ఆలోచించారా? మూర్ఖత్వంతో మూసుకుపోయిన కళ్ళకి ఇవేవీ కనబడవు. ఆలోచన కలగదు. ఆటపాటలతో కలసి మెలసి చదువుకోవలసిన పిల్లలు కూడా మీ మూర్ఖత్వానికి ప్రతీకలుగానే ఉంటున్నారు. ఇవన్నీ నాకెలా తెలుసనుకుంటున్నారా? ఇది ప్రతి ఊళ్ళోను ఉండేదే, కాకపోతే మీకు మూర్ఖత్వం పాలు ఎక్కువ!"

కార్యదర్శి చదవడం కొనసాగిస్తున్నాడు. నిశ్శబ్దంగా వింటున్నారు అందురు. మనసులో భావాలు ముఖంలో కనబడడం లేదు ఎవరికీ!

"ఇక నా విషయానికి వస్తే నాపేరు జానకమ్మ మా వారి పేరు రామారావు. మా ఊరు సీతానగరం. ఆ ఊరి ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులుగా పనిచేస్తారు మా వారు. గత పంచాయతీ ఎన్నికల సమయంలో మీ ఊరిలోని ఒక పోలింగ్ బూత్‌కి ఎన్నికల అధికారిగా బాధ్యతల నిర్వహణకు వచ్చారు. ఎన్నికలు అంటేనే పదవికోసం జరిగే ఓ ప్రహసనం. పేరుకే పార్టీ

రహితం. అడుగడునా పార్టీల జోక్యమే . ఎవరి పార్టీ బలాన్ని వారు పరోక్షంగా చూపే ప్రక్రియ కొనసాగుతూనే వుంటుంది. ఎన్నికలంటే ధనబలం, కులబలం, వర్గబలం చాటుకునే ప్రదర్శనా వేదికగా మారిన ఈ తరుణంలో, ప్రతిచోటా విధి నిర్వహణ కత్తిమీద సామే. ప్రతిచోటా టెక్నాలజీ వాడాలనే ప్రభుత్వాలు ఈ ఒక్కచోట టెక్నాలజీ ఎందుకు వాడాలనరో వాళ్ళకే తెలియాలి. తప్పు... తప్పు .. ఎందుకు వాడరో వాళ్ళతో సహా అందరికీ తెలుసు. ఇంట్లో కూర్చునే అన్ని పనులు చక్కబెట్టుకుంటున్న ఈ రోజుల్లో ఓటుకి మాత్రం పాత కాలపు పద్ధతులే. లోగుట్టు ప్రజాస్వామ్యాని కెరుక! ఎవడి మీద కోపాన్నో, అసహనాన్నో ఎన్నికల సిబ్బంది మీద చూపే రోజులలో, మీలాంటి ఊర్లో ఎన్నికల విధి అంటే పిల్లికి చెలగాటం ఎలుకకి ప్రాణ సంకటం లాంటిది. నిబంధనలన్నీ కాగితాలలో బలంగానే ఉంటాయి. ఆచరణలోనే దూది పింజలవుతాయి!

ప్రజాస్వామ్యంలో ఓటు అంగడి వస్తువు అయినాక, బూత్‌లో ఓటు వినియోగం ఏజెంట్ల నియంత్రణలోకి వెళ్ళిపోయింది. ఆ నియంత్రణకి కొద్దిపాటి ఆటంకం ఏర్పడినా ఓర్చుకోలేనితనంతో ఎగబడటం. గెలుపే పరమావధి అయినప్పుడు సర్వశక్తులు వొడ్డి కుట్రలు, కుతంత్రాలతో ఎవరినో వొకరిని బలి పశువు చేయడం. మావారి విషయంలో అదే జరిగింది. మీ పార్టీల బలాబలాలు, గెలుపోటముల బేరీజుల క్రమంలో మా వారిని బలిపశువు చేసారు. ఏదో విధంగా గొడవ పడాలనుకున్న మీరు ఏదో చిన్న విషయాన్ని సాకుగా చూపి గొడవకు దిగారు. చిలికి చిలికి గాలివాన చేసారు. కావాలనో, పొరపాటుగానో ఈయనమీద కూడా చేయి చేసుకోవడం జరిగింది. అంతటితో ఆగక విషయం కోర్టుదాకా తీసుకు వెళ్ళారు. మీ పట్టుదలల పోరాటంలో ఈయన కోర్టుకి రావలసి వచ్చింది .

ముందుగానే ఉన్న షుగర్, బీపీకి మానసిక ఆందోళన తోడయ్యింది. కోర్టుకేసు హనుమంతుడి తోకలాగా సాగుతున్నకొలది, వాయిదాలకి తిరిగే క్రమంలో ఈయన ఆరోగ్యం క్షీణించసాగింది. ఎడతెగని ఆలోచనలు గుండెపోటుకి దారితీస్తే, పచ్చని సంసారం ఒక్కసారిగా బుగ్గిపాలయింది.

అసలు మనిషి వెళ్ళిపోయాక పిల్లల అసలు నైజం బయట కొచ్చింది. మాలోనూ మంచితనం, అప్యాయతలు, అనుబంధాలు పై పై నాటకాలే! డబ్బుముందు ఎవరయినా వొకటే అని నిరూపించారు. కూతురు, అల్లుడు, కొడుకు కోడలు అందరూ ఒక అవగాహనకి వచ్చి, ప్రభుత్వ బెనిఫిట్స్ వంతుల వారీగా పంచుకొని, తల్లికి అన్యాయం చేసి ఒంటరిని చేసారు. ఒంటరితనంతో సహవాసం కష్టంగా అనిపించినప్పుడు కన్నీళ్ళే ఊరటనిచ్చేవి. ఓ చిన్నగదిలో పిల్లలు విదిల్చే సొమ్ముతో రోజులు వెళ్ళదీసే క్రమంలో ఏదో తెలియని బాధ. దీనికంతటికీ కారణం ఆయన పిరికితనమో, మీ మూర్ఖత్వమో అర్ధంగాక నిద్రపట్టని రాత్రులు ఎన్ని గడిపానో! తెలియని విసుగుతో, దిగులుతో బ్రతుకు భారంగా మారినప్పుడు ఆత్మహత్య నేరమని తెలిసినా ఈ నిర్ణయం తీసుకున్నాను!

మీరేదో అన్నీ మానేసి మంచివారిగా, మనుషులుగా మారిపోతారన్న ఆశతో ఇదంతా రాయలేదు, నా మనసులోని భారం దింపుకోవడానికి రాసాను. నా చావుకి సాకు వెతుక్కున్నానని మీరు అనుకున్నా పర్లేదు. కట్టెగా మిగిలే నాకు మీరు ఏమనుకున్నా ఏమీ తెలియదు కదా!

ఎవరెట్లా పోయినా పంతాలు, పట్టింపులు, పార్టీలు, పగలు ఎక్కువనుకునే మీకు నాకు చాతనయినంతలో కానుకలు తెచ్చాను. నాదగ్గర ఉన్న మూటలో ఉన్నాయి. దయచేసి స్వీకరించండి. దానితో పాటు కొంత సొమ్ము కూడా వుంది. మీ పిల్లలకు అవి కూడా కొనిపెట్టండి!

ఓ విధి వంచిత."

చదవడం పూర్తి చేసిన కార్యదర్శి మనసులో ఏదో తెలియని బాధ. అదే బాధ పోలీస్ వారి మదిలో కూడా! నిశ్శబ్దం రాజ్యమేలుతోంది. కానిస్టేబుల్ మూట విప్పాడు. చూసిన వారంతా నిశ్చేష్టులయ్యారు. మూటలో కొన్ని కత్తులు, చిన్న చిన్న గొడ్డళ్ళు ఉన్నాయి. వాటితో పాటు ఐదువందల రూపాయల కట్ట ఒకటి వుంది.

"ముఠా నాయకులారా ప్రస్తుతం మీరు తీసుకోండి. మీ పిల్లలకు సంబరంగా కొనిపెట్టండి. ఆ పిచ్చిదాని చావు కానుకలు స్వీకరించండి!" అంటూ శవాన్ని తరలించసాగాడు సబ్ ఇన్స్పెక్టర్. తెలియని గంభీరత్వం నిండిపోయింది ఆ వాతావరణంలో!

కానుక స్వీకరిస్తారో, త్యజిస్తారో కాలమే నిర్ణయించాలి!!

# ఇది సమంజసమేనా..!

శ్రీమతి పోడూరి నాగమణిశ్రీ స్మారక కథల పోటీ
సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ
శ్రీ శుభకృత్ వత్సర ఉగాది - 2022

ఉమాబాల చుండూరు



✆ 9989687397

***"అరుంధతీ... నీకు పిల్లలతో ఉండటం ఆనందం అని తెలుసు. కానీ నువ్వు అలా సరైన విశ్రాంతి లేకుండా ఉంటే నీ ఆరోగ్యం దెబ్బ తింటోంది. అసలు స్వేచ్ఛ కి మొహం వాచిపోయినట్టు అనిపించింది. నాలుగు గోడల మధ్య ఉండలేకపోయాను. మన ఊరిగాలి, ప్రశాంతత, ఆ మనుషులు కావాలనిపించింది. మనింటికి వెళ్తే నీ ఆరోగ్యం మెరుగవుతుందనిపించింది. మనం లేకపోతే... ముఖ్యంగా నువ్వు లేకపోతే వాళ్ళకి ఇబ్బందే కాదనను. కానీ ఎంతకాలం చెప్పు?"***

★★★

ఉదయం పది గంటలు అవుతూ ఉంటే... టిఫిన్ తినడానికి భర్తని పిలిచారు అరుంధతిగారు. ఆయన వచ్చి కూర్చుంటూ భార్యని చూసారు... చేత్తో నడుం మీద రాసుకుంటూ కూర్చోబోతోంది ఆవిడ. మొహం చాలా అలసటగా ఉంది!

ఇద్దరూ మౌనంగా టిఫిన్ తిన్నారు.

"కాఫీ ఇవ్వనా" అని అడిగారు అరుంధతిగారు.

"వద్దులే" అంటూ ఆయన లేచి వెళ్ళి, సోఫాలో కూర్చుని పేపర్ తీశారు చదువుదామని. ఆయన అలా అనుకున్నారే గానీ, చదవలేకపోయారు. ఆలోచనలో పడ్డారు.

అసలు వాళ్ళిద్దరూ రాజమండ్రి దగ్గర పల్లెటూరులో ఉండేవారు. పిల్లలిద్దరూ... ఒకళ్ళు హైదరాబాద్ లో ఉంటే, ఇంకొకళ్ళు బెంగుళూరులో ఉన్నారు. వీళ్లిద్దరూ సొంత ఇంట్లో మొక్కా మొలకా చూసుకుంటూ .. ఏదో టైంకి ఇంత తిని విశ్రాంతిగా ఉండేవారు. పిలిస్తే పని చేసి పెట్టే వాళ్ళు అందుబాటులో ఉండేవారు. ఆవిడ పెరట్లో పూలు కోసుకుని తీరికగా పూజ చేసుకునేవారు. ఒక అమ్మాయి వచ్చి కూరలు తరిగిపెట్టి వెళ్ళేది. ఈవిడ సింపుల్‌గా ఏదో వంట చేసుకోవడం, గుడికి వెళ్లడం, విశ్రాంతి తీసుకోవడం చేసేవారు.

విశ్వనాధం గారైతే పొద్దున్న ఒక గంట పొలం గట్లమ్మట వాకింగ్ చేసేవారు. సాయంత్రం స్నేహితులతో పిచ్చాపాటి ఉండేది.

అలా.. వాళ్ళకి వేరే సమస్యలు అంటూ లేకుండా బాగానే ఉండేవారు.

అయితే అబ్బాయి వాళ్ళు ఒకటే గొడవ పెట్టారు.. 'తమ దగ్గరికి వచ్చేయమని...అక్కడ ఉండొద్దని'.

కూతురు కూడా "కొన్ని రోజులు అన్నయ్య దగ్గిర ఉండకూడదా మీరు.." అనడం మొదలు పెట్టింది.

వాళ్ళు తమ తల్లిదండ్రులు ఇద్దరే ఉన్నారే అన్న ఆందోళనతో ఉండేవారు.

అరుంధతి గారు కూడా "పోనీ వెళ్లి వద్దామండి" అని అన్నారు...

విశ్వనాధం గారికి ఇష్టం లేకపోయినా.. అందరూ అలా చెప్తుండేసరికి ఒప్పుకోక తప్పలేదు.

ఇల్లు, మొక్కలు చూసుకోమని వాళ్ళకి బాగా నమ్మకస్థుడైన పనివాడు వెంకటాద్రికి చెప్పి, కొడుకు దగ్గరికి వచ్చారు.

కొడుకు కోడలు ఇద్దరూ ఉద్యోగస్తులు. కోడలు మంచిదే! నెమ్మదస్తురాలు, చదువు సంస్కారం ఉన్నదే!

మనవలు ఇద్దరూ ఒకళ్ళు నాలుగో క్లాసు, ఒకళ్ళు రెండో క్లాసు చదువుతున్నారు.

మూడు బెడ్‌రూమ్‌ల ఫ్లాట్ వాళ్ళది. అన్ని సౌకర్యాలతో ఉంటుంది. వీళ్ళకి ఒక రూము ఇచ్చారు.

కోడలు పొద్దున్నే లేచి పనులు చేసుకుంటుంటే, చూడలేక ఈవిడ కూడా వంటింట్లోకి వెళ్లి సహాయం చేసేవారు.



"నువ్వు పిల్లల్ని చూసుకో నేను వంట చూసుకుంటానులే!" అన్నారు.

దానివలన కోడలు సుచరితకి చాలా రిలీఫ్ గా ఉండేది. దానికి తోడు రుచికరంగా వంట చేయడంలో సిద్ధహస్తులైన అరుంధతిగారి వంటలు అందరికీ నచ్చేసాయి. అందరికీ బాక్స్‌ల్లో సర్దడమే సుచరిత పనిగా ఉండేది..

సాయంత్రం కోడలు వచ్చేటప్పటికి ఏడు అవుతూ ఉండేది. ఈవిడ ఖాళీగానే ఉన్నాను కదా అని కోడలు వచ్చే టైం కి వంట చేసి పెట్టేసేవారు. ఇంటికొచ్చేటప్పటికి అన్నీ అమరి ఉండేసరికి సుచరిత ప్రాణానికి హాయిగా ఉండేది.

"అయ్యో అత్తయ్యా... మీరే అన్నీ చేస్తున్నారు!" అని అంటూ ఉండేది.

కానీ కొడుకూ కోడలు...పిల్లలూ.. "బాగుంది కదా...బాగుంది కదా" అని తింటూ ఉంటే, అరుంధతిగారికి సంతోషంతో కడుపు నిండిపోయేది.

నెమ్మదిగా వంటిల్లు అరుంధతిగారి సామ్రాజ్యం అయిపోయింది. పొద్దున్నే అయిదున్నరకే లేచి, అన్నీ చేసి ఎనిమిది గంటలకల్లా టేబుల్ మీద పెట్టేవారు ఆవిడ. అరుంధతి నెమ్మదిగా లేచి, తన పనులు, పిల్లల పనులు చూసుకుని. రెడీ అయ్యి టేబుల్ మీద పెట్టిన గిన్నెల మీద మూతలు తీసి చూసి.. "వావ్ ... అత్తయ్యగారూ మీరు ఆసమ్... మా ఫ్రెండ్స్ కూడా మీ వంటలు రుచి చూసి 'అద్భుతం..నువ్వు అదృష్టవంతురాలివి సుచీ' అంటున్నారు" అనేది.

కొడుక్కి కూడా హాయిగా ఉండేది. తండ్రి కూరలు అవీ దగ్గరలోని బజారుకి వెళ్లి తెచ్చేవాడు. ఒక పెద్ద పనే తప్పింది కొడుక్కి.

మనవలకైతే, స్కూల్ నుండి రాగానే ఇంటికి తాళం లేకుండా తాతా నానమ్మ ఉండటం, ఆవిడ వాళ్లకి పెట్టే చిరుతిండి తిని ఆడుకోడానికి వెళ్లడం... మొత్తానికి వాళ్ళ రాక ఇంట్లో అందరికీ ఆహ్లాదంగా ఉంది!

అయితే మొదట్లో ఉన్నంత హుషారు, అరుంధతిగారికి ఆరు నెలలయ్యేసరికి లేదు. విశ్రాంతిగా ఉండే ఆవిడకి ఒక్కసారి ఈ పని వలన నడుం నొప్పి మొదలయ్యింది.

బయటికి వెళ్లడం అలవాటైన విశ్వనాథంగారికి కూడా ఇంట్లో ఉండటం జైల్లాగే ఉంది. పలకరించి, పిచ్చాపాటి మాట్లాడే తన వయసు వాళ్ళు ఎవ్వరూ చుట్టుపక్కల లేరు.

మాట వరసకి తాము ఊరెళ్తామన్నా ఇంట్లో ఎవ్వరూ ఒప్పుకోవడం లేదు. అక్కడా ఇద్దరే ఉండటం కదా...

వెళ్ళొద్దు ఇక్కడే ఉండండి అని.

కోడలికి అయితే ఆ మాట వింటే గుండెల్లో రాయి పడుతుంది. అత్తగారు ఇంట్లో లేకపోతే... అన్న ఊహే భరించలేకపోతోంది.

విశ్వనాధంగారికి పరిస్థితి అర్థం అయ్యింది. తనే ఏదో చెయ్యాలని నిర్ణయించుకున్నారు.

మర్నాడు రాత్రి అందరి భోజనాలు అయ్యాకా, కొడుకూ కోడలిని పిలిచి "మేము ఆదివారం ఊరెళ్తున్నాము" అని చెప్పారు.

ఇద్దరూ ఉరుములేని పిడుగు పడ్డట్టు ఉలిక్కిపడ్డారు...

"అదేంటి నాన్నగారూ వెళ్ళొచ్చులెండి! ఇప్పుడు వెళ్లి అక్కడ చేసేదేముంది" అన్నాడు కొడుకు.

కోడలు కూడా అదేంటి "మామయ్య గారూ మీరు ఇక్కడే ఉండండి. అక్కడ ఇద్దరూ ఏముంటారు?" అంది ఆందోళనగా!

"మీరంతా మామీద ప్రేమతో చెప్తున్నారు, నాకు తెలుసు...మమ్మల్ని ప్రేమగా చూసుకుంటున్నారు. కోడలు కూడా తన తల్లిదండ్రులలాగానే మమ్మల్ని చూసుకుంటోంది. కానీ ఆరు నెలలు పైగా అయ్యింది మేము వచ్చి...ఒకసారి ఇంటికి వెళ్లాలని ఉంది. ఇదీ మన ఇల్లే...కానీ అక్కడ వాతావరణంకి అలవాటు పడ్డ వాళ్ళం. మీ అమ్మకి కూడా ఈ మధ్య ఒంట్లో బాగుండటం లేదు" విశ్వనాధంగారు అన్నారు.

"ఇక్కడ డాక్టర్‌కి చూపిద్దాం!" అంది కోడలు.

"అవసరం లేదమ్మా, మా ఊరు వెళ్తే అన్నీ సర్దుకుంటాయి! మేము మళ్లీ వస్తాము కదా, ఏమీ అనుకోకండి! మేము ఒకే చోట ఉండలేము. అర్థం చేసుకోండి!" అన్నారు విశ్వనాధంగారు!

"నేను ఆదివారానికి గౌతమికి టికెట్స్ కొనేసాను పొద్దున వెళ్లి..." అని నెమ్మదిగానైనా ఖచ్చితంగా చెప్పేసారు.

పిల్లలు "వెళ్ళొద్దు తాతా నానమ్మా.." అని చుట్టేశారు.

నిజంగా పిల్లల్ని చూస్తే బాధగా అనిపించింది వాళ్ళిద్దరకీ... "మళ్లీ వస్తాం నాన్నా! ఈసారి సెలవలకి మీరు రండి!" అని ఓదార్చారు.

"మీ ఇద్దరూ కూడా రండి...ఓ వారం సెలవు పెట్టుకుని! మీకూ మార్పు ఉంటుంది" అన్నారు...కొడుకూ కోడలితో.

"మీరు అలా నిర్ణయం తీసేసుకుంటే ఏం అనగలం నాన్నగారూ! మీ ఇష్టం!" అన్నాడు కొంచెం అసంతృప్తితో కొడుకు.

కోడలు చిన్నబుచ్చుకొని లోపలికి వెళ్ళిపోయింది.

ఆదివారం రైలు ఎక్కి కదిలాకా.. అరుంధతి గారు అడిగారు భర్తని... "ఏంటండీ అంత ఖచ్చితంగా చెప్పి బయలుదేరారు!"

"అరుంధతీ... నీకు పిల్లలతో ఉండటం ఆనందం అని తెలుసు. కానీ నువ్వు అలా సరైన విశ్రాంతి లేకుండా ఉంటే నీ ఆరోగ్యం దెబ్బతింటోంది. అసలు స్వేచ్ఛకి మొహం వాచిపోయినట్టు అనిపించింది. నాలుగు గోడల మధ్య ఉండలేకపోయాను. మన ఊరిగాలి, ప్రశాంతత, ఆ మనుషులు కావాలనిపించింది. మనింటికి వెళ్తే నీ ఆరోగ్యం మెరుగవుతుందనిపించింది. మనం

లేకపోతే... ముఖ్యంగా నువ్వు లేకపోతే వాళ్ళకి ఇబ్బందే కాదనను. కానీ ఎంతకాలం చెప్పు? నేను అనేది మనం మనవలతో ఆడుకునే వయసు! వాళ్ళని చూసి ఆనందిస్తూ విశ్రాంతిగా ఉండే వయసు. వాళ్ళకి వండి పెట్టి, వాళ్ళ పనులు చేస్తూ, ఇంటికి కాపలాగా, వాళ్ళకి అండగా ఉండలేము. మనకి ఉన్న కాస్త ఓపిక ఇలా ఖర్చు అయిపోతే ఎలా? ప్రశాంతంగా ఏవో చిన్న చిన్న తీర్థయాత్రలు చేయడానికి ఉపయోగిద్దాం. మనల్ని చూడాలనుకుంటే ఎవరైనా మనింటికి వచ్చి చూస్తారు, వాళ్ళని ఆదరిద్దాం. అంతే గానీ ఇలా పిల్లలింటికి వెళ్లి నెలలు నెలలు ఉండొద్దు... ఒక వారం పదిరోజులు ఉండి వద్దాం కావాలంటే! ప్రేమ మనకి కావాలి... కానీ ఆ ప్రేమ ఊబి కాకూడదు! మనకి ఈ వయసులో స్వేచ్ఛ ముఖ్యం, విశ్రాంతి అవసరం! పరిగెత్తినంత కాలం మనమూ జీవితంలో పరిగెత్తాం.. అలసిపోయి ఉన్నాం! ఇపుడు విశ్రాంత జీవనం గడపాలి. ఎవరి సంసారాలని వాళ్ళు చూసుకుంటారు...చూసుకోగలరు! వాళ్ళ ఆర్ధిక పరిస్థితి బావుంది దేవుని దయవలన! నువ్వు వాళ్ళ గురించి బాధపడకు. మనం లేనపుడు కూడా వాళ్ళు వాళ్ల బ్రతుకు బ్రతికారు కదా! నీ ఆరోగ్యం ముఖ్యం నాకు... అందుకే నీకు చెప్పకుండా నిర్ణయం తీసేసుకున్నాను. నువ్వు ఎంతకాలమైనా పిల్లలకోసం కష్టపడగలవు, నీకు అందులో ఆనందముందని తెలుసు! కానీ నువ్వు అలా కష్టపడుతుంటే నేను చూడలేను. నాది స్వార్ధమనుకో ఏదైనా అనుకో!“ అంటూ కళ్ళు తుడుచుకున్నారు విశ్వనాధంగారు.

“లేదులెండి... మంచి పనే చేశారు! నిజంగానే ఓపిక లేదు నాకు. పిల్లలతో నేనైతే.. చేయలేనని చెప్పలేను! నాకున్న సమయాన్ని, విశ్రాంతిగా, ప్రశాంతంగా, ఆధ్యాత్మిక చింతనలో గడుపుతాను!“ అన్నారు అరుంధతిగారు.

“ఇంకో విషయం... మనమిద్దరం తరువాత ఒకసారి వెళ్లి, అన్నివసతులతో ఉన్నవృద్ధాశ్రమాలు చూసి వద్దాం. ఒక అవగాహన వస్తుంది. వృద్ధాశ్రమాలంటే అలా భయంగా చూడకు... ఇప్పుడు మనలాంటి వాళ్ళతో చాలా చక్కగా ఉంటున్నాయి! అక్కడా ప్రశాంతతతో పాటు ఆరోగ్యకరమైన వాతావరణం ఉంటోంది. అక్కడా నెలనెలా డబ్బు కట్టాలి. ఏది బావుందో సెలెక్ట్ చేసి పెట్టుకుందాం! రోజులు ఎప్పుడు ఎలా ఉంటాయో తెలీదు. ఓపిక తగ్గినప్పుడు అక్కడికి వెళ్లిపోదాం! ఎందుకంటే ఓపికలేని మనల్ని, దగ్గర పెట్టుకుని చూసే సమయం, ఓపిక పిల్లలకి ఉండవు! వాళ్ళ పరిస్థితులు అలాంటివి. వాళ్ళు చెడ్డవాళ్ళని కాదు.. మానసికంగా తయారయి ఉండటం మన ఇద్దరికీ మంచిది!“ అని అంటున్న విశ్వనాధంగారి మాటలు వింటూనే, తలఊపి వెనక్కి వాలి కళ్ళు మూసుకున్నారు అరుంధతి గారు.

ఇలా ఉన్న ఎన్నో రకరకాల మనుషులతో, వారి ఆలోచనలతో, కష్ట సుఖాలతో నాకేం సంబంధం అన్నట్టు...

రైలు నిర్లిప్తంగా, లయబద్ధంగా తన గమ్యం వైపు సాగిపోతోంది!!

# మధ్యమావతి

భాగవతుల భారతి



✆ 8121712950

శ్రీమతి సోమేపల్లి నాగమణిశ్రీ స్మారక కథల పోటీ - శ్రీ శుభకృత్ వత్సర ఉగాది - 2022
సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ

***"ఈ రోజుల్లో నలుగురు ఆడపిల్లలను పోటీ మీద కంటున్నాడా బుద్ధున్నవాడెవడైనా? కనమని నేను బ్రతిమాలానా.. ఏం లేదూ! నలుగురు మగపిల్లల తర్వాత ఆడపిల్లైతే, నట్టింట దాని ఒళ్ళంతా బంగారమే! అదే నలుగురు ఆడపిల్లల తర్వాత పిల్లవాడైతే, వాడికి 'చేతికి చిప్పా జోలే.. బొక్కలో బొమ్మరాయే'. ఆడపిల్లలకు నన్ను నౌకరుగా కన్నావు! చూస్తున్నాగా, ఏమన్నా అంటే కూతుళ్ళను వెనుకేసుకొస్తావు! వాళ్ళే ఎక్కువ నీకు. వాళ్ళ దగ్గరే ఉండు వెళ్ళు! ఛీ.. ఈ కొంపలో మనశ్శాంతి లేదు. పోతున్నా!"***

★★★

సత్యనారాయణ ఆలోచనలో పడ్డాడు. జీవితంలో ఏం సాధించినట్లూ? ఈవయసులో నాకీ దు:ఖమేమిటీ? వీడికి ఆ బుద్ధి మాంద్యం ఏమిటీ? మన ఆలోచనలూ, మన నిర్ణయాలే మన జీవనమార్గాన్ని నిర్దేశిస్తాయా? ఒకరి జీవితంలో జరిగి, ప్రశాంతతను కలిగించిన అవే సంఘటనలు, మన జీవితంలోకి వచ్చేటప్పటికి వక్రంగా పరిణమిస్తాయేం? గతం కళ్ళముందు కదలాడగా నిట్టూర్చాడు ఆయన.

★★★

"ఒరే! సత్యం.. నీకు ఆడపిల్లరా! తొలిచూలు ఆడపిల్లైతే నట్టిల్లు బంగారంరా!" తల్లిదండ్రుల మురిపంతో, ఓ మాట కలిపి తానూ సంతోషించాడు.

రెండోసారి "సత్తిగా నీకు మళ్ళీ ఆడపిల్లేరా!" పిలుపులోనూ, మర్యాదలోనూ జోరు తగ్గింది.

"సరేలే! ఇక ఆపేద్దాం.. ఆపరేషన్ చేసేయండీ!" సత్యన్నారాయణ డాక్టర్‌తో చెప్పాడు.

"ఆఁ.. ఆఁ.. నీ ఆఘాయిత్యం కూలిపోనూ!"

"అపుత్రస్య గతిర్నాస్తి... పున్నామ్నో నరకాత్త్రాయత ఇతి పుత్ర యని.. పున్నామ నరకం పుత్రుడే దాటించాలి అన్నారు శాస్త్రాల్లో"

"అపుత్రాః పుత్రిణస్సంతు పుత్రిణస్సంతు పౌత్రిణః అని దశ్శాంతులలో చెప్పబడింది!"

"అపుత్రాః అన్నారు గానీ అపుత్రికాః అన్నారా ఎవరైనా! పుత్రోత్సాహము తండ్రికి అన్నారు, కానీ పుత్రికోత్సాహం అనలా! కాబట్టి నువ్వు కొడుకును కనాల్సిందే!" అన్నారంతా.

"మీకేం బానే చెబుతారు, కానీ ఈ సంసారం ఈదాల్సింది నేనేగా!" చిందులు తొక్కాడు సత్యనారాయణ.

"ఏమండీ! మనకు అబ్బాయి కావాలండీ!" భార్యకూడా వంత పాడేటప్పటికి మెత్తబడ్డాడు.

"ఏరా.. సత్తిగా! నీకు కవల పిల్లలురా! ఐతే ఇద్దరూ ఆడపిల్లలేరా!"

"నేను అప్పుడే మొత్తుకున్నా ఆపరేషన్ చేసేయండీ! పెళ్ళాంతో సహా ఎవరైనా విని చచ్చారా? ఇప్పుడు చూడండి ఏమైందో.. నా మాటంటే ఎవడికీ లెఖ్ఖలేదు!" చిందులూ, గంతులూ, చివాట్లూ, వాదనల మధ్యన చుట్టం చూపుగా అడుగు పెట్టింది విజయక్క సత్యనారాయణ ఇంట్లోకి, వాసుతో సహా.

విజయ, సత్యనారాయణ పెదనాన్నకి మొదటి భార్య కూతురు. వాసు ఆమె కొడుకు. విజయ మొదలెట్టింది.

"ఏంటి సత్యం! నీకూ తెలుసుగా మా కథ. నాకూ నలుగురు ఆడపిల్లలేగా! ఉమ, ఉష, రమ, సుమ, తర్వాత కొడుకు కావాలనేగా.. ఇదిగో వీణ్ణి కన్నామూ. వీడికేమయిందీ! నా కొడుకు బంగారం.. కోడలు యామినీ అంతకంటే బంగారం!" అంటూ ఓ గుక్కడు మంచి నీళ్లు త్రాగి, తిరిగి అంది.

"మీ బావ కాన్సర్ వచ్చి అర్థాంతరంగా వదిలేసి పోతే, ప్రభుత్వం ఆయన ఉద్యోగం వీడికిచ్చి ఆదుకుందా.. అప్పణ్ణించీ, అక్కలకు వీడే నాన్న అయ్యాడు. అప్పటికే పెద్దదానికి పెళ్ళి చేసినా, మిగతా అక్కలూ, వాళ్ళ ఆలనాపాలనా, నేను ఎంత చెబితే అంతగా నడిచాడు, నడిపించాడు, ఇక కోడలూ అంతే! అదే వీడు లేక ఆడపిల్లకి ఆ ఉద్యోగం ఇస్తే, సంపాదన వేరే వాడిచేతుల్లోకే పోయేదేగా... మానోట్లో మట్టేగా!" మరో గుక్కెడు నీళ్లు త్రాగి, మళ్ళీ చెప్పడం మొదలెట్టింది.

"అంతెందుకూ! మా తమ్ముడు రాజవిఠల్ కీ ఇలాగే నలుగురూ ఆడపిల్లలేగా.. నేను చెప్పానని మగపిల్లవాణ్ణి కన్నాడు. నీకూ తెలుసుగా! ఇన్నాళ్ళు ఆగావు. ఈసారి మొగపిల్లవాడు పుడితే, వెంకటేశ్వరస్వామి పేరు పెడతానని మొక్కుకో, కొండకూ నడిచి వస్తానని మొక్కూ!" అని హితోపదేశం చేసింది.



సరేనని మళ్లీ చతికిలపడ్డాడు.

మొక్కుల ఫలమో, సమయం వచ్చిందో...

"ఏమండోయ్! సత్యనారాయణ గారూ! మీకు మొగపిల్లాడు పుట్టాడూ!" అని మాట వినబడింది. అబ్బ! ఈ వార్త వినటానికి, ఎన్నాళ్ళు తపస్సు చేయాల్సివచ్చిందని అనుకుంటూ, పుత్రోత్సాహంతో పొంగిపోయాడు.

విజయక్క చెప్పింది నిజమే అని, ఫోన్ చేసి చెప్పాడు. శ్రీనివాస్ అని పేరు పెట్టారు.

ఇక మగపిల్లవాడనే అతి గారాబంతో పాటు.. మధ్యతరగతి మనుషుల జీవితాల్లోని ఆర్థికంతో ముడిపడి ఉన్న, అన్ని రకాల అవసరాల 'మధ్యమావతి రాగం' శృతిలయలతో సహా, తాళం తప్పకుండా పాడటం మొదలెట్టింది. పిల్లలు పెరుగుతున్నారు. అతి సామాన్య గవర్నమెంట్ టీచర్ ఉద్యోగం చేస్తున్న సత్యనారాయణకి పిల్లలను పెంచటం, తలకు మించిన భారమైంది.

అసలే కరువురోజులూ... అదీ గాక, ఐదుగురు పిల్లలను కన్నాక, సత్యనారాయణ భార్య ఆరోగ్యం బాగా దెబ్బతింది. దాదాపు మంచం పట్టింది. ఇంటిపనీ, బయటిపనీ ఆయనే స్వయంగా చూసుకోవాల్సి వస్తోంది. నలుగురు ఆడపిల్లల చదువులూ, తలకుమించిన భారమైన నేపథ్యంలో, వయసుకు వచ్చిన ఆడపిల్లలు ట్యూషన్లు చెప్పుకుంటూ పి.జి. ఇద్దరు, బి. టెక్ ఇద్దరూ చదువుకుంటున్నారు.

"వీళ్ళకు పెళ్ళిళ్ళు ఎప్పుడు చేస్తావూ! ఎలా చేస్తావూ?" వంటి ప్రశ్నలు ఎదుర్కుంటూ 'పెక్కుసంతానం పెక్కు దు:ఖం', "అప్పుడే జాగ్రత్త పడితే సరిపోయేదిగా!..." ఇలాంటి మాటలు వింటూ గుడ్ల నీళ్ళు కుక్కుకునేవాడు సత్యనారాయణ.

'తప్పు మన పక్షాన ఉంటే, వాదనకి మన కంటే పెద్ద లాయరు ఉండడు. తప్పు అవతలి వారి పక్షాన ఉంటే సుప్రీంకోర్టు జడ్జి కూడా మనముందు బలాదూరే, తీర్పు మీద తీర్పు చెప్పేస్తాం!'

కాలం తన పని తాను చేసుకుపోతూనే ఉంది. పోతూ తనతో సత్యనారాయణ భార్యను కూడా తీసుకుపోయింది.

★★★

"ఏరా! ఒక్కగానొక్క కొడుకువి, చక్కగా చదువుకుని, మంచి ఉద్యోగం చేసుకుంటుంటే, నేనూ ఆనందపడతాను. నాకూ వయసైపోయి ఓపికపోతోంది!" సత్యనారాయణ అంటే..

"అవునూ! మొగ పిల్లవాడి దగ్గరికి వచ్చేసరికి ఓపికపోతుంది. ఆడపిల్లలందరికీ బానే చెప్పించావుగా చదువులూ.." శ్రీనివాస్ వాదన.

"శ్రీనూ! నీకూ తెలుసుగా అక్కలు కూడా గవర్నమెంట్ స్కూల్‌లోనే చదివారు. తర్వాత వాళ్ళంతట వాళ్ళే చదువుకున్నారు! పెద్దక్క ట్యూషన్స్ చెప్పి, రెండో అక్క చిన్న స్కూల్‌లో చిన్నపిల్లల టీచర్‌గా, మూడోది ఏదో ఓ పని చేసి, వాళ్ళ ఫీజులు కొంతవరకూ వాళ్ళే కట్టుకునీ, చదువుకుని మంచి ఉద్యోగాలలో స్థిరపడ్డారు!" సత్యనారాయణ సముదాయింపు.

"పెళ్ళిళ్ళూ జోరుగానే చేసావుగా! కొడుక్కు ఏం మిగలకుండా దోచి పెట్టావుగా!" శ్రీనూ ఆరోపణ.

"అదేమిట్రా! ఇక్కడేమన్నా ఎస్టేట్స్, ధనాగారాలూ మూలుగుతున్నాయా? వాళ్ళ చదువూ ఉద్యోగాలూ, ఇవన్నీ కాక నిన్ను కన్నాక, మీ అమ్మ మంచాన పడితే, మీ చిన్నతనంలో నేను కొన్నాళ్ళ ఇబ్బంది పడితే, అప్పుడు ఆడపిల్లలేగా ఆసరాగా చేతికి అందుకొచ్చారు! మీ అమ్మకు వాళ్ళు చేసిన సేవ, కుటుంబాన్ని తీర్చిదిద్దిన తీరు, చూసి మీ బావలు మెచ్చి, కావాలని చేసుకున్నారుగా పెద్దక్కలిద్దరినీ... మిగతావాళ్ళకి పెద్దక్కలే దగ్గరుండి పెళ్ళిళ్ళు జరిపించారుగా. లక్షల కట్నాలూ అవీ నా వల్ల అయ్యేదా! ఇప్పుడైనా మించిపోయిందేముందీ, కాస్తో కూస్తో, నాకూ ఫించన్ వస్తుంది సొంత ఇల్లు. బాధ్యతలు లేవు. అంతా నీకేగా. పైగా నువ్వు నిలదొక్కుకోటానికి అక్కలూ సాయం చేస్తామన్నారు. కుదురుగా ఉండి చదువేదో పూర్తిచేసి.." సత్యనారాయణ మాట పూర్తికాలా..

శ్రీనివాస్ చేతిలోని గ్లాస్ నేలకేసి కొట్టి, "ఆఁ చేస్తారు, చేస్తారు! ఇవన్నీ పైపై మాటలు! అంత ప్రేమ కారిపోయే వాళ్ళు... నలుగురికీ ఆడపిల్లలున్నారుగా.. ఒక్కదాని ఆడపిల్లనన్నా, మేనమామనేగా.. నాకిచ్చి ఈ ఇంటి కోడలుగా పంపవచ్చుగా! అబ్బే ఇవన్నీ అక్కర్లేదు! వాళ్ళ పిల్లలు బాగా చదివారు. అమెరికా సంబంధాలు కావాలి. తమ్ముడు ఏమైపోతే వాళ్ళకెందుకూ...? అయినా వాళ్ళననేదేముందీ! ఈ రోజుల్లో నలుగురు ఆడపిల్లలను పోటీ మీద కంటున్నాడా బుద్ధున్నవాడెవడైనా? కనమని నేను బ్రతిమాలానా.. ఏం లేదూ! నలుగురు మగపిల్లల తర్వాత ఆడపిల్లైతే, నట్టింట దాని ఒళ్ళంతా బంగారమే! అదే నలుగురు ఆడపిల్లల తర్వాత పిల్లవాడైతే, వాడికి 'చేతికి చిప్పా జోలే.. బొక్కలో బొమ్మరాయే'. ఆడపిల్లలకు నన్ను నౌకరుగా కన్నావు! చూస్తున్నాగా, ఏమన్నా అంటే కూతుళ్ళను వెనుకేసుకొస్తావు! వాళ్ళే ఎక్కువ నీకు. వాళ్ళ దగ్గరే ఉండు వెళ్ళు! ఛీ.. ఈ కొంపలో మనశ్శాంతి లేదు. పోతున్నా!" అంటూ ఫాంట్, చొక్కా వేసుకుని గేటును తన్నుకుంటూ బయటికి వెళ్ళిపోయాడు,

కొడుకు వెళ్ళిన వైపే చూస్తూ గొణుక్కున్నాడు సత్యనారాయణ. రోజూ ఇదే తంతు, తతంగం!

'పుత్రోత్సాహం తండ్రికి కాదురా! పుత్రనిరుత్సాహం తండ్రికి నీలాంటివాడివల్ల' రోజూ స్వగతంలో ఆ గొణుగుడు.

వెళ్ళినవాడు వెళ్ళినట్లే రెండు రోజులయింది ఇంకా రాలేదు, ఏమయ్యాడో? ఇది వరకు అలిగి వెడితే సాయంత్రానికి ఇంటికి చేరేవాడే!

మళ్ళీ ఆలోచన... ఆ విజయక్క విషయంలో జరిగినట్లు, తన విషయంలో ఎందుకు జరగలేదు? అయినా ఎందుకు జరుగుతుందీ? ఎలా జరుగుతుందీ? నా పిచ్చి కాకపోతే.. ఎవరి జీవితాలు వాళ్ళవి. తెలిసిన వాళ్ళందరి దగ్గరా వాకబు చేసారు. శ్రీనివాస్ జాడ తెలీలా!

గేటు చప్పుడయ్యేసరికి సత్యనారాయణ గతంలోంచి బయటికొచ్చి, గేటువైపు చూసి, అవాక్కై బిగుసుకుపోయారు. చలనంలేని

స్థాణువయ్యారు. శ్రీనివాస్‌ను చేతులపై మోసుకొస్తూ.. "అంకుల్ శ్రీనివాస్‌కి యాక్సిడెంట్ అయింది. నిన్ననే జరిగింది, ఎవరో గవర్నమెంట్ హాస్పటల్లో చేర్చారు. శ్రీనూ స్పృహలోకి వచ్చి మా నెంబర్లు చెప్పాడట. మేం వెళ్ళాం. మీకు తెలియనీయవద్దనీ, మీరు కంగారుపడతారనీ చెప్పాడు. కాలు పాదం దగ్గర కొంచెం వెంట్రుకవాసి చిట్లింది. ఇప్పుడు బానే ఉన్నాడు. కానీ కొంచెం బెడ్‌రెస్ట్ కావాలి.. అంతే!" అంటూ వాళ్ళే మంచం మీదకి జేర్చి, వెళ్ళిపోయారు.

ఆడపిల్లలకు కబుర్లు వెళ్ళినాయి. ఆడపిల్లలు ఎవరి వీలునుబట్టి వారు వచ్చారు. ఈ లోపు శ్రీను అవసరాలన్నీ సత్యనారాయణ చూస్తున్నాడు

శ్రీను "నాన్నా! నన్ను మన్నించు. నీ మీద గానీ, అక్కలమీద గానీ ఏం కోపం లేదు. నీ నిస్సహాయత, నా అసమర్థత నాచేత చాలా మాట్లాడిస్తోంది. ఇప్పుడు చూడు.. మన ఇళ్ళల్లో మొగపిల్లలకు పెళ్ళిళ్ళు అవటమే గగనం అవుతోంది. మన చదువులూ, ఉద్యోగాలూ 'గోచీకి ఎక్కువ అంగోస్త్రానికి తక్కువ' అన్నట్లుంటాయి! ఇప్పుడు నా వయసు ముప్పై ఐదు.. పోనీ ఏదైనా పనిచేద్దామన్నా నామోషి. చదువూ, సరైన సంపాదన లేకపోతే మగవాడికి జీవితం లేదా నాన్నా?" శ్రీనివాస్ అలా అడుగుతుంటే, తండ్రి గుండె కరిగి నీరయింది. దు:ఖం పొంగింది.

పెద్దక్క, చిన్నక్క చూట్టానికి వచ్చారు. వస్తూనే ఒకామెను వెంటపెట్టుకు వచ్చారు.

"నాన్నా! ఈమె మీ అల్లుడుగారి దూరపు బంధువు కూతురు, చెల్లెలు వరస! పేరు కల్యాణి. మనలాగానే మొగపిల్లవాడి కోసం అరడజను మంది ఆడపిల్లలను కన్నారు. కానీ అర్థాంతరంగా రోడ్డు ప్రమాదంలో తండ్రి పోయాడు. కుటుంబ భారమంతా తల్లి మోయలేకపోతే, పిల్లలంతా భుజాన వేసుకున్నారు. ఇలా తెలిసిన వాళ్ళిళ్ళల్లో ఏ పనైనా నాదీ అనుకుని చేస్తారు. డబ్బు కోసమే అనుకో. ఐతే పెళ్ళికాని పిల్ల అంత దూరమా.. అని వాళ్ళమ్మ తటపటాయిస్తుంటే మనింటికే కాబట్టి, పంపారు! మీకు తెలుసుగా.. మేమంతా పిల్లలతో బిజీ కదా! ఇక్కడ ఆడదిక్కు లేకపోయే, అందుకే మీ ఆలనా పాలనా కోసం కల్యాణి వాళ్ళ అమ్మతో మాట్లాడి తీసుకొచ్చా! నేను మళ్ళీ వచ్చే వారంలో వచ్చి తీసుకెడతా! కానీ కల్యాణి బాగోగులు జాగ్రత్త. నాకు మాట తెప్పించకండి!" అని శ్రీనివాస్‌కు కల్యాణిని పరిచయం చేసి, ఒకరి తర్వాత ఒకరు అక్కలంతా వెళ్ళిపోయారు.

ఎందుకో కల్యాణి శ్రీనివాస్ ఇరు చూపులూ కలిసాయి క్షణకాలం.

★★★

వారం తర్వాత సత్యనారాయణ పెద్దమ్మాయికి ఫోన్ చేసాడు.

"అమ్మాయీ! నీతో ఓ విషయం మాట్లాడాలే!"

"ఏ విషయం నాన్నా! శ్రీనివాస్, కల్యాణి విషయం కాదుకదా!"

"చాలా ఆశ్చర్యంగా ఉంది. నీకెలా తెలుసు? నువ్వు ఊహించావా?"

"నాన్నా! నేను కల్యాణిని అక్కడికి తీసుకువచ్చి దింపిన ప్రధాన కారణం అదే! కానీ విషయం ఇదీ.. అని చెప్పాక, కల్యాణికి మన శ్రీను నచ్చలేదనుకో, అసలే మానసిక అశాంతితో బాధపడుతున్న శ్రీను, ఈమెకు కూడా పనికి రాకుండా పోయానే.. అనే ఆత్మన్యూనతా భావంతో, తను ఏదైనా అఘాయిత్యానికి పాల్పడితే, తద్వారా ఈ వయసులో మీరు, మేమూ చాలా ఇబ్బంది పడాల్సివచ్చేది! సరే శుభవార్త చెప్పారు, త్వరలోనే అందరం శ్రీనివాస కల్యాణం తిలకిద్దాం!" అని నవ్వింది.

# యువ కలం



# ఆప్తుడు

సి.హెచ్. గౌతమి



✆ 9703622086

***"ఒక పక్క భార్య మరణంతో కృంగిపోయిన నేను, ఆరు నెలల పసిగుడ్డుని చేతిలో పట్టుకొని ఎటుపోవాలో తెలియక ఈ ఊరు వచ్చాను. ఆ క్షణంలో నన్ను చూసి జాలిపడి చేరదీసి, మీ ఇంట్లో పని ఇవ్వడమే కాకుండా మీ పిల్లలతో పాటుగా నా బిడ్డకి కూడా విద్యాబుద్ధులు నేర్పించి ప్రయోజకుడిని చేశారు. ఈనాడు వాడేదో నాలుగు రాళ్లు సంపాదిస్తున్నాడని, ఆడితో వెళ్ళిపోతే పశువుకి నాకు తేడా ఏముంటాది చెప్పండి!***

★★★

"సీతా! త్వరగా కానివ్వు ఇప్పటికే ఆలస్యమైంది ఇంకాసేపు అయితే ట్రైన్ కూడా వెళ్ళిపోతుంది. అసలే పెళ్ళికి ఆలస్యంగా వెళ్తున్నాం, ఇది కూడా మిస్ అయ్యిందంటే ఇంక అంతే సంగతులు!" అంటూ హడావిడిగా లోపలికి వచ్చి చేతిలోని కవర్ పక్కన పెడుతూ అన్నాను.

"ఇదిగో అయిపోవచ్చింది.. ఒక్క ఐదు నిముషాలు! ఇంతకీ నేను చెప్పినవన్నీ తెచ్చినట్లేనా, ఏమైనా మరచిపోయారా? మరలా అత్తయ్యగారి దగ్గర, నాకు మాట రాకూడదు!" అంటూనే కవర్ చేతిలోకి తీసుకొని అందులోని వస్తువుల్ని లెక్కపెడుతూ అంది నా సతీమణి.

"అబ్బా.. అన్నీ తెచ్చానులే సీతా! ఇవి కూడా బ్యాగ్‌లో సర్ది సిద్ధంగా ఉండు. నేను వెళ్ళి ఆటో తీసుకొని వస్తాను!" అంటూ బయటకి నడిచాను.

ఆటో రైల్వేస్టేషన్ ముందు ఆగింది. బ్యాగులన్నింటిని ఒక్కొక్కటిగా కిందకి దించాను. ఆటో వాడికి డబ్బులు ఇచ్చి, నా భార్య చేతిలోని పాపని అందుకున్నాను.

"అన్నీ దించారుగా.. ఇంకేమి మరచిపోలేదుగా?" అంటూ ఒకటికి రెండుసార్లు ఆటో అంతా పరికించి చూసి కిందకి దిగింది సీత.

ప్లాట్ఫారం మీదకి వెళ్ళేసరికి మేము ఎక్కవలసిన ట్రైన్ సిద్ధంగా ఉండడంతో.. ఎక్కి మాకు కేటాయించిన బెర్తుల్లో కూర్చుని, సమయానికి ట్రైన్ అందుకున్నందుకు ఊపిరి పీల్చుకున్నాం!

ఉదయం ఏడు గంటలకు మా ఊరు చేరుకున్నాం. ట్రైన్ దిగి కింద అడుగుపెడుతూనే ఎప్పటిలాగానే నా కళ్ళు రామయ్య కోసం వెతికాయి. మరుక్షణమే రామయ్య లేడని గుర్తొచ్చి, మనసులో ఏదో తెలియని బాధ నన్ను ఆవరించింది. రెప్పపాటులో ఒక తియ్యటి జ్ఞాపకం నా కళ్ళను తడిపింది. మరుక్షణంలో వెచ్చటి దిగులు మనసును కలవరపెట్టింది..

అంతలో.. "దండాలయ్యా... నా పేరు అంజి! పెద్దయ్యగారు పంపారు. రండి ఇంటికి ఎల్దాం!" అంటూ నా చేతిలో బ్యాగులని అందుకుంటూ అన్నాడు ఒక వ్యక్తి. అతను కొత్తవాడైనా బండి మాదే కావటంతో, అతని వెంట బయలుదేరాం.

ఇంటికి చేరేసరికి ఇల్లంతా పందిళ్ళతో మామిడి తోరణాలతో, బంధుజనంతో కళకళలాడుతూ కోలాహలంగా ఉంది.

"ఏరా... ఇంత ఆలస్యమైంది? పోన్లే ఇప్పటికైనా వచ్చారు అదే సంతోషం!" అంటూ నన్నూ, "ఏమ్మా...ఎలా ఉన్నావు?" అంటూ తన కోడలిని ప్రేమగా పలకరించింది అమ్మ.

"బాగున్నాను అత్తయ్యా! మీరూ, మామయ్య గారు ఎలా ఉన్నారు?" అంటూ నా భార్య కుశలప్రశ్నలు వేసింది.

"మేమంతా బాగున్నాం అమ్మాయ్. పాపని ఇలా ఇవ్వు, నేను పాలు పట్టిస్తాను.. ఈలోగా నువ్వెళ్ళి స్నానం చేసిరా, ఏమైనా తిందువుగానీ!" అంటూ సీత చేతిలోని పాపని అందుకుంది అమ్మ.

"సరే అత్తయ్యా!!" అనేసి తను లోపలికి వెళ్ళిపోయింది..

"ఏమిటో ఈ ఆలస్యాలు! అయినా ఈ ట్రైన్లు ఎప్పుడు సమయానికి వచ్చాయి గనుక. ఎప్పుడు తిన్నారో ఏమో.. ముందు లోపలికి వెళ్ళి స్నానం చేసి వేడివేడిగా ఏమైనా తినండిరా!" సమాధానానికి తావులేకుండా ఆర్డర్ జారీచేసింది అమ్మ.

"అలాగే అమ్మా.. నాన్నగారూ ఏరీ ..!" అంటూ లోపలికి నడిచాను.



"ఆయన పంతులుగారి దగ్గరకు వెళ్ళారు. రావడానికి కాస్త ఆలస్యం అవుతుంది. ఆలోగా స్నానం చేసి కాసేపు విశ్రాంతి తీసుకో!" అంది అమ్మ.

ప్రయాణం అనుకున్నప్పట్నుండి సరిగ్గా నిద్రలేకపోవడం, అందునా ప్రయాణ బడలిక వలన, కళ్ళు మూసుకున్న వెంటనే నిద్ర పట్టేసింది.

"మామయ్యా.. అమ్మమ్మ మిమ్మల్ని కిందకి రమ్మంటోంది." అంటూ పిలిచిన నా మేనకోడలి పిలుపుతో మెలకువ వచ్చి, కిందకి వెళ్ళాం.

అమ్మ.. పెళ్ళికి వచ్చిన అతిథులకు ఇవ్వాల్సిన తాంబూలాలు సిద్ధం చేస్తోంది.

"రేపు ఉదయం నుండే పెళ్ళి పనులు మొదలుపెట్టాలి. అందుకే పెళ్ళికి ఏమేమి కావాలో అవన్నీ ఈ రాత్రికే సిద్ధంచేసి పెట్టుకోండి. ఉదయం చాలా పనులు ఉంటాయి, ఆ సమయంలో హడావిడి పడకుండా ముందు జాగ్రత్తగా చెబుతున్నాను. మరొక్క విషయం.. రేపు సాయంత్రం వరకు పాపని శాంత పిన్నికి అప్పచెప్పండి. అక్కడైతే పిల్లకి ప్రశాంతంగా ఉంటుంది. పనులన్నీ అయిన తర్వాత, పెళ్ళి సమయానికి వెళ్ళి తీసుకువద్దాం!" అని ముగిస్తూ... 'ఏంటో.. పెళ్ళి సమయం కూడా దగ్గరపడింది ఇంకా ఎక్కడి పనులు అక్కడే ఉన్నాయి. ఏం చేయాలో.. ఏమీ అర్థం కావట్లేదు!' స్వగతంలో గొణుక్కుంటూ హడావిడిగా అటుఇటు తిరుగుతోంది అమ్మ.

అమ్మ అలా చెప్తుంటే నాకేదో కొత్తగా అనిపించింది. అమ్మలో ఇంతకు ముందు ఎన్నడూ చూడని ఏదో మార్పు. ఎప్పుడూ ఆనందంగా నవ్వుతూ ఉండే అమ్మ కళ్ళు, ఇప్పుడు ఎందుకో ఆందోళన పడుతున్నట్లుగా ఉన్నాయి. ఎప్పుడూ ప్రశాంతంగా ఉండే అమ్మ ఎందుకో కంగారుగా కనిపించింది.

"అమ్మా... ఏమైంది నీకు? ఎందుకిలా కంగారు పడుతున్నావు?" నా మనసులోని ప్రశ్నని బయటపెట్టాను.

"ఎందుకేంటిరా? తెల్లవారితే చెల్లి పెళ్ళి పెట్టుకొని, కంగారు ఎందుకు అని అడుగుతున్నావు?"

“కానీ ఇదివరకెప్పుడూ లేని కంగారు ఇప్పుడే ఎందుకమ్మా? ఇదేమి మనింట్లో మొదటి శుభకార్యం కాదు కదా?”

అరక్షణం మౌనం తర్వాత.... నా కళ్ళలోకి చూస్తూ, “కానీ, మన రామయ్య లేకుండా జరిగే మొదటి పెళ్ళి కదరా!“ అంది కలతచెందిన కళ్ళతో.

అవును నిజమే కదా! రామయ్య లేకుండా మా ఇంట్లో జరిగే మొదటి పెళ్ళి ఇదే. ఉదయం స్టేషన్ దగ్గర నుంచి ఆ లోటు కనిపిస్తూనే ఉంది, ‘ఇంతకీ నాన్నవచ్చేరా..!’ అనుకుంటూ బయటకి నడిచాను.

పెరట్లోని తోటలో అరటిగెలల్ని కిందకి దింపి, లెక్కపెడుతున్న నాన్నని సమీపించి, “నాన్నా!.“ అంటూ పలకిరించాను.

“ఏరా.. ప్రయాణం బాగా జరిగిందా?”

“బాగా జరిగింది నాన్నా.“

“నేను బయటనుండి వచ్చేసరికి నువ్వు నిద్రపోతున్నావని మీ అమ్మ చెప్పింది. అందుకే లేపలేదు. లోపలికి వెళ్ళి ఆ గది తాళం తీసుకురా.“

“అలాగే నాన్నా“ అనేసి లోపలికి వెళ్ళి తాళంచెవి తెచ్చి నాన్న చేతిలో పెట్టాను.

“శివాజీ.... ఈ గెలల్ని గదిలో పెట్టించు! ఒరేయ్ నారిగా, ఆ పూల మాలలు మండపంలో పెట్టించు! ఎవడ్రా.. దారికి అడ్డంగా కుర్చీలు వేసింది, కాస్త దారి వదిలి వెయ్యండి! ఏరా రాంబాబూ.. పిండివంటలు తయారయ్యాయా? మగపెళ్లివారి ముందు మాట రాకూడదు, అలాగే భోజనాల విషయంలో కూడా!“ నాన్న పనుల పురమాయింపులలోనే హడావుడి కనిపిస్తుంది.

“ఒరేయ్ రాజు! స్టేషన్‌కి బండి పంపమన్నాను పంపావా?”

“ఇంకా లేదు పెదనాన్నా! ఇప్పుడే పంపుతాను.“

“ఇంకా పంపలేదా! త్వరగా.. త్వరగా.. పంపు!“ అంటూ కంగారుపడిపోతూ పెరట్లోకి, ఇంట్లోకి అటూ ఇటూ తిరుగుతున్నారు నాన్నగారు.

ఏర్పాటులు చూస్తూ, చాలా హడావిడిగా ఉన్న నాన్నగారిని గమనిస్తున్న నేను, ఆయన కంగారు చూసి దగ్గరకి వెళ్ళి “ఈ సమయంలో మన రామయ్య ఉండుంటే ఎంతో బాగుండేది కదా?“ అన్నాను అప్రయత్నంగా.

నా మాటలకి ఆశ్చర్యపోయిన నాన్న, నావైపు చూస్తూ, “నా మనసులో మాట నువ్వెలా పసిగట్టగలిగావు కృష్ణా!“ అని అడిగారు.

“అది నీ మనసులో మాటే కాదు నాన్నా, నాది కూడా!“

“అవునురా! ఈ సమయంలో రామయ్యే ఇక్కడ ఉండి ఉంటే, నాకెంతో సాయంగా ఉండేది. ప్రశాంతంగా గుండెల మీద చెయ్యి వేసుకొని కూర్చునేవాడ్ని! వాడు లేని లోటు బాగా తెలుస్తుంది. ఇప్పుడు చేతికింద ఇంతమంది పనివాళ్ళు ఉన్నా, ఒకటికి పదిసార్లు అరవాల్సివస్తుంది. కానీ అప్పుడు ఇన్ని పనులు వాడొక్కడే ఒంటిచేత్తో చేసుకుపోయేవాడు!“ అంటున్న నాన్న మాటల్లో బాధ కనబడింది.

ఒక్కసారిగా రామయ్య జ్ఞాపకాలు నన్ను కట్టి పడిసాయి.

ముందులో చదువు, తర్వాత ఉద్యోగరీత్యా వేరే ఊర్లో ఉంటూ, అప్పుడప్పుడు మా ఊరికి వచ్చి వెళ్ళే, నాకే రామయ్య ఇంతలా గుర్తొస్తున్నాడంటే, నిద్ర లేచినప్పటి నుండి పడుకొనే వరకు వాళ్ళ కళ్ళ ముందే కనబడే రామయ్య లేకపోతే, నాన్నకి ఎలా ఉండి ఉంటుందో ఆ క్షణంలో ఊహించగలిగాను.

రామయ్య మాకు ఏమీ కాదు కానీ, మాకు ఎంతో ఆప్తుడు. అయినవాళ్ళు, రక్తసంబంధికులే పట్టించుకోని ఈ రోజుల్లో కూడా, మూడు తరాలుగా మా కుటుంబానికి ఎంతో సహాయంగా ఉంటూ, మా మంచిచెడులలో పాలు పంచుకుంటూ, మాలో ఒకడిగా ఉంటూ, మా కుటుంబానికి వెన్నెముకగా నిలిచాడు.

నాకు ఊహ తెలిసినప్పటినుండి మా ఇంట్లో కోడికూత కన్నా ముందే వినిపించే గొంతు రామయ్యదే. ఉదయమే వచ్చి పనంతా చేసేవాడు. రాత్రి అందరూ నిద్రపోయే వేళకి ఇంటికి తిరిగి వెళ్ళేవాడు.

నేను పై చదువుల కోసం పట్నం వెళ్తుంటే తన సొంత బిడ్డ దూరమవుతునట్లుగా బాధపడ్డాడు. నేను ఎప్పుడు ఇంటికి వస్తున్నానని తెలిసినా, నాకోసం తానే స్వయంగా స్టేషన్‌కి వచ్చేవాడు. దారి పొడుగునా నేను లేని సమయంలో ఊర్లో జరిగిన విశేషాలన్ని ఏకరువు పెట్టేవాడు.

రామయ్య మా ఇంట్లో పనివాడుగా ఎప్పుడూ అనుకోలేదు.. మాలో ఒకడుగానే భావించాం!

తన కొడుకుకి ఉద్యోగం వచ్చి పట్నంలో స్థిరపడినా, తను మాత్రం ఈ ఊరిని, మమ్మల్ని వదిలిపోలేక మాతోనే ఉండిపోయాడు.

నా చిన్నతనంలో జరిగిన ఒక సంఘటన నాకు ఇప్పటికీ గుర్తుంది. అప్పటికే రామయ్య కొడుకు పట్నంలో బాగా స్థిరపడ్డాడని విని ఎంతో సంతోషించిన మా తాతయ్య, రామయ్యని పిలిచి "రామయ్యా! ఇప్పటికైనా నీ కోరిక తీరినట్లేనా? నీ కష్టానికి తగ్గ ఫలితం వచ్చిందిగా సంతోషమేనా!" అని అడిగారు.

"నా కొడుకు గురించి నేనెప్పుడూ బాధపడలేదయ్యా.. ఏదో ఒకరోజు వాడు మంచి స్థాయికి ఎదుగుతాడని నమ్మకం నాకుంది. ఇక సంతోషం అంటారా! నా కొడుకు ప్రయోజకుడవ్వాలని నా కన్నా మీరే ఎక్కువగా ఆశపడ్డారు. ఇదంతా మీ దయ!" అంటూ చేతులు జోడించాడు.

"నాదేముంది రామయ్యా... నీలాంటి మంచి వాళ్ళకి ఆ దేవుడెప్పుడు అన్యాయం చేయడు. ఇంతకీ నీ కొడుకు దగ్గరకి ఎప్పుడు వెళ్తున్నావు?"

"లేదయ్యా...నేనెక్కడికి ఎల్లట్లేదు.."

"ఏం.. నీ కొడుకు పిలవలేదా?"

"పిలిచాడయ్యా..నేనే రానని సెప్పినాను!"

"ఎందుకు?"

"ఒక పక్క భార్య మరణంతో కృంగిపోయిన నేను, ఆరు నెలల పసిగుడ్డుని చేతిలో పట్టుకొని ఎటుపోవాలో తెలియక ఈ ఊరు వచ్చాను. ఆ క్షణంలో నన్ను చూసి జాలిపడి చేరదీసి, మీ ఇంట్లో పని ఇవ్వడమే కాకుండా మీ పిల్లలతో పాటుగా నా బిడ్డకి కూడా విద్యాబుద్ధులు నేర్పించి ప్రయోజకుడిని చేశారు. ఈనాడు వాడేదో నాలుగు రాళ్లు సంపాదిస్తున్నాడని, ఆడితో వెళ్ళిపోతే పశువుకి నాకు తేడా ఏముంటాది చెప్పండి!" అన్నాడు వినయంగా.

"అలా ఎందుకు అనుకుంటావు. ఇంతకాలం ఎంతో కష్టపడ్డావు, కనీసం ఇప్పుడైనా నీ కొడుకు దగ్గరకి వెళ్ళి సుఖంగా ఉండొచ్చు కదా! ఇప్పటివరకు మా కుటుంబానికి నువ్వు చేసిన సాయం మేము ఎన్నటికీ మరచిపోలేము.... అలా అని నీ జీవితం అంతా మా కోసం ధారపోస్తాను అంటే నేనొప్పుకోను. వెళ్ళు.. వెళ్ళి నీ బిడ్డతో సంతోషంగా గడుపు!" అన్నారు తాతయ్య.

"మీరెన్నైనా చెప్పండి అయ్యా, దిక్కులేని నాకు ఓ దిక్కై ఉండడానికి కాస్త నీడని ఇచ్చింది ఈ ఊరు. బ్రతకడమే కష్టంగా మారిన సమయంలో బ్రతుకు మీద ఆశని కల్పించి, జీవితానికి ఒక అర్థం తెలిసేలా చేసింది మీరు. అలాంటి మిమ్మల్ని, ఈ ఊరిని వదిలి నేను వెళ్ళలేను అయ్యగారు! నా చివరి కోరిక కూడా అదేనయ్యా!" అంటూ చేతులు జోడించి అక్కడి నుండి వెళ్ళిపోయాడు.

అక్కయ్యకి పెళ్లి అయి, ఆమె కూడా ఆ ఊరు వదిలిసింది. ఎప్పుడూ తాత, అమ్మ నాన్న ఒంటరిగా ఉన్నారని అనిపించలేదు. రామయ్యతో ఉన్నారులే అనే ఓ ధైర్యం మాకుండేది. మా తాతయ్య శివైక్యం పొందిననప్పుడు కూడా రామయ్య మాతోనే ఉన్నాడు. తన సొంత తండ్రి పోయినంతగా బాధపడ్డాడు.

ఆయన ఉన్నన్నాళ్ళు మాకు ఎటువంటి కష్టం కలగకుండా, ఏ చిన్న ఇబ్బంది లేకుండా అన్నీ తానే చూసుకున్నాడు. మరి ఇప్పుడు? ఏ పని చేయాలన్నా రామయ్య లేని లోటు బాగా తెలుస్తోంది.

ఏ కార్యం తలపెట్టాలన్నా అందరికన్నా ముందు తానే పూనుకొని అన్ని పనులు ఒంటి చేత్తో చేసేవాడు. పైగా 'మీరేమి భయపడకండి అయ్యగారు అన్నింటికీ నేనున్నాను కదా, మీరు నిశ్చింతగా ఉండండి' అంటూ ధైర్యం చెప్పేవాడు.

ఇప్పుడు ప్రతి చిన్న పనిలో రామయ్య జ్ఞాపకాలు అందరినీ వెంటాడుతూనే వచ్చాయి. అలాగని కాలం ఎవరికోసం ఆగదు కదా.. అలా తన పని తాను చేసుకుపోతుంది. కానీ ఆ కాలం మిగిల్చిన జ్ఞాపకాలు మాత్రం మనసుల్లో చెరిగిపోని ముద్రలుగా శాశ్వతంగా ఉండిపోతాయి.

తెల్లారింది.. ఓ గంటలో మగ పెళ్ళివారు వస్తారంటూ నాన్నా హడావిడి చేస్తున్నారు

గబగబా తెమిలి పెళ్ళివారికి ఎదురు వెళ్ళడానికి బయటకు వచ్చాను.

పంచెకట్టు బిగుతుగా కట్టి, చేతుల బనియను వేసుకుని, భుజం మీద తుండు గుడ్డతో కనబడ్డ నన్ను చూస్తూనే, అందరూ ఆశ్చర్యపోయారు. అందరిలో ఒక్కసారిగా వచ్చిన హుషారు కొట్టొచ్చినట్లు కనబడింది!

నాన్న మాత్రం... ఉద్వేగం అణుచుకోలేక, దగ్గరకి తీసుకున్నారు. నాన్న కళ్ళల్లో ఆనందబాష్పాలు జరజరా రాలి నా భుజాన్ని తడిపాయి!

అవును.. మా రామయ్య అలాగే ఉండేవాడు!!

# దర్పణం

పూర్ణిమా కీర్తి



✆ 7569904235

***ఒక్క క్షణం వాళ్ళ ముందు ఆగి, "ఆ గంగమ్మకి మీలాగా మురికిని దాచుకొనే తత్వం లేదు!" అని ముందుకు వెళ్ళాడు. గంగమ్మ గల గల పారుతూ దర్పణంలా స్వచ్ఛంగా ముందుకి కదిలిపోతుంది. అందరూ వెళ్లి బతుకమ్మని సాగనంపి వెనుదిరిగి వెళ్ళారు.***

★★★

"ఏందిరో యారిగా! ఈ దినం పెద్ద బండకాడికి అందరినీ రమ్మని సెప్పినం గదా, నువ్వు ఎందుకు రానేదురా... నీకు పత్తేకంగా బొట్టు వెట్టి జెప్పాలా ఏంది? ఒక్కమారు దండోరా వేయించినం అంటే రావాలె అంతే... పతోడికి రోజు రోజుకీ నెత్తిమీద కొమ్ములు వత్తున్నయి!" అంటూ విసుగుకుంటూ, యారన్న సమాధానం చెప్పేలోపే గుండ్రాయిలాంటి తన శరీరం బరువుని బారంగా మోస్తూ, మెట్లు ఎక్కి ఇంటి లోపలికి వెళ్ళాడు మోహన్‌రావు.

ఆ పిలుపుకి సైకిల్ మీద నుంచి ఒక కాలు కిందపెట్టి ఆగిన యారన్న, మోహనరావు అలా విసుక్కుంటూ వెళ్ళడం చూసి, 'తను మారే మనిషి కాదని' ఓ నవ్వు నవ్వుకొని మళ్ళీ తన సైకిల్ మీద ఇంటికి బయల్దేరాడు.

'యెప్పుడు సూసినా తలుపులు దగ్గరికి యేసి ఉంచే కాంతమ్మ ఈ యేల ఎందుకో తలుపులు బార్లా తెరిచి పెట్టింది...' అని మనసులో అనుకుంటూ ఆరుబయట ఉన్న తొట్టిలో నుంచి నీళ్ళు తీసుకొని కాళ్ళు కడిగి, గుమ్మంలో నుంచే కాంతమ్మని పిలుస్తూ లోపలికి వెళ్ళాడు యారన్న. నిండా దుప్పటి కప్పుకొని కాంతమ్మ మూలుగుతూ కనబడింది. గబగబా వెళ్లి దుప్పటి జరిపి తల మీద చెయ్యి వేసి చూసాడు. తల నిప్పుల కుంపటిలా కాలిపోతుంది.

"ఏందే ఇంత జరం ఉంది... నేను పనికి పోయేటప్పుడు బాగానే ఉన్నావు గాదె, ఇప్పుడు ఇలా అయిపోయావు?"

"లేదయ్యా, నిన్న రాత్రి పూట నుంచే పానం సుస్తి చేసింది. పొద్దున నువ్వు పనికి పోవాలె గాదె, అందుకే కొంచం ఓపిక చేసుకుని నీకు డబ్బా కట్టిన..." కాంతమ్మ నీరసంగా అన్నది.

"కాంతమ్మా... నువ్వు అలా తినకున్న తొంగుంటే ఎట్టాగే... లే ఏమయిన తిందువు!" అంటూ మంచం మీద పడుకున్న కాంతమ్మని లేపబోయాడు.

"నా ఇసయం పక్కకి పెట్టయ్యా, పిళ్ళగాల్లు పొద్దటి నుంచి ముద్ద నోట్లో పెట్టలేదు. పండుగ కోసం పూలకని పొయ్యి, ఇంకా జాడే లేదు..." అని కాంతమ్మ అంటుండగానే...

"అచ్చేసిననే అమ్మా, సూడు ఎన్ని పూలు తెచ్చిననో... పతీ ఏడు సూరమ్మ బతుకమ్మనే పెద్దగా ఉంటది గదా, ఈ సారి నేను తెచ్చిన పూలతో వాళ్ళ కంటే పెద్ద బతుకమ్మ సేయ్యే, ఆకలి ఘోరంగా అయితాందే జల్ది అన్నం పెట్టు..." అంటూ సంధ్య లోపలకొచ్చింది.

"తల్లీ, అమ్మకి జరం అచ్చిందే!" కూతురి వైపు చూస్తూ అన్నాడు యారన్న.

"అయ్యో! నాకు తెల్వదే, ఇప్పుడు ఎట్టుందే.." అంటూ, తల్లి తల మీద చేయి పెట్టి చూస్తూ, "గుడ్డు కొడితే ఆమ్లెట్ అయ్యేటట్టు ఉంది గాదె. నువ్వు పడుకో... తమ్ముడూ నేనూ వంట చేత్తం!" అంటూ, తల్లి వారిస్తున్నా వినకుండా అప్పటికప్పుడు వంట చేసి, ఆమెకు ప్రేమగా తినిపించింది.

★★★

"అమ్మా, నా బతుకమ్మ అందరి కంటే పెద్దగా అయ్యిందే. నేను అందరి వాట్సాప్ స్టేటస్‌లు చూసినా... యెంకిగాడి అమ్మ తంగేడి పూలతో నీలిరంగు పూలు గలిపి బతుకమ్మ చేసిందే. చిన్నగా ఉన్నా మస్తు ముద్దగా గొడుతుంది." సంధ్య ఆనందంగా అన్నది.

"సరే కానీ ఇంత పెద్ద బతుకమ్మ మోసుడు నాతో గాదు బిడ్డ... ఇక్కడ ఎత్తింది మళ్ళీ గద్ద కాడికి పోయే దాకా దించేది లేదు."

"ఏం గాదె అమ్మా, నేను ఎత్తుతా, నా నెత్తి మీద పెట్టు..." అంటూ సంధ్య తన చున్నీని గుండ్రంగా చుట్టి తల మీద పెట్టుకుంది.

"జాగ్రత్తనే బిడ్డ" అంటూ బతుకమ్మని తల మీదకి ఎత్తింది కాంతమ్మ. కాంతమ్మ పాట పాడుతూ ఉంటే, తన బిడ్డ తనతో తాళం కలిపింది. బరువునీ, దూరాన్నీ సులభతరం చేసేందుకు అది ఓ చక్కని ఉపాయం!

"రమణీ బిందా తీసుక మంచీ నీళ్లకి పోతె

సోమవారం ఎదురాయనమ్మా ఆ సాంబశివుడు... ఆ సాంబశివుడు...

రమణీ బిందా తీసుక మంచీ నీళ్ళకి పోతె

మంగలారం ఎదురాయనమ్మా ఆ అంజనెయుడు... ఆ ఆంజనెయుడు...

రమణీ బిందా తీసుక మంచీ నీళ్లకి పోతె

బుదారం ఎదురాయనమ్మా ఆ బొజ్జగణపయ్యవాడు... గణపయ్య వాడు..



కాస్త ముందుకు వెళ్ళాక, "నాతో గాదె అమ్మా" అని అక్కడే వున్న బండమీద కూర్చుండిపోయింది ఆ బక్క ప్రాణం. దూరంగా సైకిల్ వేసుకొని వస్తున్న యీరన్న.. వాళ్ళని చూడగానే అక్కడికి వచ్చాడు.

"ఏం అయింది కాంతం, జరం తగ్గిందానే బతుకమ్మ పట్టుకొని ఎళ్ళినావు!" అంటూ అడిగాడు యీరన్న.

"ఏం గాదులే అయ్యా... ఏడాదికి ఓ మారు అచ్చే పండుగ, ఎట్లా పోనియ్యాలే సెప్పయ్యా. పండుగ ఎప్పుడు వస్తది అని, పండగ అయిపోయిన నాటి నుండి అనుకుంటా ఎదురు చూస్తాది కదే బిడ్డ, అందుకే వచ్చిన..."

"మంచిగున్నదిలే... లే లే కళ్ళు తిరిగి కింద పడితే ఎంకన్న సామి గుర్తు అత్తడు! అప్పుడు నీలాంటిది 'పక్షవాతం బోయి నాకు కాళ్ళు అత్తే, నా చేతులు నీకు ఇత్తనయ్య' అని మొక్కుకుంది అంట..." అంటూ పక్కనే చెట్టు కింద సైకిల్ స్టాండు వేసి పెట్టి, బిడ్డ నెత్తి మీద ఉన్న బతుకమ్మని ఎత్తి, తల మీద పెట్టుకొని గద్ద కాడికి పయనం అయ్యారు.

"అయ్యా... ఈ సారి గద్ద మస్తు ముస్తాబు చేసిల్లులే! దూరం నుంచే ఇంత ముద్దుగా కొడుతుంది అంటే దగ్గరికి పోతే ఇంక ఎంత ముద్దుగ కొడతదోనే...!"

"అవును బిడ్డా... ఆకాశం నచ్చత్రాలు కిందికి దిగి, గౌరమ్మ తల్లికి హారతి పట్టినట్టు అగుపడుతుంది కదనే... ఎంత ముద్దుగా గొడతంది." అన్నది కాంతం.

"అమ్మా... గాల్లో తేలుతూ ఎర్రగా ఎంత ముద్దుగా ఉన్నాయో..."

"గాల్లో తేలడం ఏందే ఎర్రి దానా..." అంటూ బిడ్డ నెత్తి మీద నవ్వుతూ మొట్టికాయ వేసింది కాంతమ్మ.

"అదిగో అటు సూడు అమ్మా..." అంటూ గాలితో కబుర్లు చెప్తున్నట్లు, గాలితో పాటు చెంగు చెంగున తేలుతున్న గ్యాస్ బుగ్గల్ని చూపింది.

"నీకు వయసొచ్చిన, ఇంకా సిన్నతనం పోనేదు.. కొనిస్తాలేవే తల్లీ." అంటూ తన చీర కొంగు చివరన వేసిన ముడిని విప్పుతూ.. "ఇదిగో బిడ్డా నువ్వు అల్లరి మానేసి నేను చెప్పేది ఇనాలే మరి..."

"సరేనే అమ్మా..." అని అంటూ, కాంతమ్మ ఇచ్చిన మడిచిన పది రూపాయల నోటుని తీసుకుంది సంధ్య.

"తల్లీ మన బంటి గాడు ఏడి?"

"వాడు దప్పులతో బతుకమ్మని తోలుకపోయేటప్పుడే ఎల్లిపోయిండు గద్దె కాడికి..."

"వాడికి ఎప్పుడూ తొందరనే తల్లీ! వాడికి ఒకటి కొనిచ్చి నువ్వు ఒకటి కొనుక్కో..."

"ఆఁ సరే సరే" అంటూ తన మిత్రులు కోలాటాలు పట్టుకొని బతుకమ్మ చుట్టూ ఆడటం చూసి వాళ్ళ చెంతకి పరుగు తీసింది. గద్దె వద్ద రెండు గుంపులు.. ఒకటి పెద్ద కులం వాళ్ళది, రెండోది చిన్న కులం వాళ్ళది! కాంతమ్మకి అంత దూరం నడిచి వచ్చేసరికి కళ్ళు బైర్లు కమ్మి, అక్కడ కనిపించిన బండరాయి దగ్గర కూర్చుండి పోయింది. యీరన్నని తన ముందు ఉన్న గుంపు దగ్గర బతుకమ్మని పెట్టమని చెప్పింది. యీరన్న, బతుకమ్మని అక్కడ పెట్టి, బండరాయి మీద కూర్చున్న కాంతమ్మకి నీళ్ళు తెచ్చి ఇచ్చాడు. కాంతమ్మ గబగబా నీళ్ళు తాగి అలిసిన శరీరంతో పెద్ద శ్వాస తీసుకుంది.

ఒక్కసారిగా యీరన్నకి వీపు మీద నెట్టినట్టైయా, ధబేలున మోకాళ్ళ మీద వున్న యీరన్న బోర్లా పడ్డాడు. అప్పటి వరకు ఆటపాటలతో హడావుడిగా ఉన్న జనం అంతా తుఫాను ముందు ఉండే నిశబ్దంలా మారిపోయారు. కాంతమ్మ ఒక్కసారిగా లేచి, పడిపోయిన యీరన్నని లేపే ప్రయత్నం చేసింది. బోర్లా పడటంతో అక్కడే ఉన్న రాయి చీరుకొని మోచేయి నుంచి రక్తం కారింది. వెంటనే కాంతమ్మ తన బతుకమ్మలో ఉన్న గౌరమ్మని మొక్కి పసుపుతో చేసిన గౌరమ్మ నుండి చిటికెడు పసుపు పట్టుకెళ్ళి యీరి చేయికి గాయం అయిన చోట రాసింది.

అప్పుడే అక్కడ ఉన్న ఒక పెద్ద కులం గుంపు నుంచి ఒక మహిళ ముందుకు వచ్చి... "ఒసేయ్ కాంతం! ఏం చేస్తున్నావో ఏమైనా అర్థం అవుతుందా నీకు? గౌరమ్మని తీసి పసుపు పెడతావా? ఎంత అపచారం! గౌరమ్మకు కోపం అత్తే మనం కాలి బూడిద అవుతాం. నీ వల్ల ఊరు ఊరంతా నాశనం అవుతుందే! అర్థమయ్యిందా?" అని కనుబొమ్మలు పైకెత్తి నోటితో చేయి వేసుకుంది.

"అయ్యో! అట్ల అనకు తల్లీ... నా వల్ల ఊరికి కట్టం రానియ్యను తల్లీ..." అని మాట్లాడుతుంటే, అదే సమయంలో అదే గుంపులో నుంచి ఒక మహిళ అమ్మోరు వచ్చినట్టుగా ఊగడం మొదలెట్టింది. అందరూ తనని "శాంతించు తల్లీ" అంటూ వేడుకుంటున్నారు. తెచ్చిన ఫలహారాలు పెట్టిన అగరబత్తీలు తన ముందు పెట్టి, హారతులు పడుతున్నారు ఆడబిడ్డలు. కాసేపటికి ఆ మహిళ మాట్లాడింది.

"కాంతమ్మా!" అని పిలిచింది. చుట్టూ వున్న జనం దూరం జరిగారు. కాంతమ్మ వణుకుతూ ముందుకు వచ్చి "తల్లీ! తప్పయింది తల్లీ! సమించూ..." అంటూ మోకాళ్ళ మీద కూర్చుని వేడుకుంది.

"నా బతుకమ్మకి వాడే పువ్వులే ఎంగిలి కాకుండా వుండే పూలతో సేత్తరు... అట్టాంటిది పసుపుతో చేసిన నన్నే ఎంగిలి సేత్తవా... నీకు ఎంత ధైర్యమే..."

"లేదమ్మా తప్పయి పోనాది... " ఏడుస్తున్న స్వరంతో అంది.

"చేసిందంతా చేసి, తప్పయింది అని లెంపలేసుకుంటే అయిపోతుందా?"

"అమ్మా! ఏం చెయ్యమంటారో చెప్పమ్మా..." అని అందరూ చేతులు పైకి లేపి దండాలు పెట్టారు.

"నా పూల పండుగ అయ్యి, ఆ గంగమ్మ ఒడిలో నేను అడుగు పెట్టే వరకు నువ్వు ఆ నీళ్ళ మధ్య నిలబడాలి!" అని ఊగుతూ కింద పడిపోయింది.

ఎవరూ ఏం మాట్లాడకపోయినా కాంతం వెళ్లి నీళ్ళ మధ్య నిల్చుంది. అందరి నోరుకి బయపడి యీరన్న కూడా ఏం మాట్లాడలేదు. అందరూ మళ్ళీ వెళ్లి బతుకమ్మ ఆడుతున్నారు. అమ్మవారు పూనకం వచ్చి కింద పడిన ఆ మహిళ కూడా లేచి, మళ్ళీ ఆటలో పడింది.

"మంచి పనయింది దీనికి. లేక పోతే నాకు ఎదురు చెప్తుందా." అంటూ రుసరుస కాంతం వైపు చూసింది.

"ఏం అయింది అక్కా, దానితో నీ గొడవ ఏమిటి? నీకు అమ్మవారు రాకున్నా ఎందుకు అలా నటించావు?"

"మరి లేకుంటే ఏమిటే దాని పొగరు.. దాని తల పొగరు దించడానికి ఇలా చేశాను. మొన్న మా ఇంట్లో ఇల్లు సర్దుతుంటే, పట్టుచీర ఇచ్చి, కట్టుకుని పండుగ చేసుకో అని అంటే.... 'వద్దు తల్లి' అని వెనక్కి ఇచ్చింది. పోనీలే పాపం అని చూస్తే, నాతోనే అలా ప్రవర్తిస్తుందా. అందుకే ఇప్పుడు ఇలా ప్రతీకారం తీర్చుకున్నా!" అంటూ పొగరుగా ఒక చిరునవ్వు నవ్వి మళ్ళీ ఆటలో పడింది జ్యోతి.

యీరన్న, గట్టు దగ్గరకు పోయి, నీళ్లలో ఉన్న కాంతమ్మని చూస్తూ కూర్చున్నాడు.

"ఎందుకే, యీ యీరిగాడి కోసం ఇదంతా అవసరమా? కూలి పనిలో నాకు ఎన్ని దెబ్బలు తగులుతాయో తెలుసా.. టిన్నరు రాసుకొని ఉంట. ఈ చిన్న దెబ్బ కోసం నువ్వు జరమచ్చి నీళ్లల్ల నిల్సున్నవు. రేపు పొద్దున లెత్తవా ఇగ..."

"ఎం గాదులే అయ్యా. నువ్వు అట్ట బాధ పడకు. అసలు ఈ పండుగ ఎవరి పండుగ అయ్యా!"

"ఏమోనే... నాకు సక్కగా తెలవదు. కానీ గిరిజనుల కాడ మొదలు అయ్యింది అని మా తాత సెప్పేవాడు. పుట్టిన పిల్లలు చనిపోయి మళ్ళీ పిల్లలు కాక బాధపడే వారికీ, పిల్లలు లేని వాళ్ళకీ పిల్లలు ఇచ్చే తల్లి అనీ, అలా పుట్టిన పిల్లలకి బతుకు అనీ, బతుకమ్మ అనీ బతుకయ్య అని పేర్లు కూడా పెట్టుకుంటారు! ఆ దుర్గమ్మ అవతారం అని ఎన్నో ఇసయాలు ఉన్నాయే.. ఏదో ఉత్తిగా అచ్చిన పబ్బం కాదే ఇది!"

"అవునయ్యా, రోజూ ఒకటి చేత్తం కదా, ఈ రోజు ఎందుకు రెండు బతుకమ్మలు చేయాలె?"

"ఏంలేదే, మన సంపదాయం అది. నువ్వు చుసినవా, ఎప్పుడయినా భోజనాలు పెడితే, ఏ ఒక్కసారి తిని లేవద్దు రెండోసారి

కూడా కొత్త నైన తినలే అని అంటాం. ఎందుకు.. గౌరవం, మన ప్రేమా ఆల్లకి అర్ధం కానీకి తిని లేవద్దు, రెండో సారి పెట్టుకో అని మళ్ళీ అలా సేత్తం. అది మన పద్ధతి, అంతేకాదు పెల్లి కూతురితో పాటు ఒకరిని తోడుగా పంపిస్తాం. అలానే బతుకమ్మని కూడా ఒంటరిగా కాకుండా చిన్న బతుకమ్మతో పంపుతాం! అవునే ఇప్పుడు ఇయాన్నీ ఎందుకు అడుగుతున్నావు?"

"ఏం లేదులే అయ్యా. అదిగో బతుకమ్మ పండుగ అయినట్టు ఉంది, అందరూ బతుకమ్మ పట్టుకొని వస్తున్నారు!" అంటూ అటు వైపు చూసింది.

యీరన్న కూడా చూసాడు.

మోహన్‌రావు ముందు వస్తున్నాడు. చీకటి కారణంగా సరిగ్గా కనిపించక, అక్కడే ఉన్న బురదలో జారి పడ్డాడు. బతుకమ్మలు పట్టుకొని వచ్చే వాళ్ళు అంతా ఆగిపోయారు. గుండ్రాయి లాంటి శరీరం... కింద పడగానే అరిచిన అరుపు ఊరి పొలిమేర వరకు వినపడింది. అందరూ తను లేవడానికి పడుతున్న ప్రయాస చూస్తూ వున్నారే కానీ, ఎవరు వెళ్లి అతనిని లేపడానికి ప్రయత్నం చేయడం లేదు. యీరన్న 'వెళ్లి లేపుదాం' అని ఆలోచించినా వాళ్ళ ఊరి కట్టుబాటు గుర్తు వచ్చింది. తక్కువ కులం వాళ్ళని పెద్ద కులం వాళ్ళు తాకరు, పొరపాటున తాకినా వెళ్లి స్నానం చేస్తారు. కానీ పందులు అప్పటి వరకు ఆ బురదలో బోర్లి వెళ్ళడం చూసిన వాళ్లంతా మోహన్‌రావుని లేపడానికి అడుగు వెనక్కి వేస్తున్నారు. లేవడానికి ప్రయత్నం చేసి మళ్లీ దబాలున పడిపోయాడు. ఈసారి నడుముకి దెబ్బ తగిలింది కాబోలు.. నడుము పట్టుకొని అమ్మా.. అయ్యా.. అంటూ వాళ్ళ కులం వాళ్ళ వైపు చూస్తున్నాడు. అసలు ఎవరూ మొహం కూడా చూడడం లేదు. అంతలో యీరన్న చెయ్యి ముందుకు చాపాడు. మోహన్ రావు అక్కడే నిలబడి చూస్తున్న వాళ్ళ వైపు చూస్తూ సూరన్నకి చెయ్యి అందించాడు. తనని చెరువు దగ్గరికి తీసుకొని వెళ్తుండగా వెనక నుంచి ఒక అరుపు... "చిన్న కులం వాడితో చెయ్యి కలుపుతావా" అని.

మోహన్‌రావు వెనక్కి తిరిగి చూసాడు. ఎవరూ నోరు మెదపలేదు. దెబ్బ తగిలిన కాలిని నేలకు ఈడుస్తూ, ఒక చేతిని నడుము మీద పట్టుకొని, మరో చేయి సూరన్న మెడ మీద వేసి ముందుకు వెళ్తున్నాడు.

వాళ్ళు చెరువు దగ్గరికి వెళ్ళడం చూసి "మేము బతుకమ్మని వదిలే చెరువులో ఈ బురద కలిపితే నీళ్ళు చెడిపోతాయి.." వెనక నుంచి మరొకరి మాట వినబడ్డా, ఈ సారి వెనక్కి కూడా చూడలేదు. ఆ నీళ్ళల్లో మోహన్‌రావుని కడిగి యీరన్న బయటకి పట్టుకొని వచ్చాడు.

మోహన్‌రావుని యీరన్న ఇంటికి తీసుకొని వెళ్తున్నాడని అందరికీ అర్ధం అయ్యింది. ఒక్క క్షణం వాళ్ళ ముందు ఆగి, "ఆ గంగమ్మకి మీలాగా మురికిని దాచుకొనే తత్వం లేదు!" అని ముందుకు వెళ్ళాడు.

మోహన్‌రావు మనసులో ఎన్నో ఏళ్ల నుండి వున్న జాతి వివక్ష , కులపు గోడలు గాయాలు కడిగిన నీళ్లలోనే వదిలి స్వచ్ఛంగా యీరన్నతో కలిసి, ముందుకు నడిచాడు మోహన్‌రావు.

అక్కడ అందరు ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు.

గంగమ్మ గల గల పారుతూ దర్పణంలా స్వచ్ఛంగా ముందుకి కదిలిపోతునే ఉంది!



**ఖజురాహో ..** మన దేశపు వారసత్వ సంపదల్లో ఒక విలక్షణమైన పర్యాటక కేంద్రం మధ్యప్రదేశ్ రాష్ట్రంలో ఉన్నటువంటి ఖజురాహో. అనేక హిందూ మరియు జైన దేవాలయ సముదాయాలున్న ఖజురాహో- ఝాన్సీ నుండి ఆగ్నేయంగా 175 కిమీ దూరంలో ఉంది. ఇక్కడ శిల్పాలన్నీ నగరశైలిలో శృంగార రస ప్రధానంగా రూపొందాయి. ఇక్కడి నిర్మాణాలలో అధిక శాతం క్రీ.శ. 950 నుండి 1050 సంవత్సరాల మధ్యకాలంలో చండేలా రాజవంశ పాలనలో నిర్మించబడ్డాయి. ఎనభై ఐదు ఆలయాలు ఉన్న ఈ సముదాయాలలో, ప్రపంచ వారసత్వప్రదేశాలల్లో ఒకటిగా యునెస్కో గుర్తింపుతో ప్రఖ్యాతి గాంచిన **కందరీయ మహాదేవ ఆలయ** చిత్రమిది.